సాహితి గది గోడలకు ఆవలి
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

వరంగల్

: fb.com/vaartha Digital

Published from Warangal, Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

23-4-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 82 పేజీలు: 8+16 వెల: 6.50

నేడు రాష్ట్ర కేబినెట్ సమావేశం 2

ఉగ్రవాదానికి భారత్ తలవంచదు: ప్రధాని 5

## కెసిఆర్, హరీష్‌కు ఊరట

### ఘోష్ నివేదిక అమలుపై హైకోర్టు స్టే



నివేదిక ఆధారంగా చర్యలు చేపట్టొద్దని ప్రభుత్వానికి ఆదేశాలు

విచారణలో నిబంధనలు పాటించలేదన్న ధర్మాసనం

ఘోష్ కమిషన్ ఏర్పాటు చట్టబద్ధమేనని స్పష్టం

కోర్టు ఎవరికీ క్లీన్‌చిట్ ఇవ్వలేదన్న మంత్రి ఉత్తమ్

సుప్రీంలో సవాల్ చేసే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త** :కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలపై విచారణ కోసం ఏర్పాటు చేసిన జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నివేదికను హైకోర్టు నిలిపివేసింది. ఘోష్ కమిషన్ నివేదిక అమలుపై స్టే విధించింది. కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా నాటి బిఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు, సంబంధిత అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశించింది. విచారణ ప్రక్రియలో సహజ న్యాయ సూత్రాలను విస్మరించారని, నిబంధనలకు విరుద్ధంగా జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణ సాగిందని కోర్టు అభిప్రాయపడింది. ముఖ్యంగా విచారణ కమిషన్ చట్టంలోని సెక్షన్ 8బి, 8సి ప్రకారం బాధ్యులకు నోటీసులు ఇచ్చి వారి వివరణ తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, ఆ ప్రక్రియను సరిగ్గా అనుసరించలేదని పిటిషనర్ల తరుపు లాయర్లు చేసిన వాదనలతో న్యాయస్థానం ఏకీభవించింది. ఈ మేరకు కమిషన్ నివేదిక అమలుపై స్టే విధిస్తూ బుధవారం కీలక తీర్పు వెలువరించింది. అదే సమయంలో కమిషన్ నియామకం చట్టబద్ధమేనని హైకోర్టు స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 6ను సమర్థించిన హైకోర్టు.. ఆ జివో ఆధారంగా ఏర్పాటైన కమిషన్ నివేదికను అసెంబ్లీలో చర్చించకుండానే బహిర్గతం చేయడాన్ని తప్పుబట్టింది. మేడిగడ్డ బ్యారెజిలో అవకతవకలపై విచారణ నిమిత్తం జస్టిస్ పిసి ఘోష్ కమిషన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2024 మార్చి 14న జారీ చేసిన జివో 6ను సవాలు చేస్తూ మాజి సిఎం కెసిఆర్, మాజిమంత్రి హరీశ్‌రావు, ఉన్నతాధికారులు స్మితా

>>2

## ఎంఒయులు వేగంగా అమలులోకి

రియల్ టైం డాష్ బోర్డుల ద్వారా పర్యవేక్షించాలి

సంస్థలను మూడు కేటగిరీలుగా విభజించాలి

క్యూర్, ప్యూర్, రేర్ ప్రాంతాల్లో సంస్థలకు భూములు

పెట్టుబడులపై సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి



బుధవారం పెట్టుబడులపై సమీక్షలో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్22:** వివిధ వేదికలపై ప్రముఖ కంపెనీలతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాలు (ఎంవోయూ) వేగంగా అమల్లోకి వచ్చేలా చూడాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇప్పటికే భూముల కేటాయింపుతో పాటు ఇతర అనుమతులు ఇచ్చిన కంపెనీలు త్వరగా పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. దావోస్, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌తో పాటు ఇతర వేదికలపై వివిధ సంస్థలతో కుదుర్చుకున్న ఎంవోయూలపై పురోగతిపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి

>>2

## వడివడిగా అభివృద్ధి పనులు

జూన్‌కు బైపాస్- కేబుల్ బ్రిడ్జి మధ్య రిటైనింగ్ వాల్ పూర్తి

మొక్కజొన్న 2.17 ల. ట, వరి 2.37 ల.ట. కొనుగోళ్లు వేగవంతం

ఖమ్మంలో 92 కోట్లతో 20 ఎకరాల్లో స్పోర్ట్స్ హబ్: మంత్రి తుమ్మల



**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త:** అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసి ఫలితాలు ప్రజలకు చూపాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. పౌర సరఫరాలు, మార్కెటింగ్, మార్క్‌ఫెడ్, పంటల కొనుగోలు, మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ ప్రగతి, ఖమ్మం నగర కార్పొరేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పంటల కొనుగోళ్లు, నగర అభివృద్ధి పనులను ఎటువంటి ఆటంకాలు లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ మొదటి వారానికి బైపాస్ నుంచి కేబుల్ బ్రిడ్జ్ వరకు మున్నేరు రిటైనింగ్ వాల్ ఎడమ, కుడి వైపుల పనులు పూర్తవ్వాలని, చిన్న గ్యాప్ కూడా ఉండకూడదని స్పష్టం చేశారు. యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఖమ్మం నగరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా అభివృద్ధి చేసే దిశగా ఇండోర్ స్టేడియం, క్రికెట్ స్టేడియం, క్రీడాకారుల వసతి గృహాలు, అతిథి గృహం, కన్వెన్షన్ హాల్ వంటి సదుపాయాలతో 20 ఎకరాల్లో 92 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కనీసం 50 శాతం కేంద్ర నిధులు సమీకరించేలా చర్యలు తీసుకోవాలని, 200 మంది క్రీడాకారులకు వసతి కల్పించేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. మార్కెట్ అభివృద్ధి పనులు, పంటల కొనుగోళ్లు సమాంతరంగా జరగాలని, మార్కెట్ కాంపౌండ్ వాల్, మిగిలిన షెడ్లు ఈ నెలలో పూర్తి చేయాలని ఆదేశించారు. మార్కెట్‌లో నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, సోలార్ పవర్ వినియోగంపై ప్రణాళికలు సిద్ధం చేసి విద్యుత్ ఉత్పత్తి, వినియోగం, విక్రయం అంశాలపై నివేదిక సమర్పించాలని సూచించారు. వరి కొనుగోళ్లలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకూడదని, ఇతర జిల్లాలతో సమన్వయం చేసుకుని వరి తరలింపులు చేపట్టాలని సూచించారు. జీపీఎస్ ట్రాకింగ్ ఉన్న వాహనాలనే వినియోగించాలని ఆదేశించారు. ఫీల్డ్ స్థాయిలో పర్యవేక్షణ పెంచి రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, 4 లక్షల 34 వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా ఉండగా 2.17 లక్షల టన్నుల కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇప్పటివరకు 39 వేల టన్నులు కొనుగోలు చేశామని చెప్పారు. జిల్లాలో 72 వేల టన్నుల నిల్వ సామర్థం ఉందని తెలిపారు. 2,37,500 మెట్రిక్ టన్నుల వరి కొనుగోళ్లకు 308 కేంద్రాలు ప్రతిపాదించగా, 240 కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు. 45 లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ సమావేశంలో ఖమ్మం మునిసిపల్ కార్పోరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడి ఎపి మాజీ సిఎం

## నాదెండ్ల కన్నుమూత

కొద్ది రోజులుగా ఆసుపత్రిలో చికిత్స

1980 దశకంలో టిడిపి, కాంగ్రెస్‌లో నాదెండ్ల కీలక పాత్ర

1984లో నెల రోజులు ముఖ్యమంత్రి బాధ్యతలు

తెలుగు సిఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, మరికొందరు ప్రముఖుల ప్రగాఢ సంతాపం

నేడు హైదరాబాద్‌లో అంత్యక్రియలు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఏప్రిల్ 22, ప్రభాత వార్త:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్‌రావు(91) అనారోగ్యంతో కన్నుమూశారు. వయోభారంతో వచ్చిన ఆరోగ్య సమస్యకు గత నెల రోజులుగా కాంటినెంటల్ ఆసుపత్రిలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో బుధవారం ఉదయం 11.45 గంటలకు

>>2

## కదలని బస్సులు

రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగిన ఆర్టీసీ సమ్మె

తీవ్ర అవస్థలు పడిన ప్రయాణికులు

పెద్దపల్లిలో అద్దె బస్సుల్లో పురుషులకూ ఉచిత ప్రయాణం

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో అద్దె బస్సులు

25% నడిపామంటున్న సంస్థ యాజమాన్యం



బుధవారం గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్ద ఆందోళన చేస్తున్న ఆర్టీసీ జెఎసి నేతలు, ఉద్యోగులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్22:** తెలంగాణలో రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు పెద్ద ఎత్తున సమ్మె దిగారు. ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో అర్ధరాత్రి నుంచి కార్మికులు సమ్మెకు సైరన్ మోగించారు. దీంతో డిపోల్లోనే ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. సమ్మెతో రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు పలుచోట్ల ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించగా మరికొన్ని చోట్ల ప్రజల ఇబ్బందుల దృష్ట్యా ఆర్టీసీ అద్దె బస్సులు నడుపింది. తొలిరోజు(బుధవారం) ఆర్టీసి కార్మికుల సమ్మె ప్రశాంతంగా సాగింది. చాలా ప్రాంతాల్లో మగవారి నుంచి టికెట్ తీసుకోకుండా బస్సుల్లో ఎక్కించుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సులు రోడ్డు ఎక్కలేదు. సీనియర్ ఐఏఎస్ అధికారుల కమిటీతో ఆర్టీసి జేఏసీ జరిపిన చర్చలు విఫలం కావడంతో ఆర్టీసీ

>>2

## ప్రతిపక్షాల విమర్శల్లో వాస్తవం లేదు

-మంత్రి పొంగులేటి



**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల్లో అర్థం లేదని, ఈ ప్రభుత్వం ఏ ఒక్క పథకాన్ని నిలిపివేసిందో వారు సమాధానం చెప్పాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో నగరం 1, 59, 60 డివిజన్లకు చెందిన 27 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ, గత ప్రభుత్వంలో ప్రారంభించిన మంచి పథకాలను కొనసాగిస్తూనే.. కొత్తగా ఆరు గ్యారంటీల హామీలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమ ఫలాలను నేరుగా పేదల గడప వద్దకే చేరుస్తున్నామని మంత్రి తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.2 లక్షల రుణమాఫీ వంటి కీలక నిర్ణయాలతో ప్రజలకు అండగా ఉంటున్నామన్నారు. గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వకుండా పేదలను మోసం చేసిందని, తమ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందిస్తోందని చెప్పారు. ప్రభుత్వం విద్య, ఆరోగ్య రంగాలకు పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే అంతర్జాతీయ ప్రమాణాలతో ఖియంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ఖి నిర్మిస్తున్నామని మంత్రి వివరించారు. విద్యార్థుల సంక్షేమం కోసం డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మొటిక్ ఛార్జీలను 200 శాతం పెంచినట్లు గుర్తుచేశారు. ఇటీవల ఎన్నికల్లో ప్రజలు ప్రతిపక్షాలకు తగిన సమాధానం చెప్పారని, ఇప్పటికైనా నిరాధార ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మేయర్ పూనుకొల్లు నీరజ , ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ అనిత, ప్రత్యేక అధికారి రమేష్, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ జయచందర్ , ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు తీర్పుతో కాంగ్రెస్ గోబెల్ ప్రచారం పటాపంచలు: కెటిఆర్

7

## అనంతలో హనీ ట్రాప్ కలకలం!

తేలిన 19 మంది బాధితులు

రూ.5 నుండి రూ.25 లక్షలు దోపిడి


కొనసాగుతున్న సీక్రెట్ దర్యాప్తు

ముఠాతో పోలీసుల ములాఖత్

ఇద్దరు సిఐలపై వేటుకు రంగం సిద్ధం

**అనంతపురం క్రైమ్ ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** వయ్యారపు వలపులతో నెరవేసిన ముఠా అందిన కాడికి దోచేస్తోంది. అమాయకును టార్గెట్ చేస్తూ లక్షలాది రూపాయలను నిలుదోపిడి చేస్తున్న ఘటన వెలుగుజూసింది. మొత్తంగా బాధితులు 19 మందిని ఈ ట్రాప్ లో లాగి లక్షలాది రూపాయలను ఆ ముఠా పోగు చేసినట్లు సమాచారం. దీన్నిబట్టి చూస్తే ఈ తతంగం అంతా పోలీసుల కనుసన్నల్లోనే నడుస్తున్నట్లు విశ్వసియనీయమైన సమాచారం. ముందు తీయగా మాట్లాడి ముగ్గులు దించిన తర్వాత బ్లాక్మెయిల్ తరహాలో డబ్బులు డిమాండ్ చేసి ఈ ముఠా అమాయకుల జీవితాలతో ఆడుకుంతోంది. వివరాల మేరకు... అనంతపురం, రూరల్ పరిధిలోని రాప్తాడులో హనీ ట్రాప్ తో పలువురు భయాందోళనకు గురవుతున్నారు. ఈ వలపు వలలో పడిన అమాయకులు వారి బారి నుండి కాపాడాలని కోరుతున్నారు. ఈ రొచ్చులో ప్రభుత్వ అధికారులు, బడా బాబులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులను మహిళలతో ట్రాప్ చేస్తున్న ముఠాపై పోలీసులు కేసు నమోదు చేసారు. ముందుగా పరిచయం చేసుకొని ఇంటికి రమ్మంటారు.. ఆ తర్వాత బట్టలు విప్పించి ఫోటోలు, వీడియోలు తీస్తారు. ఆలోగా ఆమె బంధువులమంటూ ముఠా మొత్తం రంగంలోకి దిగుతారు.

పరువు కాస్తా బజారుకు ఈడుస్తామని భయపెట్టడం, అందిన కాటికి దోచేయడం చేస్తారు.. ఇలా ఓ రిటైర్డ్ అధికారిని కూడా వలలో వేసుకొని చివరకు కాళ్ళ బేరానికి వచ్చి ఆయన రూ. 3 లక్షలు సమర్పించుకున్నట్లు సమాచారం. ఇప్పటివరకు 19 మంది బాధితుల నుండి డబ్బులు వసూలు చేసిన 8 మంది సభ్యులతో కూడిన ముఠాపై జిల్లా ఎస్పీ జగదీష్ సీరియస్ గా పరిగణించారు. ముఠాలో ఐదుగురు మహిళలు, ముగ్గురు పురుషులు ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఎస్పీ స్వయంగా దర్యాప్తు పర్యవేక్షణ కొనసాగించడంపై ఆసక్తికర విషయాలు వెలుగు చూస్తున్నాయి. అనంతపురంలో నయా ఖిహనీ ట్రాప్ దెబ్బకు కొందరు భయపడి ఊరు వదిలి వెళ్ళినట్లు తెలుస్తోంది. బాధితుల్లో వీఆర్ఓ, ఫిజియోథెరపిస్టు, ఆర్ఎంపీలు, కిరాణా వ్యాపారులు, రియల్టర్లు. వున్నారు. వీరి వలలో పడి చిక్కుకుని బయట పడలేక ఓ బాధితుడు ఆత్మహ? చేసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఖిహనీఖి ముఠాకు పోలీసులు సహకరిస్తున్నట్లు విచారణలో తేలినట్లు సమాచారం. దీంతో అనంతపురం పరిధిలోని ఇద్దరి సిఐలపై బదిలీ వేటు వేసినట్టు సమాచారం. పూర్తిస్థాయి వివరాలు తెలియాల్సి ఉంది.



## బెంగాల్‌లో బాబ్రీమసీదు నిర్మాణం కల్ల!

ఉత్తర 24 పరగణాల్లో హోంమంత్రి అమిత్‌షా

**ఉత్తర 24 పరగణాలు(బెంగాల్), ఏప్రిల్ 22:** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మరోసారి ఘాటు విమర్శలు చేశారు. మమతా దీదీ ఎంత బలంగా కోరుకున్నా, ఎన్ని గట్టి ప్రయత్నాలు చేసినా బెంగాల్‌లో బాబ్రీ మసీదును బీజేపీ కట్టనీయదని స్పష్టం చేశారు. టీఎంసీ సిండికేట్ ముఠాలను బెంగాల్ నుంచి పారిపోయేలా చేస్తామన్నారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల తొలివిడత పోలింగ్ ఈనెల 23న జరుగనుండగా, రెండో విడత ప్రచారంలో భాగంగా నార్త్ 24పరగణాల జిల్లాలోని డుమ్ డుమ్ ఉత్తర్ ఏరియాలో బుధవారంనాడు జరిగిన ర్యాలీలో అమిత్‌షా పాల్గొన్నారు. బెంగాల్ మొత్తం సిండికేట్లమయంగా మారింది. సిమెంట్, ఇసుక, ఇటుకలు ఏమి కావాలన్నా మీరు సిండికేట్లకు డబ్బులు చెల్లించాలి. డమ్‌డమ్ ప్రజలకు నేను ఒకటే చెప్పదలచుకున్నాను. ఈనెల 5వ తేదీ తర్వాత ఈ సిండికేట్ సభ్యులు తట్టాబుట్టా సద్దుకుని బెంగాల్ నుంచి పారిపోవడమో, వసలపోవడమో జరుగుతుందని అమిత్‌షా అన్నారు. హుమయూన్ కబీర్ పేరుతో బాబ్రీ మసీదు నిర్మించాలని మమతాబెనర్జీ కోరుకుంటున్నారని అమిత్‌షా విమర్శించారు. ఎవరూ ఆందోళన చెందవద్దు. మమతా దీదీ ఎంత గట్టిగా కోరుకున్నప్పటికీ బెంగాల్‌లో బాబ్రీ మసీదు నిర్మాణాన్ని బీజేపీ అనుమతించే ప్రసక్తే లేదు అని అన్నారు. ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ, దుర్గాపూర్ మెడికల్ కాలేజీ, సౌత్ కోల్‌కతా లా కాలేజీలో ఘటనలు చూస్తే రాష్ట్రంలో శంతిభద్రతలు ఎంత దయనీయంగా ఉన్నాయో అర్థమవుతుందన్నారు. మే 5 తర్వాత ఆ పరిస్థితి ఉండదని, చిన్నారి ఆడపిల్లలు కూడా ధైర్యంగా స్కూటరుపై బయటకు వస్తే ఏ దుండగుడు అడ్డుకునే పరిస్థితి ఉండదని చెప్పారు. సోనార్ బంగ్లా కలను బీజేపీ సాకారం చేస్తుందని, బెంగాల్ సంస్కృతి, వారసత్వాన్ని తిరిగి సుసంపన్న చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ఖాతా కూడా తెరవదని కాంగ్రెస్ పార్టీ తమిళనాడు, పుదుచ్చేరిలో రెండంకెల స్థాయిలో కూడా సీట్లు తెచ్చుకోలేదని, బెంగాల్‌లో ఆ పార్టీ ఖాతా తెరిచే పరిస్థితి కూడా లేదని అమిత్‌షా అన్నారు. చొరబాటుదారుల నుంచి బెంగాల్‌కు విముక్తి కల్పించే వారికే ప్రజలు ఓటు వేయాలని, ఈ ఎన్నికలు ఒక ఎమ్మెల్యేనో, ప్రభుత్వాన్నో ఎన్నుకోవడానికే సంబంధించి ఎన్నికలు కావని, రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన ఎన్నికలని చెప్పారు. 294 అసెంబ్లీ స్థానాలున్న బెంగాల్‌లో తొలివిడత 152 నియోజకవర్గాల్లో ఈనెల 23న పోలింగ్ జరుగునుండగా, తక్కిన స్థానాల్లో ఈనెల 29న పోలింగ్ జరుగుతుంది. మే 4న ఫలితాలు వెలువడతాయి.




బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లా బెర్హంపూర్‌లో బుధవారం ఎన్నికల సామాగ్రితో పోలింగ్ సిద్ధమవుతున్న సిబ్బంది

### తమిళనాడు, బెంగాల్‌లో

# నేడు పోలింగ్

### మహారాష్ట్ర, గుజరాత్‌లో 3 చోట్ల ఉప ఎన్నికలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:** తమిళనాడులో మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాలకు గురువారం ఒకే దశలో పోలింగ్ జరుగనుండగా, పశ్చిమ బెంగాల్‌లో తొలి దశలో 152 స్థానాలకు పోలింగ్ జరుగనుంది. తమిళనాడులో 234 నియోజకవర్గాలలో 4,023 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 5,73,43, 291 మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎన్నికలకు ముందు, పోలింగ్ రోజు కార్యకలాపాలు సజావుగా సాగేందుకు జరుగుతున్న కార్యకలా పాలను సమీక్షించేందుకు తమిళనాడు ప్రధాన ఎన్నికల అధికారి అర్చన పట్నాయక్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో నూటికి నూరు శాతం ఓటింగ్ జరిగేలా చూడాలని ఎన్నికల సంఘం ప్రణాళిక రచించి, అందుకు అను గుణంగా ఓటర్లలో అవగాహన ప్రచార కార్య క్రమాలను చేపట్టింది. తమిళనాడు వ్యాప్తంగా పోలింగ్ విధుల కోసం 1.40 లక్షలకు పైగా పోలీసు సిబ్బందిని మోహరించారు. కీలకమైన పోలింగ్ కేం ద్రాల వద్ద అదనపు భద్రతా బలగాలను అందించేందుకు కూడా ఏర్పాట్లు చేశారు. జిల్లాల్లో ప్రచారం చేసిన బయటివారిని వారి సొంత నియోజక వర్గాలకు తిరిగి వెళ్లాలని ఆదేశించారు.

పశ్చిమ బెంగాల్‌లో 16 జిల్లాల పరిధిలోని 152 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 3.6 కోట్ల మంది ఓటర్లుండగా, 44వేల పోలింగ్ కేంద్రా లను ఏర్పాటు చేశారు. తొలి దశ ఎన్నికల్లో 1,478 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే పోలింగ్ దశల సంఖ్య గణనీయంగా తగ్గినప్పటికీ, నిబంధనలను కఠినంగా అమలు చేసే లక్ష్యంతో ఎన్నికల సంఘం చేపట్టిన నూతన, విశిష్ట చర్యల ఫలితంగా రాష్ట్రంలో కేంద్ర భద్రతా బలగాల మోహరింపు అపూర్వ స్థాయిలో కనిపిస్తోంది. ఇందులో భాగంగా సుమారు 2,407 కేంద్ర సాయుధ పోలీసు బలగాల (సిఎపిఎఫ్) కంపెనీలకు చెందిన 2.4 లక్షల మందికి పైగా సిబ్బందిని మోహరించింది. సుమారు 7,384 బూత్‌లను "అత్యంత సున్నితమైనవి" లేదా "క్లిష్టమైనవి"గా గుర్తించారు. బ్రెయిల్‌తో కూడిన ఇవిఎంలు, ర్యాంపులు, ప్రాధాన్యతా క్యూల ద్వారా ఓటర్లకు సౌకర్యాలను కల్పిం చింది.

మహారాష్ట్రలో రాహురి, బారామతి అసెంబ్లీ నియోజకవర్గాలకు, గుజరాత్‌లోని ఉమ్రీద్ అసెంబ్లీకి ఉప ఎన్నిక జరుగనుంది. గురు వారం పోలింగ్‌కు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది.

## నాదెండ్ల కన్నుమూత

>> మృతిచెందినట్లు కాంటినెంటల్ ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. 1935 జూన్ 23న ఆయన గుంటూరులో జన్మించారు. ఆయన మృతిపట్ల పలువురు నేతలు సంతాపం ప్రకటించారు. ఉస్మానియ విశ్వవిద్యాలయం నుంచి ఆయన న్యాయ విద్య పూర్తిచేశారు. 1978లో ఆంధ్రప్రదేశ్ అంసెబ్లీకి విజయవాడ తూర్పు నియోకజవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరుపున తొలిసారిగా ఎన్నికయ్యారు. మర్రి చెన్నారెడ్డి, టి. అంజయ్య కేబినెట్‌లో ఆయన మంత్రిగా పనిచేశారు. 1982లో తెలుగుదేశం పార్టీ స్థాపనలో కీలకపాత్ర పోషించారు. ఎన్టీఆర్‌కు రాజకీయంగా మార్గదర్శకుడిగా గుర్తింపు పొందారు. ఆంధ్రప్రదేశ్ 11వ ముఖ్యమంత్రిగా సైతం ఆయన నెల రోజులపాటు పనిచేశారు. 1984 అగస్టు 16 నుండి సెప్టెంబరు వరకు దాదాపు 31 రోజులపాటు ఆయన ముఖ్యమంత్రిగా కొనసాగారు. ఎన్టీఆర్ కేబినెట్‌లో ఆర్థిక మంత్రిగా పనిచేసిన ఆయన 1998-99 మధ్య ఖమ్మం జిల్లా లోకసభ సభ్యుడిగా సేవలందించారు. రాజకీయ వివాదాలు సైతం ఆయన జీవితంలో ఉన్నాయి. 1984లో ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని పడగొట్టి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఈ పరిణామం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఎన్టీఆర్ తిరిగి అధికారం చేపట్టడంతో ఆయన రాజీనామా చేశారు. తొలుత కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఆయన తరువాత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరిగా ఉన్నారు. అనంతరం మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. 2019లో బీజేపీలో చేరారు. వాకింగ్ విత్ డెస్టినీ పేరుతో 2012లో ఆయన తన ఆత్మకథను రాశారు. ప్రజల సందర్శనార్థం ఆయన భౌతిక కాయాన్ని జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసంలో ఉంచారు. సీనియర్ నాయకుడు బక్క జడ్సన్ ఆయన భౌతికకాయాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాదెండ్లకు ఇద్దరు కుమారులు కాగా అందులో ఒకరైన నాదెండ్ల మనోహర్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంత్రిగా కొనసాగుతున్నారు. ఆయనకు సోదరుడు నాదెండ్ల మురళి ఉన్నారు. కాగా పంజాగుట్టలోని వైకుంఠధామంలో గురువారం(నేడు) అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు నాదెండ్ల కుటుంబ సభ్యులు తెలిపారు. నాదెండ్ల భాస్కర్‌రావు మృతిపట్ల ఏపి సీఎం చంద్రబాబునాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ సంతాపాన్ని ప్రకటించారు. ఆయన కుమారుడు నాదెండ్ల మనోహర్‌ను ఆయన ఫోన్‌లో పరామర్శించారు. అలాగే ఏపి ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సైతం తన సంతాపాన్ని ప్రకటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. 70వ దశకం నుంచి ప్రజాజీవితంలో ఉన్న ఆయన పరిజ్ఞానం ఎంతో విలువైనదన్నారు. ఆయన కుటుంబ సభ్యులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఓ ప్రకటనను విడుదల చేశారు. నాదెండ్ల మృతిపట్ల మాజీ మంత్రి మేచినేని కిషన్‌రావు తన సంతాపాన్ని ప్రకటించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ నాయకులు లక్ష్మణ్, వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు, గుత్తా సుఖేందర్‌రెడ్డి నాదెండ్ల భౌతికకాయానికి నివాళులు అర్పించారు.

### భాస్కరరావు మృతిపట్ల సిఎం రేవంత్, పిసిసి చీఫ్ మహేశ్ సంతాపం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్22:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు మృతిపట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. శాసనసభ్యుడిగా, మంత్రిగా, ఎంపీగా సుదీర్ఘ రాజకీయ జీవితంలో వారి అనేక ప్రజాహిత కార్యక్రమాల్లో పాల్గొన్నారని గుర్తుచేశారు. ఈ దుఃఖ సమయంలో వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని, భాస్కరరావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. వారి మరణంపట్ల ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మాజీ సీఎం నాదెండ్ల భాస్కర్‌రావు మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు.

### ఆరుగురు ఐపిఎస్‌లకు

# డిజిలుగా పదోన్నతులు

### రాష్ట్రంలో 11కు చేరిన డిజిల సంఖ్య

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అదనపు డిజి హోదాలో వున్న ఆరుగురు సీనియర్ ఐపిఎస్ అధికారులకు డిజిలుగా పదోన్నతి ఇస్తూ సర్కారు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. పదోన్నతులు అందుకున్న వారిలో 1995 బ్యాచ్‌కు చెందిన వారు ముగ్గురు వుండగా 1996 బ్యా చ్‌కు చెందిన వారు మరో ముగ్గురు వున్నారు. 1995 బ్యాచ్‌కు చెందిన వారిలో శాంతి భద్రతల అదనపు డిజిగా వున్న మహేష్ భగవత్, ఎస్‌పిఎఫ్ డిజిగా వున్న స్వాతి లక్రా, పోలీసు నియామక మండలి ఛైర్మన్‌గా వున్న శ్రీనివాసరావు, 1996 బ్యాచ్ అధికారుల్లో గ్రే హౌండ్స్ బాస్‌గా వున్న అని ల్ కుమార్, సిఐడి చీఫ్ చారు సిన్హా, సిటీ పోలీసు కమిషనర్ సజ్జన్నర్ వున్నారు. వీరిని కలుపుకుంటే రాష్ట్ర పోలీసు శాఖలో డిజి హోదాలో వున్న వారి సంఖ్య 11 చేరింది. వీరిలో హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వున్న 1991 బ్యాచ్ అధికారి సి.వి ఆనంద్ అందరికంటే సీనియర్ కాగా ఆయన తరువాత డిజిపిగా వున్న 1994 బ్యాచ్ అధికారి బి.శివధర్ రెడ్డి, జైళ్ల శాఖ డిజి సౌమ్యా మిశ్రా, పోలీసు అకాడమి డైరెక్టర్ అభిలాష్ బిస్త్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ వున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ఒకేసారి 11 మంది అధికారులు డిజి హో దాలో వుండడం ఇదే తొలిసారి. కాగా వీరిలో డిజిపి శివధర్ రెడ్డి ఈ నెలాఖరున, పోలీసు అకాడమి డైరెక్టర్ అభిలాష్ బిస్త్ వచ్చే జూన్ నెలలో పద వీ విరమణ చేయనున్నారు.

**ఆరుగురు అధికారులకు డిజిపి శుభాకాంక్షలు**

ఇదిలావుండగా డిజిలుగా పదోన్నతులు అందుకున్న ఆరుగురు సీనియర్ ఐపిఎస్ అధికారులకు డిజిపి శివధర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. పదోన్నతులు అందుకున్న ఆరుగురు డిజిపి శివధర్ రెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

### వారం - వర్జ్యం

23-04-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, అశ్విని కార్తె
సప్తమి రా. 8.54
పునర్వసు రా.9.01
వర్జ్యం : తె.4.47-ఉ.6.20, 2) ఉ.9.39-11.10
దు.ఉ.10.00-ఉ.10.51, 2)మ.2.56-మ.3.46
శుభసమయం: ఉ.5.30-6.30
రాహుకాలం - మ.1.30-3.00

### వార్తాఫలం

**మేషం:** పెట్టుబడి పెట్టిన వారికి భోగము లను ఇవ్వవలసి రావచ్చును. దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు.

**వృషభం:** ఆర్థికాభివృద్ధిని సాధిస్తారు. అనేకాంశములు అనుకూలంగా ఉండడం వలన ఉత్సాహంతో కార్యసాధన చేస్తారు.

**మిథునం:** నహాన్నిన్ని, ఓర్పును కనబరుస్తారు. దృష్టికి సంబంధించిన అనారోగ్యాలను ఎదుర్కొనవలసి వస్తుంది.

**కర్కాటకం:** బంధువులకు సంబంధించిన కొన్ని వ్యవహారములను పర్యవేక్షించవలసి వస్తుంది. సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**సింహం:** గృహములోని ఖర్చులను తగ్గించుటకు చేసే యత్నములు అనుకూలించవు. శత్రువుల నుండి రాజీయత్నములు వస్తాయి. వస్త్రలాభం.

**కన్య:** మీరు ఊహించని విధంగా ఆశ్చర్యం కలిగించే రీతిలో ఒకనొక విషయంలో లాభపడతారు. నూతన విద్యావకాశాలు కలవు.

**తుల:** మిత్రులతో స్పర్ధలు ఏర్పడతాయి. జాగ్రత్తలు వహించండి. ముఖ్యమైన వ్యవహారాలు సాఫీగా పూర్తిచేస్తారు.

**వృశ్చికం:** రోటీన్ సంతకాల విషయంలో జాగ్రత్తలు పాటించండి. వృత్తి వ్యాపారాలలో ప్రోత్సాహం లభిస్తుంది. ధనలాభం.

**ధనుస్సు:** ప్రతిష్టకు పోకుండా చర్చలతో సమస్యను పరిష్కరించుకుంటారు. ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి. వస్త్రలాభం.

**మకరం:** కుటుంబసభ్యుల ఆదరాభి మానాలు మీకు అండగా నిలుస్తాయి. శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది.

**కుంభం:** ప్రతిఫలాపేక్ష లేకుండా ఇతరులకు సహాయసహకారాలు అందిస్తారు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**మీనం:** అదనపు ఆదాయము లభించే మార్గాలు అనుకూలిస్తాయి. నిత్యం ఆధ్యాత్మిక ప్రసంగాలు మీకు మేలు చేస్తాయి. శుభవార్తలు అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కెసిఆర్, హరీష్‌కు ఊరట

>> సభర్వాల్, ఎస్.కే.జోషిలు పిటిషన్‌లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. పిటిషనర్ల తరుపు వాదనలను విన్న హైకోర్టు ప్రస్తుతానికి ఘోష్ కమిషన్ నివేదిక అమలుపై స్టే విధించింది. ఘోష్ కమిషన్ నివేదిక అమలుపై హైకోర్టు ప్రస్తుతానికి స్టే విధించడంతో ఈ కేసులో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, మాజీ మంత్రి హరీష్‌రావులకు పెద్ద ఊరట లభించినట్లయింది. కమిషన్ నివేదిక ఆధారంగా క్రిమినల్ చర్యలు లేదా తదుపరి విచారణలు చేపట్టాలనుకున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలకు బ్రేక్ పడింది.

**హైకోర్టు ఎవరికీ క్లిన్‌చిట్ ఇవ్వలేదు: మంత్రి ఉత్తమ్**

జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నివేదిక అమలుపై హైకోర్టు స్టె విధిస్తూ ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర నీటిపారుదలశాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పందించారు. ఈ తీర్పు కేవలం సాంకేతిక అంశాలకు సంబంధించిందే తప్ప, ఎవరికీ క్లీన్‌చిట్ ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఘోష్ కమిషన్ నియామకాన్ని హైకోర్టు పూర్తిగా సమర్థించిందని తెలిపారు. విచారణ నివేదికలో పేర్కొన్న కొందరు బాధ్యులపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి, వారికి నోటీసులు ఇవ్వలేదనే సాంకేతిక, విధానపరమైన అంశాలను మాత్రమే కోర్టు ప్రస్తావించిందని స్పష్టం చేశారు. నోటీసులు ఇవ్వని కారణంగా వారిపై చేసిన రిమార్క్స్ ఇన్ ఆపరేటివ్‌గా ఉంటాయని కోర్టు సూచించిందని వెల్లడించారు. ఇది పూర్తిగా ప్రొసిజరల్ అంశమని పేర్కొన్నారు. హైకోర్టు తీర్పు ఈ కేసులోని బాధ్యులెవరికీ క్లీన్‌చిట్ ఇవ్వలేదని, సిబిఐ విచారణకు ఎలాంటి అడ్డంకి లేదని స్పష్టం చేశారు. విజిలెన్స్, ఎన్‌డిఎస్‌ఎ నివేదికలను పరిశీలిస్తున్నామని వెల్లడించారు. ఈ అంశంపై సిబిఐ విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని గుర్తు చేశారు. అయితే 9 నెలలవుతున్నా సిబిఐ విచారణ చేయడం లేదని ఆరోపించారు. కాళేశ్వరం కూలిన సంగతి అందరికీ తెలుసునని వ్యాఖ్యానించారు. మేడిగడ్డ బ్యారేజీ దగ్గరికి వెళితే ఎవరికైనా ప్రాజెక్టు కుంగిన తీరు కనబడుతుందన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో కట్టిన ప్రాజెక్టు వాళ్ల హయంలోనే కుంగిపోయిందన్నారు. రెండేళ్లుగా కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చుక్క నీరు సాగుకు అందలేదని, అయినప్పటికీ ప్రతీ ఏడాది ఈ ప్రాజెక్టు పేరిట ప్రభుత్వం రూ.15 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్ల వరకు అప్పులు, వడ్డీలను ప్రభుత్వం భరిస్తుందని చెప్పారు. కాళెశ్వరం మూడు బ్యారేజీల పునాదులు అనుమానాస్పదంగా ఉన్నాయని ఇప్పటికే దేశంలో పేరొందిన సంస్థల నిపుణులందరూ అభిప్రాయపడ్డారని, అందుకు కారణాలను తేల్చాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. హైకోకోర్టు తీర్పుపై గురువారం జరిగే కేబినెట్ సమావేశంలో చర్చిస్తామని, ఆ తర్వాత భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని పేర్కొన్నారు.

**సుప్రింలో సవాల్ చేసే యోచనలో ప్రభుత్వం....**

కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణ కోసం ఏర్పాటు చేసిన జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ రిపోర్టును హైకోర్టు నిలిపివేసిన నేపథ్యంలో తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం యోచిస్తోంది. గురువారం జరిగే తెలంగాణ కేబినెట్‌లో కాళేశ్వరం అంశం చర్చకు రానుంది.

**కమిషన్ ఏర్పాటు నుండి హైకోర్టు తీర్పు వరకు...**

కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై కాంగ్రెస్ ప్రభుత్వం 2024 మార్చి 14న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటు చేసింది. దాదాపు 16 నెలలపాటు కమిషన్ విచారణ జరిపింది. ఆ తర్వాత 2025 జూలై 31న ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. నివేదికను మూడు వాల్యూమ్‌లు, 660 పేజీలతో రూపంలో సమర్పించింది. అనంతరం జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ రిపోర్టును అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. నివేదికలో కమిషన్ కీలక ఆరోపణలు చేసింది. నిపుణుల కమిటీ సూచనలు పట్టించుకోకుండా నాటి సిఎం కెసిఆర్ సొంత నిర్ణయాలు తీసుకున్నారని కమిషన్ పేర్కొంది. సిడబ్ల్యుసి అనుమతులు రాకముందే పనులు కాళేశ్వరం బ్యారెజిల పనులను ప్రారంభించారరని ఆక్షేపించింది. నాటి సిఎం కెసిఆర్, మాజి మంత్రి హరీశ్ రావు, ఇంజనీర్ల నిరక్ష్యం వల్లే మేడిగడ్డ బ్యారెజి కుంగిపోయిందని కమిషన్ నివేదికలో స్పష్టం చేసింది. నిర్మాణ వ్యయం అంచనాలకంటే 186శాతం అధికంగా ఖర్చు చేశారని రిపోర్టులో పేర్కొంది. 2023 అక్టోబర్‌లో బ్యారెజి దెబ్బతినడానికి నిర్మాణ లోపాలే కారణమని వెల్లడించింది. ఈ నేపథ్యంలో జస్టిస్ పిసి ఘోష్ రిపోర్టు ఆధారంగా కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై సిబిఐ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసింది.

అయితే కమిషన్ ఏర్పాటును సవాల్ చేస్తూ మాజీ సీఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఐఎఎస్ అధికారులు స్మితా సభర్వాల్, ఎస్.కె. జోషి తెలంగాణ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్‌సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టి మార్చి 12న తీర్పును రిజర్వు చేసింది. తీర్పును ఈనెల 8వ తేదీన వెలువరిస్తామని ప్రకటించినా సాధ్యంకాకపోవటంతో ఈనెల 22కు వాయిదా వేసింది. తాజాగా జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నివేదిక అమలుపై స్టే విధిస్తూ బుధవారం హైకోర్టు తుది తీర్పు వెలువరించింది.

# కదలని బస్సులు

>> కార్మికులు సమ్మెకు దిగారు. బస్సులు నిలిపేసి అన్ని డిపోల ముందు నిరసన చేపట్టారు. సమ్మెలో భాగంగా హైదరాబాద్‌లోని గన్ పార్క్ అమరవీరుల స్థూపం వద్ద ఆర్టీసీ జేఏసీ నాయకులు నివాళులు అర్పించారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు పరిష్కరించకుంటే మరో సకల జనుల సమ్మెకు సిద్ధమవుతామని ఆర్టీసీ జెఏసీ నేతలు స్పష్టంచేశారు. సమ్మె నేపథ్యంలో హైదరాబాద్ సహా అన్ని జిల్లాల్లోనూ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. కార్మికుల సమ్మెతో జూబ్లీ బస్ స్టేషన్‌లో బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. పికెట్, కంటోన్మెంట్, రాణిగంజ్ డిపోలలో బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఉత్తర తెలంగాణకు వెళ్లాల్సిన బస్సు సర్వీసులు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మెదక్ డిపో ముందు బైఠాయించి సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులను పోలీసులు పక్కకు తరలించి పటాన్‌చెరుకు ఓ బస్సు పంపించడంతో కార్మికులకు, పోలీసులకు మధ్య స్వల్ప తోపులాట జరిగింది. సంగారెడ్డిలో ఆర్టీసీ బస్సులు లేక విద్యార్థులు సమయానికి పరీక్షలకు వెళ్లలేక పోయామని చెప్పారు. కొందరు ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రులకు సైతం వెళ్లలేక పోతున్నామని వాపోతున్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సమ్మెతో మంచిర్యాల డిపో అధికారులు చర్యలు చేపట్టారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా కండక్టర్ లేకుండానే ప్రైవేట్ సిబ్బందితో ఆర్టీసీ బస్సులను నడిపిస్తున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సమ్మె ఉద్రిక్తతల నడుమ కొనసాగింది. ఆరు డిపోల పరిధిలో విధులు బహిష్కరించిన కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఆర్టీసీ డిపోలో జేఏసీ పిలుపుతో కార్మికులు సమ్మెకు దిగారు. ఆర్టీసీ కార్మికులకు ఈ పరిస్థితి రావటం బాధాకరమని ఏ కార్మికుడు కూడా సమ్మెకు వెళ్లాలని అనుకోరని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి తెలిపారు. సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు జగిత్యాల డిపోలో ఆయన సంఘీభావం తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ సమ్మె కొనసాగింది. జిల్లావ్యాప్తంగా 600 కుపైగా బస్సులు డిపోలకే పరిమితమైయ్యాయి. ఖమ్మంలో సమ్మె సంపూర్ణంగా కొనసాగింది. కార్మికులు బస్సులను నిలిపి తెల్లవారుజాము నుంచే డిపోల ఎదుట ఆందోళన చేశారు. రీజియన్‌లోని 7 డిపోలకు చెందిన 608 బస్సులు డిపోలకే పరిమితం అయ్యాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 7 డిపోల్లో బస్సులు పాక్షికంగా నడిచాయి. జిల్లాలో 180కి పైగా ఉన్న ఎలక్ట్రిక్, ప్రైవేటు బస్సులు ప్రయాణికుల్ని గమ్యస్థానాలకు చేర్చాయి. సూర్యాపేట జిల్లా కోదాడ బస్ డిపో ఎదుట కార్మికులు సమ్మెకు దిగారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీజేపీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తెలిపారు. సమ్మెకు పూర్తి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. కార్మిక వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వం పంతాలు పట్టింపులకు సామాన్యులు బలయ్యే ప్రమాదముందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఆర్టీసీని ప్రైవేటీకరించే కుట్రలో భాగంగానే ప్రభుత్వంలో విలీనం చేయడం లేదని ఆరోపించారు. సమ్మె నేపథ్యంలో హైదరాబాద్లో మెట్రో సర్వీసులను పెంచారు. సమ్మె కాలంలో 56 అదనపు మెట్రో రైళ్లు నడుపుతోంది. మియాపూర్-ఎల్బీనగర్ మార్గంలో 4 నిమిషాల 20 సెకన్లకో మెట్రో ట్రైన్, నాగోల్-రాయదుర్గం మార్గంలో 3 నిమిషాల 40 సెకన్లకో మెట్రో ట్రైన్ తిరుగుతున్నాయని సంస్థ ప్రకటించింది. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రాత్రి 11 గంటల తర్వాత కూడా మెట్రో సర్వీసులను పొడిగించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు మెట్రో ఎండీ వెల్లడించారు. ఇదిలా ఉండగా, బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా 25శాతం బస్సులు నడిపినట్లు ఆర్టీసి యాజమాన్యం తెలిపింది. పెద్దపల్లి జిల్లాలో గోదావరి ఖని డిపో నుంచి ఆర్టీసి అద్దె బస్సులను నడిపింది. డ్రైవర్లను ఏర్పాటు చేసుకొని పోలీసు బందోబస్తు మధ్య బస్సులను తిప్పింది. కండక్టర్లు అందుబాటులో లేకపోవడంతో పురుషులకు టికెట్లు తీసుకోలేదు. దీంతో ప్రయాణికులందరూ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు.

**నేడు ఆర్టీసీ డిపోల ఎదుట మహా ధర్నా**

తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గురువారం అన్ని ఆర్టీసీ డిపోల ఎదుట మహాధర్నాను నిర్వహించాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఉదయం 5 గంటల నుంచి ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం, యాజమాన్యం సమ్మె డిమాండ్లను పరిష్కరించకుండా మొండిగా వ్యవహరిస్తూ దాటవేత ధోరణి అవలంబిస్తూ, ప్రజలను ఆర్టీసీ కార్మిక వర్గాన్ని తప్పుదారి పట్టిస్తున్నదని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలు, అన్ని యూనిట్లు మహాధర్నాలను జయప్రదం జేయాలని జేసీసీ నాయకులు కోరారు.

**సమ్మె వద్దు.. మాయా మాటలను నమ్మొద్దు : యాజమాన్యం విజ్ఞప్తి**

ఇటీవల వివిధ యూనియన్లు ఇచ్చిన సమ్మె నోటీసులపై స్పందిస్తూ, కార్మిక శాఖ, యాజమాన్యం ఇప్పటికే ఐఏఎస్ అధికారులతో కూడిన కమిటీతో చర్చల ప్రక్రియను ప్రారంభించిందని టిజిఎస్‌ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి తెలిపారు. సంబంధిత అధికారి వద్ద ఒక వివాదం పెండింగ్‌లో ఉన్నప్పుడు సమ్మెకు దిగడం చట్టవిరుద్ధం. జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వారి వద్ద ప్రస్తుతం చర్చలు కొనసాగుతున్నాయి. ఈ ప్రక్రియ ముగియకముందే సమ్మెకు వెళ్లడం చట్టరీత్యా చెల్లదని చెప్పారు. చట్టవిరుద్ధమైన సమ్మెలో పాల్గొనడం వల్ల వేతన కోతతో పాటు, ఉద్యోగ నిబంధనల ప్రకారం కఠినమైన క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.


## అధికారికంగానే మేడిగడ్డను సందర్శించిన ఎన్‌డిఎస్‌ఎ ఛైర్మన్

### - రాష్ట్ర నీటిపారుదలశాఖ వివరణ

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** మేడిగడ్డ బ్యారెజ్‌ను జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (ఎన్‌డిఎస్‌ఎ) ఛైర్మన్ సందర్శించడం పూర్తిగా అధికారిక, సాంకేతిక పరమైన కార్యక్రమని రాష్ట్ర నీటిపారుదలశాఖ స్పష్టం చేసింది. ఈ పర్యటన వెనక ఎలాంటి రాజకీయ ఉద్దేశ్యం లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ శ్రీధర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత పరిశోధనల పురోగతిని సమీక్షించడం, ఫీల్డ్ స్థాయిలో పనిచేస్తున్న బృందాలకు సాంకేతిక మార్గదర్శనంఇవ్వడంలో భాగంగానే ఎన్‌డిఎస్‌ఎ ఛైర్మన్ మేడిగడ్డను సందర్శించారని చెప్పారు. ఎన్‌డిఎస్‌ఎ చట్టబద్ధ, సాంకేతిక పర్యవేక్షణ బాధ్యతల పరిధిలోనే ఈ కార్యక్రమం జరిగిందన్నారు. మెడిగడ్డ బ్యారేజ్‌లో 7వ బ్లాక్‌లోని 20వ పియర్ దెబ్బతిన్న నేపథ్యంలో ఎన్‌డిఎస్‌ఎ ఇప్పటికే పరిశీలన చేసి నివేదిక సమర్పించిందన్నారు. ఆ నివేదికలో సవివర పరిశోధనలు మరియు ఫిజికల్ మోడల్ స్టడీస్ నిర్వహించాలని సూచించిందని, ఈ సూచనల మేరకు, కేంద్ర జల వనరులశాఖ ఆధ్వర్యంలోని పుణె సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్(సిడబ్లుపిఆర్‌ఎస్)ను పరిశోధనలు, మోడల్ అధ్యయనాల కోసం నియమించామన్నారు. వాటి ఆధారంగా పునరుద్ధరణ రూపకల్పన కోసం ఎఫ్‌ఆర్‌ఐ సంస్థను కన్సల్టెంట్‌గా నియమించారు. సిడబ్లుపిఆర్‌ఎస్, ఎఫ్‌ఆర్‌ఐ మధ్య జరిగిన సమన్వయ సమావేశాల అనంతరం సమగ్ర ప్రణాళిక సిద్ధమై, వారం రోజులుగా ఫీల్డ్ పరిశోధనలు ప్రారంభమయ్యాయని ఆయన వివరించారు. ఈ ప్రక్రియలో భాగంగానే ఎన్‌డిఎస్‌ఎ ఛైర్మన్ మేడిగడ్డను సందర్శించారని చెప్పారు.

## నేడు రాష్ట్ర కేబినెట్ సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్22:** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నేడు మధ్యాహ్నం 3 గంటలకు సిఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరుగనుంది. ఈ సమావేశంలో భాగంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు తీర్పుకు సంబంధించి కేబినెట్ చర్చించనుంది. దీంతోపాటు జూన్ 2న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభానికి సంబంధించి సాధ్యాసాధ్యాలను కేబినెట్‌లో చర్చించనున్నారు. దీంతోపాటు త్వరలో అమలు చేయనున్న మరో రెండు కొత్త పథకాల గురించి కూడా మంత్రివర్గ సమావేశంలో చర్చించే అవకాశం ఉందని తెలిసింది. వీటితో పాటు మండల పరిషత్,జిల్లా పరిషత్ ఎన్నికల సన్నద్ధతపై చర్చించే అవకాశాలున్నాయని సమాచారం. గవర్నర్ కోటా కింద ప్రభుత్వం ఎమ్మెల్సీలుగా ప్రతిపాదించిన కోదండరాం, అజారుద్దీన్‌లపై కేబినెట్ చర్చించనున్నట్టుగా తెలిసింది. ఆర్టీసి సమ్మె, ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న అంశం గురించి కేబినెట్‌లో చర్చించే అవకాశం ఉందని తెలిసింది. ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి పీఆర్సీ నివేదిక, ఫిట్‌మెంట్, పెండింగ్ డిఏలు, పెండింగ్ సమస్యల గురించి కేబినెట్ చర్చించనున్నట్టుగా తెలిసింది.



ఉత్తరాఖండ్ రుద్రప్రయాగలోని కేదార్‌నాథ్ ఆలయం బుధవారం తెరుచుకోవడంతో పోటెత్తిన భక్తులు

## వేగంగా అమలులోకి

>> దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బుధవారం రాత్రి జూబ్లీహిల్స్ లోని నివాసంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు సంబంధించి పనులు ప్రారంభమైన కంపెనీలు, అనుమతుల దశలో ఉన్న కంపెనీలు సాంకేతిక, ఇతర సమస్యలతో పనులు పెండింగ్‌లో ఉన్న సంస్థల వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఫ్యూచర్ సిటీతో పాటు వివిధ ప్రాంతాల్లో ఆయా సంస్థకు కేటాయించిన భూములు, అక్కడి మార్కెట్ ధరలు, ఆయా కంపెనీలు చెల్లించేందుకు ఆసక్తి చూపుతున్న మొత్తాన్ని అధికారులు వివరించారు. ప్రభుత్వ విధానం ప్రకారం.. క్యూర్, ప్యూర్, రేర్ ప్రాంతాల్లో ఆయా సంస్థలకు భూములు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. పెట్టుబడులకు సంబంధించిన అనుమతులు వేగంగా ఇవ్వాలని, అదే సమయంలో ఆయా కంపెనీలు పనులు త్వరగా ప్రారంభించేలా ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ఎంవోయూలు కుదుర్చుకున్న కంపెనీలకు కేటాయించాల్సిన భూములకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కంపెనీలకు కల్పించాల్సిన సౌకర్యాలు, భవిష్యత్ అవసరాలకు సంబంధించి వివరాలను ముందుగానే తెలుసుకొని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సీఎం అధికారులకు సూచించారు. డాటా సెంటర్లకు ఎస్టీపీల ద్వారా శుద్ధి చేసిన నీటిని వినియోగించుకునే అవకాశం ఉన్నందున అందుకు తగినవిధంగా ప్రణాళికలు రూపొందించాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పెట్టుబడులుగా ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలను మూడు కేటగిరీలుగా విభజించాలని సీఎం సూచించారు.

పెట్టుబడుల సాధనకు రాష్ట్రాల మధ్య ఉన్న పోటీతత్వాన్ని అధికారులు గుర్తించాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు. ఈ విషయంలో ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండాలన్నారు.. ఫ్యూచర్ సిటీలో కార్యాలయం పనులు త్వరగా పూర్తి చేసి అక్కడే ఎంవోయూల అమలు, పురోగతిపై నిరంతరం పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పనులు పూర్తయిన కంపెనీల ప్రతినిధులతో చర్చించి వాటి ప్రారంభోత్సవానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సీఎం సూచించారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం స్పెషల్ సెక్రటరీ బి.అజిత్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ కె.శశాంక, రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి భవేష్ మిశ్రా, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్ ఓల్డ్ సిటీలో మెట్రో పనులకు సంబంధించి మిగిలిన కొంత భూ సేకరణను వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. పరిశ్రమల శాఖపై సమీక్షకు ముందు హైదరాబాద్ మెట్రో రైలు పనులపై సీఎం సమీక్షించారు. రెండేళ్లలోనే చాంద్రాయణగుట్ట వరకు మెట్రో రైలు పనులు పూర్తి కావాలని ఆదేశించారు. రెండో దశ మెట్రో అనుమతులు, బహదూర్‌గూడ వద్ద హైస్పీడ్ కారిడార్ వద్దకు మెట్రో విస్తరణ అంశాలపైనా చర్చించారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, మెట్రో సలహాదారు ఎన్.వి.ఎస్.రెడ్డి పాల్గొన్నారు.

# ఎఐసిటిఇ దక్షిణ ప్రాంతీయ కమిటీ ఛైర్మన్‌గా జెఎన్‌టియు హెచ్‌విసి కిషన్‌కుమార్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఏప్రిల్22:** జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం, హైదరాబాద్ (జెఎన్‌టియుహెచ్) వీసీ డాక్టర్ టి. కిషన్ కుమార్ రెడ్డి, అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఎఐసిటీఈ) దక్షి ణ మధ్య ప్రాంతీయ కమిటీ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. ఆయన ఈ పోస్ట్‌లో 3 ఏళ్ల పాటు కొనసాగుతారు. ప్రాంతీయ కమిటీల ఛైర్మన్ల పున ర్వ్యవస్థీకరణకు సంబంధించిన వివరాలను ఎఐసిటీఈ సభ్యకార్యదర్శి ప్రొఫెసర్‌శ్యామారథ్ తెలియజేశారు. కిషన్ కుమార్ రెడ్డి న్యూఢిల్లీలోని ఏఐసిటీఈలో సలహాదారుగా, గుజరాత్‌లోని గాంధీనగర్ లో పండిట్ దీన్‌దయాళ్ పెట్రోలియం విశ్వవిద్యాలయ వీసీగా, అలాగే ఒడిశాలోని గుణుపూర్‌లో ఉన్న గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ విశ్వవిద్యాలయ వీసీగా సేవలందించారు.

## పదవీ విరమణ ప్రయోజనాల జాప్యంపై హైకోర్టు ఆగ్రహం

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** రిటైర్డ్ ఉద్యోగులకు అందాల్సిన ప్రయోజనాల పట్ల స్పందించని ప్రభుత్వం పట్ల హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రిటైర్ అయిన ప్రభుత్వ ఉద్యోగులకు అందాల్సిన పదవీ విరమణ ప్రయోజనాల చెల్లింపులో జరుగుతున్న జాప్య ంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర అభ్యంతరం తెలిపింది. రంగారెడ్డి జిల్లా కోర్టులో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించి ఆరు నెలల క్రితం రిటైర్ అయిన విజయ్ కుమార్‌కు రావాల్సిన 90 లక్షల రూపాయల ప్రయోజనాలు ఇంకా అందలేదు.



బిజినెస్ రూల్స్ హ్యాండ్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న డిజిపి శివధర్ రెడ్డి, చిత్రంలో సర్వీస్ రూల్ రివిజన్ కమిటీ ఛైర్మన్ వై.గంగాధర్, అదనపు డిజి స్వాతి లక్రా, ఐజి గజారావు భూపాల్ తదితరులు

# డిజిపి కార్యాలయ సిబ్బంది విధుల నిర్వహణకు బిజినెస్ రూల్స్ హ్యాండ్ బుక్ ఆవిష్కరణ

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** డిజిపి కార్యాలయంలో పనిచేసే సిబ్బంది విధుల నిర్వహణ, సర్వీసు నిబంధనలపై స్పష్టతనిచ్చే బిజినెస్ రూల్స్ అండ్ జనరల్ ఇన్‌స్ట్రక్షన్స్ పేరిట కొత్తగా రూపొందించిన హ్యాండ్ బుక్‌ను డిజిపి శివధర్ రెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఈ హ్యాండ్ బుక్ పోలీసు అధికారులకు, సిబ్బందికి ఎంతో ఉపయోగకరంగా వుంటుందని, మార్గ దర్శకంగా నిలుస్తుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల పోలీసు విభాగాలకు చెందిన ఫైళ్లను పరిశీలించే సమయంలో పాటించాల్సిన విధి, విధానాలు ఈ హ్యాండ్ బుక్‌లో పొందు పరచడం జరిగిందని డిజిపి తెలిపారు. గతంలో తాను పర్సనల్ విభాగం అదనపు డిజిగా పనిచేసిన స మయంలో ఈ హ్యాండ్ బుక్ గురించి చర్చించానని, అందుకు అనుగుణంగానే సర్వీస్ రూల్ రివిజన్ కమిటీ ఛైర్మన్ వై.గంగాధర్ సహా మరికొందరు అధి కారులతో సంప్రదించి హ్యాండ్ బుక్‌ను రూపొం దించి, అందులో నియమాల గురించి వివరంగా చెప్పడం జరిగిందని డిజిపి తెలిపారు. నూతనంగా వెలువడుతున్న జిఒలు, మారుతున్న విధానాలకు అనుగుణంగా సిబ్బందికి అర్థమయ్యేలా ఈ హ్యాండ్ బుక్‌ను తీర్చిదిద్దిన కమిటీ సభ్యులను ఆ యన అభినందించారు.

సర్వీస్ రూల్ రివిజన్ కమిటీ ఛైర్మన్ వై.గంగాధర్ మాట్లాడుతూ సర్వీస్ నిబంధనలపై క్షేత్రస్థాయిలో ఉద్యోగుల నుంచి సేకరించిన సమాచారం, ఎదు ర్కొంటున్న విషయాలపై పరిగణలోకి తీసుకుని ఈ హ్యాండ్‌బుక్‌ను తయారు చేసినట్లు తెలిపారు.

## ఐఆర్‌ఎస్ అధికారి కుమార్తెపై లైంగిక దాడి, హత్య!

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:** ఢిల్లీలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ ఇండియన్ రెవెన్యూ సర్వీస్ అధికారి కుమార్తె అత్యంత దారుణంగా హత్యకు గురయ్యింది. ఈ ఘటన దక్షిణ ఢిల్లీలోని అమర్ కాలనీ ప్రాంతంలో ఉన్న ఆమె ఇంట్లోనే జరిగింది. పోలీసులు ఈ కేసులో దర్యాప్తు చేపడుతున్నారు. అనుమానాస్పద రీతిలో బాధిత యువతి మృతిచెంది ఉన్నట్లు ఇంట్లో వారు గుర్తించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం బాధిత యువతిపై తొలుత లైంగిక దాడి చేసి, ఆ తర్వాత హత్య చేసినట్లు అనుమానిస్తున్నారు. అయితే ఆ యువతిని చంపేందుకు నిందితుడు మొబైల్ ఫోన్ చార్జింగ్ వైర్‌ను వాడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఆ వైర్‌తో ఆమె గొంతుకు ఉరి వేసి ఉంటాడని అనుమానిస్తున్నారు. మర్డర్‌కు గురైన అమ్మాయి వయసు 21 ఏళ్లు. ఆమె ఇంట్లో ఒంటరిగా ఉన్నట్లు తెలిసింది. ఇంట్లో పనిమనిషి ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. నెల రోజుల క్రితమే అతడిని ఇంటి నుంచి తరిమేశారు. ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు వేగవంతంచేసారు.

## శ్రీవారి ఆలయంలో భాష్యకార్ల సాత్తుమొర

**తిరుమల, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి ఆలయంలో బుధవారం భాష్యకార్ల సాత్తుమొర ఘనంగా జరిగింది. రామానుజులవారు జన్మించిన వైశాఖ మాస అరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా భాష్యకార్ల సాత్తుమొర నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఉదయం భాష్యకార్ల నిఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆ తరువాత నడకదారిలోని భాష్యకార్ల సన్నిధిలో వైభవంగా అభిషేకం చేపట్టారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవ అనంతరం శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామి ని ఒక తిరుచ్చిపై, భాష్యకార్లవారిని మరో తిరుచ్చిపై ఆలయ మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆ తరువాత ఆలయంలో విమాన ప్రాకారం చుట్టూ ప్రదక్షి ణ చేశారు. రాత్రి భాష్యకార్లవారి సన్నిధిలో సాత్తుమొర నిర్వహిస్తారు. ప్రత్యేక ఆభరణాలతో సల్లింపు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్ స్వామి, ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి, ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ వ్యవహారంలో హైకోర్టు స్టేకు కాంగ్రెస్ తప్పిదాలే కారణం

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

**హైదరాబాద్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం మరియు నిర్వహణలో జరిగిన అవకతవకలపై విచారణ కోసం ఏర్పాటు చేసిన జస్టిస్ పిసి ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు స్టే ఇవ్వడం గమనార్హం అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. హైకోర్టు చేసిన వ్యాఖ్యలు పరిశీలిస్తే, ఈ స్టే రావడానికి ప్రధాన కారణం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రదర్శించిన నిరక్ష ్యం, తప్పిదాలేనని స్పష్టమవుతుందన్నారు. హైకోర్టు సూచించిన అంశాలు, వెల్లడించిన కారణాలు అన్నీ కూడా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల వైపే చూపుతున్నాయని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పిసి ఘోష్ కమిషన్ విధివిధానాలు, విచారణలో నిబంధనలు పాటించలేదని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో, జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా పిటిషనర్లపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని ఆదేశించడం జరిగింది. ఈ పరిణామాలు చూస్తుంటే, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతి, అక్రమాల విషయంలో అసలు అవినీతిపరులను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిరక్ష ్యంగా వ్యవహరించినట్లు స్పష్టమవుతుందని అన్నారు. కాబట్టి, హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేయడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత. కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాల వెనుక ఉన్న దోషులు ఎవరైనా సరే, వారికి చట్టపరంగా శిక్షపడేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ మొత్తం పరిణామానికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు.

# గవర్నర్‌ను కలిసిన దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి సరస్వతి అంత్య పుష్కరాలకు గవర్నర్‌కు ఆహ్వానం



గవర్నర్‌కు శాలువా కప్పి పుష్కరాలకు ఆహ్వానిస్తున్న దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్22:** దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ ఎన్. హనుమంత రావులు బుధవారం లోక్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలిశారు. రానున్న సరస్వతి అంత్య పుష్కరాలకు ఆహ్వానిం చారు. ఈ సందర్భంగా గోదావరి పుష్కరాలు (జూన్ 26 నుంచి జూలై 7, 2027 వరకు), సరస్వతి అంత్య పుష్కరాలు (మే 21 నుంచి జూన్ 1, 2026 వరకు) నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లపై దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి గవర్నర్‌కు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పుష్కరాలను సజావుగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్ తెలిపారు. భక్తుల వసతి సదుపాయాలు, క్రౌడ్ మేనేజ్మెంట్ చర్యలు, ముఖ్య ఆలయాలు-వాటి ప్రాధాన్యత, శాఖల మధ్య సమన్వయం వంటి అంశాలపై గవర్నర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దాన కిశోర్ కూడా సమావేశంలో పాల్గొన్నారు. గవర్నర్‌ను కలిసిన అచ్చంపేట ఎమ్మెల్యే కాగా, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీ కృష్ణ బుధవారం లోక్ భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. గవర్నర్‌ను కలిసిన ఎంసిఈఎంఈ కమాండెంట్ ఎంసిఈఎంఈ, సికింద్రాబాద్ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్ష్నే (ఏవీఎస్ఎం, వీఎస్ఎం) బుధవారం లోక్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు.

## కెసిఆర్, రేవంత్ రెడ్డి కాంప్రమైజ్ పాలిటిక్స్‌కు కాళేశ్వరమే తార్కాణం

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** కెసిఆర్, రేవంత్ రెడ్డి కాంప్రమైజ్ పాలిటిక్స్‌కు కాళేశ్వరమే తార్కాణం అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాళేశ్వరం పై హైకోర్టులో సరైన వాదనలు విన్పించడంలో ఫెయిలయ్యారన్నారు. పిసి ఘోష్ కమిషన్ టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ చూస్తేనే అర్థమవుతుందన్నారు. కెసిఆర్‌ను కాపాడటానికే రేవంత్ రెడ్డి శతవిధాలా ప్రయత్నిస్తున్నారన్నారు. రూ.లక్ష కోట్ల కాళేశ్వరం స్కాంపై కాకుండా రూ.9 వేల కోట్లపైనే విచారణ జరపాలని సిబిఐకి లేఖ రాయడం అందులో భాగమే పథకం ప్రకారం జరిగిన పన్నాగమే అన్నారు. ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు మూటలు వెళుతున్నాయి. ఇక్కడ కేసులు క్లోజ్ అవుతున్నాయని అన్నారు. కెసిఆర్, రేవంత్ రెడ్డి క్విడ్ ప్రోకో వ్యవహారాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారున్నారు.

## మూడేళ్ల కిందటి నోటిఫికేషన్‌పై ప్రేమెందుకో!?

**తిరుమల, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో ఎప్పటికప్పుడు కొత్త పంథాలో ఆలోచనలు ఉండాలని, వినూత్న విధానాలు అమలుకావాలని పదేపదే ముఖ్యమంత్రి చంద్రబాబు హితోక్తులు టిటిడి అధికారులకు చెవికెక్కడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వాలు మారినపుడు నియామకమైన అధికారులు భక్తులకు మెరుగైన సేవలు, సౌకర్యాలు కల్పించేందుకు వినూత్నంగా ఉండాలని గతంలో సిఎం హెచ్చరించారు. అయినా టిటిడి అధికారుల్లో మాత్రం అలాంటివేమీ కనిపించడంలేదనే తెలుస్తోంది. ఎప్పుడో మూడు సంవత్సరాల క్రిందట 2023 నవంబర్ 23న టిటిడిలో ఇంజనీరింగ్ పోస్టులు, సాంకేతిక పరిజ్ఞానం కలిగిన 56 టెక్నికల్ ఉద్యోగాలకు టిటిడి నోటిఫికేషన్ వెలువడించింది. ఇందులో 17 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, 10 అసిస్టెంట్ ఇంజనీర్, 19 అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అప్పటి వైసిపి ప్రభుత్వం, ప్రస్తుత టిటిడి బోర్డు ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి హయాంలో టిటిడి- 99021(31), /33/ 2023- ఆర్‌సిటిఎస్ ఎస్ఇ- టిటిడి జిఒతో ఎలక్ట్రికల్ విభాగంలో పెండింగులో ఉన్న అభ్యర్థులకు నాలుగు ఏఇ పోస్టులు, 46 ఏఇఇ, టెక్నికల్ అసిస్టెంట్ల భర్తీ నోటిఫికేషన్ విడుదల చేశారు. అప్పట్లో ఈ పోస్టుల భర్తీలో ఏకంగా ఓ కాంట్రాక్టర్ తనవెంట తెచ్చిన అభ్యర్థుల నుండి బేరం మాట్లాడుకుని రూ.50లక్షల వరకు నిర్ణయించి అమ్ముకోవడ దానికి సిద్ధమయ్యారనే ఆరోపణలు వినిపించాయి. దీంతో అప్పటి టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి ఈ ఉద్యోగాల భర్తీని నిలుపుదల చేశారు. ఆ తరువాత 2024 మేలో రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో టిడిపి నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. అప్పటి నుండి గత మూడేళ్లుగా ఇంజనీరింగ్ పోస్టుల భర్తీ నోటిఫికేషన్ చెత్తబుట్టలో చేరింది. ఈ సందర్భంలో గత ఏడాది నవంబర్‌లో "డయల్ యువర్ ఇఒ" కార్యక్రమంలో కొందరు ఇంజనీరింగ్ అభ్యర్థులు పోస్టుల భర్తీ గురించి అడిగారు. దీనిపై అప్పటి ఇఒ సింఘాల్ కూడా తామ అధికారులతో చర్చించి వివరాలు తెలియజేస్తామన్నారు. ఇలా ఏళ్లు కాలం గడిపిపోవడంతో ఇప్పుడు మళ్ళీ 2023 నోటిఫికేషన్‌తోనే ఆ ఏఇఇ పోస్టుల భర్తీకి, టెక్నికల్ అధికారులు, ఏఇల పోస్టుల భర్తీకి ప్రస్తుత టిటిడి బోర్డు, ఇఒ, అదనపు ఇఒ కూడా సుముఖంగానే ఉన్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఆ నోటిఫికేషన్ గడువు ముగియడం, 2023లో తయారుచేసిన ప్రణాళికలు కూడా లీకవడంతో టిటిడిలో పెద్ద దుమారంగా మారింది. ఈ సమయంలో పాత నోటిఫికేషన్‌తోనే ఓ కాంట్రాక్టర్ ఒత్తిడి మేరకు ఓ అధికారి తెరవెనక రాజకీయంతో వైసిపికి వీరవిధేయులైన వారికి న్యాయం చేస్తాడని చెప్పినట్లు తాజా బోర్డు, టిటిడి ఇఒ కూడా సుముఖం ఉండటం వెనక మతలబు ఏంటనేది అర్థంకావడం లేదు. పైగా 2025లో జోనల్ వారీగా విభజన చేయడంతో తిరుమల తిరుపతి దేవస్థానంలో ఉద్యోగాల భర్తీ జోన్ల ప్రకారం చేపడితే రాయలసీమ వాసులకు న్యాయం జరుగుతుందన్నారు.

## పిఎసి 1 సముదాయం... ఆస్థాన మండపాల ఆధునీకరణ

**తిరుమల, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో పాతబడిన యాత్రికుల వసతి సముదాయం-1తోబాటు ఆలయానికి ఎదురుగా ఉన్న ఆస్థానమండపం భవనాల ఆధునీకరణకు చర్యలు తీసుకోవాలని టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర అధికారులకు ఆదేశాలిచ్చారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలు సిద్దంచేయాలని అన్నారు. భక్తుల నుండి అభిప్రాయాలు సేకరించి, వాటి ఆధారంగా సేవలను మరింత మెరుగుపరచాలని ఇఒ సూచించారు. అన్ని ఆలయాల్లో క్యూఆర్ కోడ్ ద్వారా అభిప్రాయ సేకరణ చేపట్టాలని తెలిపారు. టిటిడి పరిపాలన భవనంలో బుధవారం మధ్యాహ్నం టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒలు వి.వీరబ్రహ్మం, డాక్టర్ ఎ.శరత్, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, సిఇ సత్యనారాయణ, డాక్టర్ తలారి రవితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులకు తిరుమల, తిరుపతిలో మరింత మెరుగైన వసతి సదుపాయాలు కల్పించాలని ఇఒ రవిచంద్ర అన్నారు. ప్రస్తుత వసతి సదుపాయాలు సరిపోవడం లేదని, వాటిని విస్తరించేందుకు సమగ్ర అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని తెలిపారు. ముఖ్యంగా తిరుమలలో వసతి సదుపాయాల పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తిరుమలలో మాడవీధులు, ఆలయ పరిసరాలు, ముఖ్య ప్రదేశాల్లో నిరంతరం నీటి పిచికారి చేయాలని ఆదేశించారు. తిరుమలలో నెయ్యి నిల్వ ట్యాంకులు, ముడి సరుకుల గోడౌనుల సామర్థ్యాన్ని పెంచేందుకు కొత్త గోడౌనులు నిర్మించాలని, పెండింగ్ వ్యర్థాలను త్వరగా తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శ్రీవారి సేవ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, ఇతర ఆలయాలకు విస్తరించేలా చర్యలు తీసుకోవాలని సిఆర్‌ఒ డాక్టర్ రవికి సూచనలు చేశారు. భవిష్యత్తులో వైద్యులు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులు, సాఫ్ట్‌వేర్ నిపుణుల సేవలను వినియోగించుకునేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. ఇంకా టిటిడి కళ్యాణ మండపాల నిర్వహణ, ఎస్‌విబిసి, స్విమ్స్, ఎఫ్ఎంఎస్, వసతి గృహాలు, ఎస్ఎస్‌డి, ఎస్ఇడి, శ్రీవాణి దర్శనం టికెట్ల జారీ తదితర అంశాలపై లోతుగా చర్చించారు. ఈ సమావేశంలో టిటిడి సిఇ సత్యనారాయణ, ఎఫ్.ఎ.సి. ఏ.ఒ రవిప్రసాద్, ఇంఛార్జ్ న్యాయ అధికారి వెంకట సుబ్బానాయుడు పాల్గొన్నారు.

### శ్రీవారి సేవలో ప్రముఖులు

**తిరుమల, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వర స్వామిని బుధవారం ఉదయం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో మలయాళ సినీ నటుడు దిలీప్, సినీ నటి కావ్య మాధవన్ కుటుంబం, కన్నడ నటి శరణ్యశెట్టి వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకుని దేవదేవుని దర్శించుకున్నారు.

# జెఇఇ మెయిన్స్‌లో సంక్షేమ గురుకుల విద్యా సంస్థల విజయకేతనం

### హర్షం వ్యక్తం చేసిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్22:** జేఈఈ మెయిన్స్ 2026 ఫలితాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ గురుకుల విద్యా సంస్థలు విజయకేతనం ఎగురవేస్తూ జాతీయ స్థాయిలో తమ ఆధిపత్యాన్ని చాటుకోవడం, కార్పొరేట్ విద్యా సంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా మహాత్మ జ్యోతిభా పూలే బీసీ, సాంఘిక, గిరిజన, మైనారిటీ సంక్షేమ గురుకులాల విద్యార్థులు అసాధారణ పర్సంటైల్‌తో అద్భుత ఫలితాలు సాధించడం పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థులకు, తలిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. పేదరికంలో ఉన్న విద్యార్థులను ప్రపంచ స్థాయి పోటీ పరీక్షలకు సిద్ధం చేయడంలో ప్రజా ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. అత్యుత్తమ విజయాలు సాధించడానిక దిశానిర్దేశం చేసిన విద్యార్థుల గురుకులాల బోధనా సిబ్బంది, అధికారుల కృషిని కొనియాడారు. ప్రభుత్వ సదుపాయలను అందిపుచ్చుకొని నిరంతర శ్రమించి ఫలితాలు సాధించిన విద్యార్థులకు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సొసైటీ కార్యదర్శి కె. సీతాలక్ష్మి విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. జేఈఈ మెయిన్స్ 2026 ఫలితాల్లో మెరిసిన గురుకుల విద్యా సంస్థల విద్యార్థిని, విద్యార్థులు:సాంఘిక సంక్షేమ గురుకులాల (టిజిఎస్‌డబ్ల్యుఆర్‌ఈఐఎస్) నుండి సుమారు 337 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించి రికార్డు సృష్టించారు. గౌలిదొడ్డి సీఓఈ విద్యార్థి వై.నవదీప్ 98.39 పర్సంటైల్‌తో అగ్రస్థానంలో సాధించగా, సత్య స్వరూప్ (97.99), యశ్వంత్ (95.70), కె.శ్రీవర్ష (94.64) అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. మొత్తం 109 మంది విద్యార్థులు 80 పర్సంటైల్ కంటే ఎక్కువ సాధించి సంస్థ కీర్తిని పతాక స్థాయికి చేర్చారు. గిరిజన సంక్షేమ గురుకులాల (టిజిటిడబ్ల్యుఆర్‌ఈఐఎస్)) విద్యార్థులు కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ఏకంగా 270 మంది అడ్వాన్స్‌డ్ పరీక్షకు ఎంపికయ్యారు. కె.శివప్రసాద్ 99.15 పర్సంటైల్‌తో ప్రభంజనం సృష్టించగా, ధీరావత్ సిద్దు (94.70), పత్లావత్ యోగిరాజ్ నాయక్ (93.33), చౌహాన్ ప్రవీణ్ (93.45) తమ విద్యా నైపుణ్యాన్ని చాటుకున్నారు. ఎస్టీ కేటగిరీలో మొకళ్ళ శరత్ చంద్ర జాతీయ స్థాయిలో టాపర్‌గా నిలిచి అందరి దృష్టిని ఆకర్షించారు. మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకులాల (ఎంజెపిటిబిసిడబ్ల్యుఆర్‌ఈఐఎస్)) నుండి 314 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, 69 మంది అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారు. ఇందులో 37 మంది బాలురు, 32 మంది బాలికలు ఉండటం విశేషం. మైనారిటీ సంక్షేమ గురుకులాల (టిజిఎంఆర్‌ఈఐఎస్)) నుండి 33 మంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్‌కు ఎంపికయ్యారు. సయ్యద్ అబ్దుల్ సమద్ 98.78 పర్సంటైల్‌తో టాపర్‌గా నిలవగా, బి. రిషికేష్ (98.65), ఎస్.రాజేష్ (96.56), ఎండి. జైదాన్ (95.73) అత్యుత్తమ స్కోర్లు సాధించి తమ ప్రత్యేకతను చాటుకున్నారు. తెలంగాణ గురుకులాల నుండి ఇంతటి భారీ స్థాయిలో విద్యార్థులు జాతీయ స్థాయి ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షల్లో రాణించడం పట్ల విద్యా వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

# దేశ అంతర్గత భద్రతలో సిఆర్‌పిఎఫ్ కీలక పాత్ర

### దేశంలో అతిపెద్ద పారామిలటరీ సంస్థ సిఆర్‌పిఎఫ్

### ధైర్యం, నిజాయితీ, త్యాగం, సమర్పణకు ప్రతీక

#### హర్యానా గురుగ్రాం సిఆర్‌పిఎఫ్ స్నాతకోత్సవంలో కేంద్ర మంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** దేశ అంతర్గత భద్రతలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) కీలక పాత్ర పోషిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. నక్సలిజం, ఉగ్రవాద నిర్మూలనలో సిఆర్‌పిఎఫ్ జవాన్లు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ధైర్యం, నిజాయితీ, త్యాగం, సమర్పణకు సిఆర్‌పిఎఫ్ ప్రతీకగా నిలిచిందన్నారు. మానవతా సాయం అందించడంలోనూ సిఆర్‌పిఎఫ్ ముందంజలో ఉండటం ప్రశంసనీయమని కొనియాడారు. బుధవారం ఉదయం హర్యానాలోని గురుగ్రాం సిఆర్‌పిఎఫ్ అకాడమీలో జరిగిన 56వ బ్యాచ్ గెజిటెడ్ అధికారుల స్నాతకోత్సవ వేడుకల్లో కేంద్ర మంత్రి బండి సంజయ్ తోపాటు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్, అకాడమీ డైరెక్టర్ అమిత్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. తొలుత అమరవీరుల స్థూపం వద్దకు వెళ్లి అంజలి ఘటించిన కేంద్ర మంత్రి అనంతరం స్నాతకోత్సవ వేడుకలను తిలకించారు. ఈ సందర్భంగా సిఆర్‌పిఎఫ్ పోలీసులను ఉద్దేశించి బండి సంజయ్ మాట్లాడారు. సిఆర్‌పిఎఫ్ 56వ బ్యాచ్ శిక్షణార్థి అధికారుల స్నాతకోత్సవ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉంది. ఈ అద్భుతమైన స్నాతకోత్సవ పరేడ్ సిఆర్‌పిఎఫ్ అత్యున్నత స్థాయి క్రమశిక్షణకు ప్రతీకగా నిలుస్తోంది. పరేడ్‌లో పాల్గొన్న అధికారులు 52 వారాల కఠిన శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకుని విధులకు సిద్ధమవడంవ సంతోషం. మాతృభూమికి సేవ చేయడానికి తమను తాము అంకితం చేసుకోవడం కంటే గొప్ప కర్తవ్యం మరొకటి లేదు. దేశసేవ అనే పవిత్ర ప్రతిజ్ఞే అత్యున్నత కర్తవ్య నిబద్ధతకు సంకేతం, ఇది ఏ పౌరుడైనా తన దేశం కోసం తీసుకోగలిగే అత్యుత్తమ ప్రతిజ్ఞ. దేశసేవలో సమర్పణ, నిబద్ధత, త్యాగం అంతర్భాగాలుగా ఉంటాయి.

# కాళేశ్వరం ప్రాజెక్టులో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం మరోసారి బట్టబయలు: మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నివేదికకు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని మరోసారి బట్టబయలు చేసిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగినట్లు ఆధారాలు ఉన్నప్పటికీ.. వాటిని చట్టపరంగా సమర్థవంతంగా కోర్టు ముందు ప్రవేశపెట్టడంలో రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా తగిన ఆధారాలను సమర్పించలేకపోవడం వల్ల, కమిషన్ నివేదిక ఆధారంగా తదుపరి చర్యల విషయంలో కోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వ నిరక్ష్యానికి, అసమర్థతకు నిదర్శనం అన్నారు. కాంగ్రెస్ పార్టీ మాటల ప్రభుత్వమే తప్ప చేతల ప్రభుత్వం కాదని మరోసారి నిరూపితమైందన్నారు. రాష్ట్ర హైకోర్టు తీర్పు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని, అధికారంలోకి రాగానే కెసిఆర్, వారి కుటుంబ సభ్యులు, మంత్రులు, బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన అవినీతిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి పెద్ద పెద్ద హామీలు ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తికావొస్తున్నా.. ఏ ఒక్క అవినీతి, అవకతవకలపై సమగ్ర దర్యాప్తు చేపట్టలేదు, చర్యలు తీసుకోలేదు. ఇంతవరకు.. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో వేల కోట్ల రూపాయల అవినీతి, ఫార్ములా వన్ రేస్ పేరుతో జరిగిన ఖర్చులు, డ్రగ్స్ కేసు, భూఆక్రమణలు, భూకేటాయింపులు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాలలో అవినీతి, అక్రమాలు జరిగాయని.. అవినీతి సొమ్మును కక్కిస్తానని పదే పదే సిఎం ప్రకటించినప్పటికీ వాటిపై ఒక్కటంటే ఒక్క చర్యకూడా తీసుకోలేదు. కెసిఆర్, ఆయన కుటుంబ సభ్యులపై రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోకపోవడానికి కారణం.. ఈ రెండు పార్టీల మధ్య ఉన్న దోస్తీయే. ప్రజాక్షేత్రంలో ఈ రెండు పార్టీలు దూప్ ఫైటింగ్ చేస్తూ నేను గిచ్చినట్లు చేస్తా, నువ్వు ఏడ్చినట్లు చెయ్యి అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. తెలంగాణ ప్రజలను రెండు పార్టీలు మోసం చేస్తున్నాయి. తెలంగాణ ప్రజలు కెసిఆర్ అవినీతి పాలన నుంచి విముక్తి కోసం మార్పు కావాలని ఓటేశారు. కానీ రేవంత్ సర్కార్ హామీలను మాటలకే పరిమితం చేస్తూ అవినీతికి పాల్పడిన వ్యక్తులను వదిలేస్తున్నారు. గత రెండున్నరేళ్లుగా రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న కాంగ్రెస్ పార్టీ అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ తెలంగాణ ప్రజాధనాన్ని అడ్డగోలుగా దోచుకుంటుందన్నారు. బిఆర్ఎస్ హయాంలో జరిగిన అక్రమాలపై చర్యలకు వెనుకాడుతుందని, ఇది రేవంత్ రెడ్డి పరిపాలనా వైఫల్యం, ఇచ్చిన హామీలను విస్మరించి తెలంగాణ ప్రజలకు చేస్తున్న రాజకీయ ద్రోహం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత, అసెంబ్లీలో బయట, ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం వెంటనే.. అవినీతి కేసుల్లో చట్టబద్ధమైన, పారదర్శకమైన చర్యలను ప్రారంభించాలి. హైకోర్టు తీర్పు నేపథ్యంలో రాహుల్ గాంధీ, సిఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలి. ఎన్నికల హామీలు ఎందుకు అమలు కాలేదు? అవినీతి కేసుల్లో చర్యలు ఎందుకు ఆలస్యమవుతున్నాయి? లేదంటే మీ పార్టీ ప్రభుత్వం, బిఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి ప్రభుత్వాలే కాబట్టి కలిసి తెలంగాణను దోచుకోవడంలో పోటీపడుతున్నారన్నారు.

# పెట్రోల్, డీజిల్ ప్రత్యామ్నాయంగా ఎలక్ట్రిక్ వెహికిల్స్, సోలార్ పవర్ ఆవిష్కరణలు అవసరం



### ఎస్కిలో ధరిత్రి దినోత్సవ కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకట స్వామి

**హైదరాబాద్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఆర్థికాభివృద్ధి 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్లకు చేర్చాలనే లక్ష ్యంతో ప్రభుత్వం పనిచేస్తున్నదని రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, మైన్స్ అండ్ మినరల్స్ శాఖా మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకట స్వామి అన్నారు. ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా బుధవారం ఏర్పాటు చేసిన రేర్ ఎర్త్ అండ్ ఎలక్ట్రిక్ వెహికల్స్ జాతీయ సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మూడు ట్రిలియన్ డాలర్ల లక్ష్యం ఏడు లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, క్షేత్రస్థాయిలో పనులు జరగాలంటే నైపుణ్యమున్న సిబ్బంది అవసరమని అందులో భాగంగానే ప్రభుత్వం 65 అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటుచేసిందని, వచ్చే రెండు మూడేళ్ళలో వీటి సంఖ్యను 120కు పెంచి, ఏటా 25 వేల మంది యువతకు శిక్షణ ఇవ్వడం వలన రాష్ట్ర ఆర్థిక ప్రగతి వేగం పుంజుకుంటుందదన్నారు. అమెరికా ఇరాన్ యుద్ధంతో ఏర్పడిన ఆయిల్ అండ్ గ్యాస్ కొరతను ఎదుర్కొంటున్న ఈ సమయంలో ఎలక్ట్రిక్ వెహికల్స్ ప్రాధాన్యత పెరిగిందన్నారు. రేర్ ఎర్త్ మినరల్స్ లిథియం కోబాల్ట్, గ్రాఫైట్, నికెల్, కాపర్, టిటానియం వనరులను వెలికి తీయడంలో చైనా ఆధిపత్యం కాగా, ఇండియాలో కూడా ఈ వనరులు బాగా ఉన్నాయని, వీటిని వెలికి తీసి ఉపయోగించుకున్నపుడు ఆత్మ నిర్భర్ భారత్ వికసిత భారత్ సాధ్యమవుతుందన్నారు ఎలక్ట్రిక్ వెహికల్స్ బ్యాటరీ సస్టైనబిలిటీ ఇంజనీర్ కోర్సును దేశంలో మొదటిసారిగా ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియాలో ప్రవేశపెట్టి యువతకు శిక్షణ ఇవ్వడం సంతోషంగా ఉందని, తమ శాఖా ద్వారా నిర్వహిస్తున్న అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్‌లో కూడా ఈ కోర్సుని ప్రవేశపెట్టడం కోసం ఎస్కితో కలిసి పనిచేస్తామని మంత్రి అన్నారు. ఈ సమావేశ ప్రారంభంలో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు మాట్లాడుతూ ధరిత్రిని కాలుష్య నివారణ నుండి కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సోలార్ పవర్, గ్రీన్ ఎనర్జీ, వాటర్ మేనేజ్ మెంట్ సిస్టం, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌తో వ్యవసాయ పనులు బయో డైవర్సిటీ పరిరక్షణ వంటి వాటిపై ప్రస్తుత మేధావుల ఆలోచనలు అవసరమన్నారు. ఈరోజు జరుగుతున్న జాతీయ సమావేశంలో వచ్చిన పలు సూచనలను ప్రభుత్వానికి పంపిస్తామని, వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన ప్రతినిధులకు ఈ సందర్భంగా రామేశ్వర్ రావు కృతజ్ఞతలు చెప్పారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా మేనేజ్ మెంట్ కమిటీ ఛైర్మెన్ పి. సూర్యప్రకాష్, గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మెన్ డాక్టర్ రఘుపాత్రుని భీంరావు మాట్లాడుతూ రేర్ ఎర్త్ మినరల్స్ వినియోగం, వాటి వెలికితీతపై ఇలాంటి జాతీయ సమావేశాల్లో పలు సూచనలు వస్తాయన్నారు. పెట్రోల్, డీజిల్ తదితర ఇంధన వనరులకు ప్రత్యామ్నాయంగా సరికొత్త ఆవిష్కరణలు రావాలన్నారు. ఎస్కి మైనింగ్ హెడ్ కె.జె. అమర్‌నాథ్ సభికులకు స్వాగతం పలికారు. తమిళనాడు, కేరళ, ఒడిశా, కలకత్తాకు చెందిన ప్రముఖులు రాసిన పేపర్లతో ప్రచురించిన సావనీర్‌ను మంత్రి ఆవిష్కరించారు.

## గుర్రంపోడు మండలంలో రోడ్డు ప్రమాదం బైకును ఢీకొట్టిన కారు ముగ్గురు మృతి

**గుర్రంపోడు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త :** గుర్రంపోడు మండలంలోని చేపూర్ ఎక్స్ రోడ్డు వద్ద బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్ ను కారు ఢీకొట్టడంతో ముగ్గురు మృతి చెందారు. ఎస్సై వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం టీఎస్ 05 ఎఫ్ పి 2277 అనే నెంబర్ గల కారు నల్లగొండ నుండి దేవరకొండ వైపు వెళ్తుండగా వేగంగా వచ్చిన కారు అదుపుతప్పి పాల్వాయి నుండి కనగల్ కు వెళ్తున్న టీఎస్ 05 ఈవీ 2192 అనే నెంబర్ గల బైక్‌ను ఢీకొట్టింది.

ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న నర్సింగ్ ధనుంజయ(45), నర్సింగ్ మధు(38), కారులో ప్రయా ణిస్తున్న మా రెడ్డి బాల్రెడ్డి(70) అనే ముగ్గురు వ్యక్తులు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ విజిలెన్స్ అదుపులో నల్లగొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది

**నల్గొండ టౌన్ ఏప్రిల్ 22 ప్రభాత వార్త:** నల్లగొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు బుధవారం ఆకస్మిక సోదాలు నిర్వహించారు. విజిలెన్స్ సిఐ దశరథ, మనోజ్ కుమార్ నేతృత్వంలో సోదాలు చేపట్టారు. ప్రభుత్వం నుండి రిజిస్ట్రేషన్ శాఖ నుండి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా అనధికారికంగా విధులు నిర్వర్తిస్తున్న ఆరుగురు సిబ్బందిని విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇందులో ఇద్దరు మహిళలు కాగా నలుగురు పురుషులు ఉన్నారు. వీరిని విజిలెన్స్ కార్యాలయానికి తరలించి వ్యక్తిగతంగా అందరిని వేర్వేరుగా విచారణ చేస్తున్నారు. ఎంతకాలం నుండి పని చేస్తున్నారు, ఎంత వేతనం పొందుతున్నారు, ఆ వేతనం ఎక్కడి నుండి వస్తుంది అనే విషయాలపై విచారణ చేపట్టారు.

వార్త

అనుభవించడం కంటె అనుభవం కోసం ఎదురు చూడటంలోనే మనిషి జీవితం ఎక్కువ కాలం గడిచిపోతుంది.

-వోల్టేర్

# ఎంతకాలమీ ప్రతిష్టంభన?

పశ్చిమాసియా యుద్ధానికి 'కాల్పుల విరమణ' గడువు బుధవారంతో ముగియనుండగా 'ఇక సమయం లేదు మిత్రమా! అమీ తుమీ' తేల్చుకోండని శ్వేత సౌధాధినేత ట్రంప్ అల్టిమేటమ్ జారీ చేశారు. అయినా కాస్త తగ్గి మరోసారి గడువు పెంచారు. హార్మూజ్ జల సంధిని అష్ట దిగ్బంధనం చేయగలిగామని చెప్పుకుంటున్న అమెరికా ఇరాన్‌ను భయపెట్టగలిగిందేమీ లేదు. అమెరికా, ఇరాన్ రెండో దఫా చర్చలపై సందిగ్ధత తొలగినా కొంత కాలం ఉత్కంఠ తప్పదు. అవసరమైతే ఇస్లామాబాద్‌లో జరిగే చర్చలకు తానే స్వయంగా హాజరవుతానని ట్రంప్ చెబుతున్నారు. ఇరుపక్షాల మధ్య 'గొంతెమ్మ కోరికలకు పరిష్కార మార్గాలు, వాటికి ప్రత్యామ్నాయాలు కరువైన పరిస్థితుల్లో ఎవరు చర్చల్లో దిగినా మరింత ప్రతిష్టంభనే తప్ప ఏమీ ఉండదు. అమెరికా ఒక్క అడుగు వెనక్కి వేయదు. ఇరాన్ 'రాజీ' పడదు. పైగా కీలక సమయంలో మొండికేస్తోంది. మళ్లీ మళ్లీ చర్చలంటే తమకిష్టం లేదని చర్చలు ఫలవంతమవ్వాలని చిత్తశుద్ధి ఉంటేనే ఆలోచిస్తామంటోంది ఇరాన్. ఈసారి కూడా ఒప్పందం కుదరకపోతే ఇక బాంబుల దాడి తప్పదంటోన్న ట్రంప్ ఇరాన్‌తో మళ్లీ కఠినవైఖరితోనే ఉన్నారు. తాజాగా హార్మూజ్ జల సంధిని అంతర్జాతీయ ప్రయోజనాల రీత్యా తెరిచే ఉంచాలని చైనా అధినేత జిన్‌పింగ్ ఇరాన్‌కు హితవు చెబుతున్నారు. అడుగుఅడుగుకీ ఆటంకాలు తెచ్చిపెడుతున్న ట్రంప్ వాచాలతను ఎవరూ కట్టడి చేయలేకపోవడం విచారకరం. ఇరాన్‌లో 8 మంది మహిళలను ఉరికంబ మెక్కిస్తున్న తరుణంలో ట్రంప్ వారిని ఉరితీయకుండా ఉండటం తమకు, తమతో చర్చలకు సుహృద్భావ వాతావరణం కల్పించినట్లవుతుందని ఇరాన్‌కు సందేశం పంపారు. అమెరికా, ఇరాన్‌ల మధ్య 'హార్మూజ్' చిచ్చు ఇంకా ఆగలేదు. హార్మూజ్ జలసంధి దిగ్బంధంలో అమెరికా తమ కార్గోనౌకపై దాడి చేసి స్వాధీనం చేసుకొన్నామన్న ప్రకటనతో ఇరాన్ దాదాపు తల్లడిల్లిపోయింది. ఇరాన్ తన శాంతిచర్చల బృందాన్ని ఇస్లామాబాద్‌కు పంపబోమని తెగేసి చెప్పింది. ఇప్పటికే అమెరికా ఇరాన్‌ల మధ్య శాంతి ఒప్పందం సర్వత్రా మంచిదని కొన్ని దేశాలు తమకు సానుకూలంగా స్పందించే దేశాలకు హితవు చెప్పడం ప్రారంభించాయి. హిందూ మహాసముద్రంలో ఇరాన్ నౌకను అమెరికా తమ ఆధీనంలోకి తీసుకోవడం ఇరాన్‌కు రుచించడం లేదు. ఇవన్నీ ప్రతిష్టంభన పరిస్థితుల్లోకి నెట్టివేసాయంటోంది ఇరాన్. అందుకే ఈ సారి గడవుకు పాక్ అభ్యర్థించింది. ఇండోనేషియా, శ్రీలంక మధ్యన హిందూ మహాసముద్ర జలాల్లో అమెరికా స్వాధీనం చేసుకున్న ఇరాన్ నౌక ఎంటీ టిఫానీ నౌకను ఇంతదాక ఇరాన్‌కు విడుదల చేయకపోవడం కూడా వారి ఆగ్రహావేశాలకు దారితీసింది. అందుకే ఇరాన్ లొంగి రావడం లేదు. యుద్ధ వ్యూహాలు పన్నడం అటుంచి శాంతి చర్చల విషయంలో ఇరాన్ మెట్టు దిగకపోవడం అమెరికాను నమ్మకలేకపోవడమే. అమెరికా అల్టిమేటంను ఖాతరు చేయకుండా ఇరాన్ మొండికేయటంతో ఇక చేసేది లేక ట్రంప్ గడువు సమయాన్ని పెంచారు. మలి విడత చర్చలకు మరోగడువు దొరకడంతో శాంతిచర్చల బృందాలు ఊపిరి పీల్చుకున్నాయి. టెహ్రాన్‌ను ఒప్పించేందుకు పాక్ ప్రతినిధులు చేయని ప్రయత్నం లేదు. ట్రంపే స్వయంగా గడువును పొడిగించడంతో అమెరికా బాంబులకు ప్రస్తుతానికి పనిలేకుండాపోయింది. శాశ్వత శాంతి ఒప్పందం దిశగా చర్చలను తీసుకెళ్లాలని మధ్యవర్తిత్వ దేశం పాక్ ఉవ్విళ్లూరుతోంది. ప్రపంచ శాంతికి, చమురుధరలు ప్రజ్వలనం కాకుండా చూసామన్న ఖ్యాతి తమకే దక్కాలనీ పాక్ ఎదురుచూస్తోంది. పాక్ ఇప్పటికీ ఆశావహదృక్పథంతోనే ఉంది. ఈసారి రణరంగంలో కొత్త షాకులియ్యాలని ఎదురుచూస్తున్న టెహ్రాన్ పెద్దలు 'కాల్పుల విరమణ' గడువు పొడిగించడంతో ఊపిరి పీల్చుకున్నారు. మరోపక్క హార్మూజ్ జలసంధి వద్ద అమెరికా స్వాధీనం చేసుకున్న 'తౌస్కా' నౌకలో క్షిపణుల తయారీ రసాయనాలు ఉన్నాయంటూ ఐక్యరాజ్యసమితిలో అమెరికా మాజీ రాయబారి నిక్కీ హేలీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇవన్నీ చైనా నుంచి ఇరాన్‌కు అందుతున్నక్షిపణులేనని ఆరోపించారు. ఏ విధంగానూ నిజనిరూపణలేకుండా ఇరాన్‌కు చైనా యుద్ధ వనరులను, పరికరాలను అందిస్తోందని తెలియచెప్పడానికి వ్యూహం పన్నారు. అంతేకాదు హిందూ మహాసముద్రంలో అమెరికా ఇరాన్ నౌకను స్వాధీనం చేసుకోవడంలో తప్పేమీ లేదని చెప్పుకోవడమే దీని నేపథ్యం. కాగా హార్మూజ్‌లో ఇరాన్ దాడులతో పరిస్థితి అల్లకల్లోలంగా తయారైంది. ఒమన్ వైపు వెళ్లే నౌకలపై దాడులు జరిగాయి. మరో కార్గోషిప్‌పై కూడా ఇరాన్ సేనలు విధ్వంసానికి ఒడిగట్టాయి. పశ్చిమాసియా యుద్ధం సత్వర పరిష్కారం జరిగితే తప్ప ప్రతిష్టంభన తొలగే ఛాయలు కనపడటం లేదు. ఇరాన్ స్పందించకున్నా మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ మునీర్ అభ్యర్థన మేరకు ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందాన్ని నిరవధికంగా పొడిగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారంటే తాత్కాలికంగానైనా ఇక యుద్ధం ఆగినట్లు భావించాలి. హార్మూజ్ జలసంధి, ఖర్గ్ ద్వీపం మీద కన్నేయడంతో ఇరాన్ ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తోంది. హార్మూజ్‌పై అమెరికా దిగ్బంధనం అలాగే ఉంటుందని ట్రంప్ అంటుండగా ఇరాన్ మాత్రం అమెరికా సైన్యాన్ని అక్కడ్నించి ఉపసంహరించుకుంటే తప్ప చర్చలకు రాబోమని ఇరాక్ విదేశాంగ ప్రతినిధి స్పష్టం చేశారు. ఇలాగైతే చర్చలపై ప్రతిష్టంభన ఎంతకాలం ఉంటుందో ఊహాకందదు. ఇరాన్‌ను ఆర్థికంగా బలహీనపరచడమే లక్ష్యంగా పావులు కదుపుతున్న ట్రంప్ కూడా సామరస్యంగా వ్యవహరించాల్సిన అవసరం కనపడుతోంది.

మీరు గౌరవాన్ని కోరుకుంటే ముందు మిమ్మల్ని మీరు గౌరవించుకోవాలి. మీ అనుమతి లేనిదే మిమ్మల్నెవరూ చిన్నచూపు చూడరు.



శామ్యూల్ జాన్సన్

విజయం మేధావిని వినయవంతుణ్ని చేస్తుంది. సామాన్యుడిని ఆశ్చర్యపరుస్తుంది. అవివేకిని అహంభావిగా మారుస్తుంది.



స్వామి వివేకానంద

# ప్రజావాక్కు

## ప్రాణాలకు ముప్పు

భారతదేశంలో బాణసంచా తయారీ కేంద్రాలలో తరచుగా సంభవిస్తున్నపేలుళ్లు సామాన్యుల ప్రాణాలకు ముప్పుగా పరిణమించాయి. దేశవ్యాప్తంగా గతఐదేళ్లలో సుమారు 180ప్రమాదాలు జరగగా, 480 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ముఖ్యంగా తమిళనాడులోని విరుదునగర్ జిల్లా ఈ వినాశనానికి కేంద్ర బిందువుగా మారింది. 2022-2025 మధ్య ఇక్కడ 89 సంఘటనలు జరిగి 134 మంది మరణించడం వ్యవస్థీకృత వైఫల్యానికి నిదర్శనం. లాభార్జనే ధ్యేయంగా భద్రతా ప్రమాణాలను విస్మరించడం, అనుమతించిన పరిమితికి మించి కార్మికులను వినియోగించడం, నిషేధిత రసాయనాల వాడకం ఈ ఘోరాలకు ప్రధాన కారణాలు. అనుమతి ఉన్న కేంద్రాల్లో సైతం నిబంధనలకు విరుద్ధంగా సెలవు దినాల్లో పనులు నిర్వహించడం, ముడి సరుకులను భారీగా నిల్వ ఉంచడం యజమానుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## కమిటీలు ఏర్పాటు చేయాలి

తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం సోషల్ వెల్ఫేర్, ఎస్సి కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రతి మండలతహసిల్దార్ అధ్యక్షతన రాష్ట్రంలోని ప్రతి గ్రామం లోనిదళిత కమ్యూనిటీ ప్రజల ఆధ్వర్యంలో దళిత గ్రామ అభివృద్ధి కమిటీలను ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటు చేయాలి. నూతనసంస్కరణలో భాగంగా గ్రామాలలో ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా వెనుకబడిన దళితుల అభివృద్ధి కోసం దళిత అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేయాలి. ఆకమిటీలలో విద్యావంతులు, మహిళలు, యువకులు, దళిత ఉద్యోగి ఒకరు ఉండేవిధంగా, దళిత కాలనీలలో మౌలిక వసతులు అంబేద్కర్ విగ్రహాల పరిరక్షణ, అసైన్డ్ భూముల అభివృద్ధికి కృషి చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

## మహనీయుల పుస్తకాలను అందిద్దాం

వేసవి కాల దృష్ట్యా మన ఇంట్లో ఉండే పిల్లలు దాదాపు బయటికి వెళ్ళే అవకాశాలు చాలాతక్కువ. ఇలాంటి సమయంలో రోజులుకాసేపు మీపిల్లలకు మహనీయుల జీవిత పుస్తకాలను మీరే దగ్గరుండి చదివించండి. జ్ఞానం, కుల వివక్ష, అసమానతల, ప్రశ్నించేతత్వం సమాజం పట్ల అవగాహన కల్పించిన వారు అవుతారు. ఒక తల్లిదండ్రులుగా నేర్పించాల్సిన బాధ్యత మిది.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## గ్రంథాలయాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

జిల్లా కేంద్ర గ్రంథాలయాలలో ఏదైనా పుస్తకము కావాలని వెళితే ఆ పుస్తకము అక్కడ ఉన్నదీ లేనిది తెలియదు. కేటలాగ్ ఉండదు. వెతుక్కోవాలి. ఎబీరువాలో ఉంటుందో తెలియదు. అసలు ఉన్నదీ లేనిదీ తెలియదు. ఏదొక పుస్తకం తెచ్చుకోవలసి వస్తుంది. ఆ బీరువాలో పుస్తకాలు గందరగోళంగా ఉంటాయి. వరుసలో ఉండవు. అటుఇటు ఇటు అటు. పుస్తకం మీద పేరు ఉండదు. పేరు కావాలంటే పుస్తకం తెరిచి చూసుకోవాలి. మనం కట్టే పన్నుల్లో లైబ్రరీ టాక్స్ ఉంటుంది. సరిగా చూడవలసిన బాధ్యత ఆ స్టాఫ్‌కు ఉంది. గ్రంథాలయంలోఎన్నిపుస్తకాలు ఉన్నాయి? కేటలాగ్ ఉండాలి. దానిలో చూపినవిధంగా వరుస క్రమంలో ఉండాలి. ప్రతి పుస్తకం అట్ట మీద పుస్తకం పేరు, రచయిత పేరు, సీరియల్ నంబరు ఉండాలి. వేటపాలెం సారస్వత గ్రంథాలయంలోకి వెళ్ళి మనకు కావలసిన పుస్తకాన్ని రెండు నిమిషాలలో తీసుకోవచ్చు.

- నార్నే వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## పిల్లల్లో నైపుణ్యాన్ని మెరుగుపరచాలి

ఉభయ రాష్ట్రాల్లో పాఠశాల విద్యార్థులకు త్వరలో వేసవి సెలవులురానున్నవి. ఈసమయాన్ని రాబోయేతరగతిలోవారికి ఏదైనా అంశాలు అవగాహన లేని వాటిపై దృష్టి పెట్టాలి. ముఖ్యంగా గణితం, తెలుగు వ్యాకరణం, ఆంగ్ల వ్యాకరణం తృప్తిగా అర్థమయ్యే విధంగా తల్లితండ్రులు, లేదా మిత్రుల సహకారంతో పునాది వేసుకోవాలి. విజ్ఞాన శాస్త్రం పాఠంలో సందేహాలు, ప్రశ్నలు రాసుకొని సందేహాలను తప్పక నివృత్తి చేసుకోవాలి. ఇవన్నీ చేసేందుకు విద్యార్థులకు ఉత్తమ కాలం, అదనంగా పత్రిక పఠనం, నీతి కథలు, చిత్రలేఖనం, దస్తూర్ణి మెరుగుపరచడంతప్పకచేయాలి. కాస్తసమయం ఆటల్లో పాల్గొనాలి. వీటి అమలుకు తల్లితండ్రులే ప్రధాన పాత్రధారులు.

- బొల్లోజు మేఘనదాం, విశాఖపట్నం

## సమాజానికి కొత్త సవాలు

నేటి కాలంలో సోషల్ మీడియా మన జీవితాల్లో భాగమైపోయింది. సమాచారం పంచుకోవడం, వ్యక్తిగత అభిరుచులను వ్యక్తపరచడం, ప్రపంచంతో మమేకం కావడం వంటి అనేక ప్రయోజనాలను ఇది అందిస్తోంది. అయితే అదే సమయంలో దీని దుర్వినియోగం సమాజానికి తీవ్రమైన ప్రమాదాలను కూడా సృష్టిస్తోంది. ముఖ్యంగా వదంతులు, అబద్ధపు వార్తలు వేగంగా వ్యాప్తిచెందడానికి సోషల్‌మీడియా వేదిక అవుతోంది. నిజానిజాలు తెలియకుండానే ప్రజలు షేర్‌చేయడం వల్ల చిన్న సంఘటనలు కూడా పెద్ద వివాదాలుగా మారుతున్నాయి.

- కె.రామారావు, నల్గొండజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# విపత్తు నివారణకు మరిన్ని జాగ్రత్తలు

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాల్లో ప్రస్తుత పరిస్థితులు ఒక సవాల్ వంటివి. ముంచుకొస్తున్న ఎండలు, నీటి కొరత, పిడుగుల ముప్పును ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగాలు ఇప్పటి నుంచే సమ న్వయంతో పనిచేయాలి. జలాశయాల నీటి మట్టాల పర్య వేక్షణ, తాగునీటి సరఫరా ప్రణాళికలు, విద్యుత్ డిమాండ్ ను తట్టుకునే ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన జరగాలి. విపత్తు సంభవించిన తర్వాత సహాయక చర్యలు చేపట్టడం కంటే, విపత్తు రాకుండా లేదా దాని తీవ్రతను తగ్గించేలా వ్యవహరించడమే మేలైన పరిపాలన. పాలకుల చిత్తశుద్ధి, అధికారుల అప్రమత్తత, ప్రజల సహకారం తోడైతేనే ఈ ఎల్‌నినో గండాన్ని మనం సురక్షితంగా దాటగలం. కాలం మించిపోకముందే అడుగులు వేయకపోతే, ఆనష్టాన్ని పూడ్చుకోవడం భవిష్యత్తులో అసాధ్యంగా మారుతుంది. పకడ్బందీ ప్రణాళికే ఇప్పుడు మనకున్న ఏకైక ఆయుధం. మన ముందున్న ఈ క్లిష్ట సమయాన్ని ధైర్యంగా, శాస్త్రీయంగా ఎదుర్కోవడమే తెలుగు రాష్ట్రాల తక్షణ కర్తవ్యం.

డి. అశోక్

ప్రకృతి వైపరీత్యాలు ముంచుకొచ్చినప్పుడు మాత్రమే స్పందించడం కంటే, అవి రాకముందే అప్రమత్తం కావడం నాగరిక సమాజ లక్షణం. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు మునుపెన్నడూ లేని విధంగా ఒక గడ్డు కాలం ఎదురుకాబోతోందని స్పష్టమవుతోంది. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం వల్ల రుతుపవనాలు మొహం చాటేసే ప్రమాదం ఉందని, వేసవి ఉష్ణోగ్రతలు ఆకాశాన్ని తాకనున్నాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికలు జారీ చేసింది. 2026లో నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే తక్కువగా, కేవలం 92 శాతం మేరకే ఉండవచ్చుననే అంచనా ఆందోళన కలిగిస్తోంది. సాధారణంగా జూన్ మొదటి వారంలో పలకరించే రుతుపవనాలు ఈసారి ఆలస్యంగా వచ్చే అవకాశం ఉండటమే కాకుండా, అవి అత్యంత బలహీనంగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. దీనివల్ల కేవలం వర్షాలు తగ్గడం మాత్రమే కాదు, సుదీర్ఘ కాలం పాటు వేడి, ఉక్కపోత కొనసాగి జనజీవనాన్ని అతలాకుతలం చేసే ముప్పు ఉంది. చేతులు కాలక ముందే ఆకులు పట్టుకోవడం అన్న సామెతను గుర్తు చేసుకుంటూ, ప్రభుత్వ యంత్రాంగం ఇప్పుడే కార్యాచరణకు దిగాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్పడింది. లేదంటే అటు వ్యవసాయ రంగం, ఇటు ప్రజారోగ్యం తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది. ఎల్‌నినో ప్రభావం వల్ల తలెత్తే పరిణామాలు గొలుసుకట్టు సమస్యలను సృష్టిస్తాయి. రుతుపవనాల రాక ఆలస్యమైతే అస్థిరమైన వాతావరణం ఏర్పడి, ఉరుములు, మెరుపులతో కూడిన పిడుగులు పడే ప్రమాదం గణనీయంగా పెరుగుతుంది. ఇప్పటికే రెండు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతం నిప్పుల కొలిమిలా మారింది. కడప, నెల్లూరు, తిరుపతి వంటి నగరాల్లో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల సెంటిగ్రేడ్ దాటడం రాబోయే తీవ్రతకునిదర్శనం. తెలంగాణలోనూ జగిత్యాల, ఆదిలాబాద్, నల్గొండ వంటి జిల్లాల్లో భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఈ ఎండల వల్ల వాతావరణంలో విద్యుత్ అయస్కాంత మార్పులు సంభవించి పిడుగులు పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. గత ఏడాది గణాంకాలను పరిశీలిస్తే, దేశవ్యాప్తంగా పిడుగుల బారిన పడి మరణించిన వారి సంఖ్య 2,560గా ఉంది. ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కలిపి సుమారు 150 మంది ప్రాణాలు కోల్పోవడం విచారకరం. పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు వర్షం రాగానే చెట్ల కిందకు వెళ్లడం వల్ల ఈ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ఏడాది పిడుగుల ముప్పు మరింత ఎక్కువగా ఉంటుందన్న అంచనాల దృష్ట్యా, గ్రామీణ ప్రాంతాల్లో ముందస్తు అవగాహన కల్పించడం అత్యంత కీలకం. కేవలం ప్రాణ నష్టం జరిగిన తర్వాత పరిహారం ప్రకటించడం వల్ల ప్రయోజనంఉండదు, ప్రాణాలు పోకుండా రక్షించే సాంకేతికతను, హెచ్చరికలను క్షేత్రస్థాయికి చేరవేయడమే అసలైన పరిష్కారం. మరోవైపు, వర్షపాతం తగ్గడం వల్ల నీటిఎద్దడి సమస్య భూతంలా విరుచుకుపడే అవకాశం ఉంది. ఏప్రిల్ మాసం నాటికే కృష్ణా నదిపై ఉన్న శ్రీశైలం, నాగార్జున సాగర్ వంటి ప్రధాన జలాశయాల్లో నీటి మట్టాలు ఆందోళనకర స్థాయికి పడిపోయాయి. శ్రీశైలంలో కేవలం 15శాతం నిల్వలు మాత్రమేఉండటం రాబోయే జల సంక్షోభానికి సంకేతం. వర్షాలు సమయానికి కురవకపోతే సాగునీటి మాట పక్కన పెడితే, కనీసం తాగు




నీటి సరఫరాకు కూడా ఇబ్బందులు తప్పవు. దీనివల్ల నగరాల్లోనూ, గ్రామాల్లోనూ ప్రజలు నీటిచుక్క కోసం అల్లాడాల్సి వస్తుంది. భూగర్భ జల మట్టాలు కూడా పడిపోతుండటంతో బోరుబావులపై ఆధారపడటం కష్టతరమవుతుంది. జల వనరుల నిర్వహణలో ఇప్పటి నుంచే పొదుపు చర్యలు పాటించకపోతే, వేసవి చివరలో పరిస్థితి చేయి దాటిపోయే ప్రమాదం ఉంది. నీటి వినియోగంపై ప్రజల్లో చైతన్యం తేవడంతో పాటు, అందుబాటులో ఉన్న నీటిని ప్రాధాన్యత క్రమంలో తాగునీటి అవసరాలకు కేటాయించే ప్రణాళికలను పాలకులు సిద్ధం చేసుకోవాలి. ఈప్రకృతి వైపరీత్యాల ప్రభావం అన్నింటికంటే ఎక్కువగా రైతాంగంపైనే పడుతుంది. జూన్ నెలలో సాధారణంగా ఖరీఫ్ పనులు ప్రారంభం కావాలి. కానీ రుతుపవనాల అనిశ్చితి వల్ల విత్తనాలు విత్తడం ఆలస్యమవుతుంది. ఇది పంటల దిగుబడిపై నేరుగా ప్రభావం చూపుతుంది. రైతులు వానాకాలం పంటల కోసం ఆకాశం వైపు చూడటం, చివరకు గత్యంతరం లేక బోరు బావుల కింద పంటలు వేయడం వల్ల పెట్టుబడి వ్యయం పెరుగుతుంది. ఎండలు తీవ్రంగా ఉండటంతో రైతులు, కూలీలు ఆరుబయట పని చేయడం వారి శారీరక శక్తిని హరిస్తుంది. వడదెబ్బ బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయ శాఖ ఈ పరిస్థితులను గమనించి, తక్కువ నీటితో పండే పంటల గురించి, వర్షాలు ఆలస్యమైతే అనుసరించాల్సిన ప్రత్యామ్నాయ సాగు పద్ధతుల గురించి రైతులకు ముందే దిశానిర్దేశం చేయాలి. విత్తనాలు, ఎరువుల లభ్యతలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడటం యంత్రాంగం బాధ్యత. ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గితే మార్కెట్‌లో ధరలు పెరిగి సామాన్యుడిపై ఆర్థిక భారం పడుతుంది, తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వాల స్పందన కేవలం కాగితాలకే పరిమితం కాకూడదు. వాతావరణ శాఖ ఇచ్చే హెచ్చరికలు ప్రతి గ్రామానికి, ప్రతి రైతుకు చేరువ కావాలి. స్మార్ట్‌ఫోన్ల యుగంలో కూడా సమాచారం సకాలంలో అందకపోవడం విచారకరం. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయాల్లో ఉపాధి హామీ కూలీలకు పనివేళలు మార్చడం, వారు విశ్రాంతి తీసుకోవడానికి పని స్థలాల్లో నీడ, తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం వంటి చిన్న చర్యలు కూడా ఎంతో మంది ప్రాణాలను కాపాడతాయి. ఆరోగ్య శాఖ ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వడదెబ్బ బాధితులకు ప్రత్యేక వార్డులను సిద్ధం చేయాలి. అలాగే పిడుగుల నుండి రక్షణ పొందే మార్గాలపై విస్తృత ప్రచారం జరగాలి. ఉరుములు మెరుపులు వచ్చే సమయంలో పొలాల్లో ఉండకూడదని, ఒంటరిగా ఉన్న చెట్ల కిందకు చేరకూడదని ప్రజలకు పదేపదే వివరించాలి. సాంకేతికతను ఉపయోగించుకుని స్థానిక భాషలోఎప్పటికప్పుడు హెచ్చరికలు పంపే వ్యవస్థను బలోపేతం చేయాలి. ప్రకృతి వైపరీత్యాలను మనం ఆపలేం కానీ, వాటి వల్ల కలిగే నష్టాన్ని మాత్రం ముందస్తు జాగ్రత్తలతో తగ్గించగలం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రస్తుత పరిస్థితులు ఒక సవాల్ వంటివి. ముంచుకొస్తున్న ఎండలు, నీటి కొరత, పిడుగుల ముప్పును ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగాలు ఇప్పటి నుంచే సమన్వయంతో పనిచేయాలి. జలాశయాల నీటి మట్టాల పర్యవేక్షణ, తాగునీటి సరఫరా ప్రణాళికలు, విద్యుత్ డిమాండ్ ను తట్టుకునే ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన జరగాలి. విపత్తు సంభవించిన తర్వాత సహాయక చర్యలు చేపట్టడం కంటే, విపత్తు రాకుండా లేదా దాని తీవ్రతను తగ్గించేలా వ్యవహరించడమే మేలైన పరిపాలన. పాలకుల చిత్తశుద్ధి, అధికారుల అప్రమత్తత, ప్రజల సహకారం తోడైతేనే ఈ ఎల్‌నినో గండాన్ని మనం సురక్షితంగా దాటగలం. కాలం మించిపోకముందే అడుగులు వేయకపోతే, ఆనష్టాన్ని పూడ్చుకోవడం భవిష్యత్తులో అసాధ్యంగా మారుతుంది. పకడ్బందీ ప్రణాళికే ఇప్పుడు మనకున్న ఏకైక ఆయుధం. మన ముందున్న ఈ క్లిష్ట సమయాన్ని ధైర్యంగా, శాస్త్రీయంగా ఎదుర్కోవడమే తెలుగు రాష్ట్రాల తక్షణ కర్తవ్యం.

# నయా నైపుణ్యాలే ఉద్యోగావకాశాలకు మార్గం

ఉదయ్ కుమార్

తెలంగాణలో, ముఖ్యంగా హైదరాబాద్ కేంద్రంగా ఐటీ రంగం ప్రస్తుతం ఒక కీలక మార్పు దశలో కొనసాగుతోంది. ఒకవైపు వృద్ధి కొనసాగుతుండగా, మరోవైపు ఉద్యోగాల స్వరూపం వేగంగా మారుతోంది. ఈ పరిస్థితి ఉద్యోగార్థులకు ఒకేసారి అవకాశాలు, సవాళ్లు రెండింటినీ తీసుకువస్తోంది. వృద్ధి కొనసాగుతోంది - కానీ రూపాంతరం చెందుతోంది. తెలంగాణలో ఐటీ ఎగుమతులు సుమారు 3.6లక్షల కోట్ల స్థాయికి చేరుకోవడం ఈ రంగం బలాన్ని ప్రతిబింబిస్తోంది. హైదరాబాద్‌లో 400కు పైగా గ్లోబల్ సామర్థ్య కేంద్రాలు పనిచేస్తుండటం, కొత్త పెట్టుబడులు ఆకర్షితమవడం ఐటీ రంగం ఇంకా విస్తరిస్తోందనడానికి సంకేతాలు. రాష్ట్ర ప్రభుత్వం 2026 నాటికి మరిన్ని గ్లోబల్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకోవడంతో సుమారు 1.2 లక్షల ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఉందని అంచనా. పలుకంపెనీలు ఇటీవల హైదరాబాద్‌లో నూతనంగా తమ కార్యకలాపాలను విస్తరించడం ప్రారంభించాయి. కొన్ని సంస్థలు వేల సంఖ్యలో టెక్నాలజీ ఉద్యోగులను నియమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. అయితే గతంతో పోలిస్తే నియామకాలు ఇప్పుడు మరింత ఎంపికాత్మకంగా మారాయి. డిగ్రీతో పాటు నైపుణ్యాలు, అనుభవం, బహుళ సామర్థ్యాలు ఉన్నవారికే ప్రముఖ కంపెనీలు ప్రాధాన్యత ఇస్తున్నాయి. ప్రస్తుతం ఐటీ రంగంలో అధిక డిమాండ్ ఉన్న విభాగాలుగా కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) మెషీన్ లెర్నింగ్ (ఎమ్‌ఎల్), డేటా ఎనాలసిస్, డేటా సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ భద్రత వంటి రంగాల్లో నైపుణ్యాలు ఉన్నవారికి అధిక అవకాశాలు, మంచి వేతనాలు లభిస్తున్నాయి. ముఖ్యంగా ఎఐ ఆధారిత ఉద్యోగాలు అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్న ఉద్యోగాలుగానూ, ఈ రంగం వేగంగా విస్తరిస్తున్న విభాగంగా వృద్ధి చెందుతోంది. అయితే ప్రస్తుతం ఇప్పటి వరకూ అనుభవం లేకుండా కొత్తగా ఉద్యోగం కోసం ప్రయత్నించే




వారికి పరిస్థితి కాస్త కఠినంగా మారింది. ఎంట్రీలెవెల్ ఉద్యోగాలు తగ్గడం, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ పరిమితం కావడం, అనుభవం ఉన్న అభ్యర్థులకే ప్రాధాన్యత ఇవ్వడం వంటి పరిణామాలు ఎక్కువ చోట్ల కనిపిస్తున్నాయి. అయితే ప్రాజెక్ట్ అనుభవం, ఇంటర్న్‌షిప్‌లు, ప్రాక్టికల్ స్కిల్స్ ఉన్నవారికి అవకాశాలు ఇంకా అందుబాటులోనే ఉన్నాయని చెప్పవచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగంలో లేఆఫ్స్ కొనసాగుతున్నాయి. అమెజాన్, ఒరాకిల్, సేల్స్‌ఫోర్స్, అట్లాసియన్ వంటి సంస్థలు వేలసంఖ్యలో ఉద్యోగులను తగ్గించాయి. అలాగే మరికొన్ని కంపెనీలు కూడా ఉద్యోగాల కోతలకు సిద్ధమవుతున్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి. 2026 తొలి త్రైమాసికంలోనే ప్రపంచవ్యాప్తంగా 70-80 వేల మంది టెక్ ఉద్యోగులు ఉద్యోగాలు కోల్పోయినట్లు అంచనా. కాగా ఈ పరిస్థితికి ప్రధాన కారణాలుగా కోవిడ్ కాలంలో అధిక నియామకాలు, గ్లోబల్ ఆర్థిక మందగమనం, ఆటోమేషన్, ఎఐ వినియోగం పెరగడం వంటివేనని చెప్పవచ్చు. భారతదేశం గ్లోబల్ ఐటీ ఔట్‌సోర్సింగ్ కేంద్రంగా ఉండటం వల్ల అంతర్జాతీయ పరిణామాల ప్రభావం నేరుగా ఇక్కడ కనిపిస్తోంది. ఫ్రెషర్స్ నియామకాలు తగ్గడం, వేతనాల పెరుగుదల మందగించడం, కాంట్రాక్ట్ ఉద్యోగాలు పెరగడం వంటి మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగార్థులు కంపెనీల అవసరాలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా తమను తాము మార్చుకోవాల్సినఅవసరం ఉంది. ఈ మేరకు కొత్త టెక్నాలజీలపై నిరంతర అభ్యాసం, ప్రాజెక్ట్ అనుభవం పెంపొందించుకోవడం, బహుళ నైపుణ్యాలు సాధించడం ద్వారా ఉద్యోగార్థులు అవకాశాలను మెరుగుపరచుకునే అవకాశం ఉంటుంది. అదే విధంగా కంపెనీలు కూడా ఉన్నవారిని తొలగించకుండా ఉద్యోగులకు నూతన సాంకేతిక పరిజ్ఞానానికి తగినవిధమైన శిక్షణనివ్వడంద్వారా అవకాశాలు కల్పించడం, బాధ్యతాయుతంగా వ్యవహరించడం అవసరం. ఏదిఏమైనప్పటికీ ఐటీరంగంలో జరుగుతున్న పరిణామాలు సంక్షోభంగా కనిపించినప్పటికీ, ఇవి ఒక రూపాంతరం సంకేతాలు. పాతఉద్యోగాలు తగ్గుతున్నప్పటికీ, కొత్త నైపుణ్యాలపై ఆధారపడిన అవకాశాలు విస్తరిస్తున్నాయి. మార్పులకు సిద్ధంగా లేని వారికి ఇది సవాళ్లను ఎదుర్కొనే సమయంగా ఉన్నప్పటికీ నైపుణ్యం ఉన్నవారికి ఐటీ రంగం ఇంకా అవకాశాల వేదికగానే ఉంది.

# డీలిమిటేషన్‌తో దేశ సమగ్రతకు నష్టం!

డాక్టర్ సమర్ స్నేహ ఎనుగొండ

డీలిమిటేషన్‌తో జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలలో పాలనాపరమైన రాజధానులుగా మారే దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణతో ఆర్థిక అభివృద్ధి జరగడం వలన ఆర్థిక రాజధానులుగా మిగిలిపోతాయి. ఈ ఆర్థిక రాజధానులను దోపిడీ చేస్తూ జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలు లబ్ధి పొందడం కాయం. ఏ దేశానికైనా ఆ దేశ సమగ్రతకు రాష్ట్రాల సాధికారిత ముఖ్యం. కేంద్రం కింద రాష్ట్రాలు నలిగిపోకూడదు. తమ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఒకరకమైన విధానాలు ఇతర పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాలలో వేరే రకమైన విధానాలు వలన దేశ సమైక్యత సమగ్రత దెబ్బతింటుంది. భారతదేశం కేంద్రీకృత సమాఖ్య వ్యవస్థగా పుట్టింది. ఈ సమాఖ్య వ్యవస్థలో అన్ని రాష్ట్రాలకు సమాన అవకాశాలు కేంద్ర ప్రభుత్వం కల్పించాలి. నేడు కేంద్రంలో ఉన్న ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన పార్లమెంటరీ స్థానాలను, అసెంబ్లీ స్థానాలను, నిర్ణయిస్తూ డీలిమిటేషన్ చేపట్టడం చూస్తున్నాం. బిజెపి పాలిత రాష్ట్రాలలో అధిక జనాభా గల రాష్ట్రాలుగా ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేస్తే 850 లోక్‌సభ సీట్లు పెరుగుతాయని ఒక అంచనా. అందులో దక్షిణాది రాష్ట్రాలకు 66 సీట్లు మాత్రమే పెరిగే ఉత్తరాది రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్ బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ (బీమారి రాష్ట్రాలు)గుజరాత్ ఈ ఐదు రాష్ట్రాలకు గాను 101 లోక్‌సభ సీట్లు పెరుగుతాయి. ఈ ఉత్తరాది రాష్ట్రాలకు లోక్‌సభ సీట్లు 77 పెరగగా దక్షిణాది రాష్ట్రాలకు తెలంగాణ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక 33శాతం మాత్రమే పెరుగుతాయి అయితే దక్షిణాది రాష్ట్రాల గత లోక్సభ 543 సీట్లలో 25 శాతం ఉండగా నేడు అది 20 శాతానికి పడిపోతున్నది. అదే ఉత్తరాది రాష్ట్రాల సభ్యుల శాతం గతంలో 38 శాతం కాగా నేడు అది 43 శాతానికి పెరుగనున్నది. ఇలా డీలిమిటేషన్ వలన ఉత్తరాది రాష్ట్రాలు లోక్‌సభ సభ్యుల సంఖ్య పెరిగిపోయి దక్షిణాది రాష్ట్రాలపై వారి ఆధిపత్యం ఉంటుందని ఇది దేశ సమైక్యతకు సమగ్రతను దెబ్బతీస్తుందని నిపుణుల అభిప్రాయం. ఉత్తరాది రాష్ట్రాలు దేశ పరిపాలన విధానాలలో ఆధిపత్యం వహిస్తాయి. పెరుగుతున్న జనాభాకి కావలసిన వసతులు కల్పించలేమని 1970లో జనాభా పెరుగుదలను గణనీయంగా దక్షిణాది రాష్ట్రాలు తగ్గించుకుంటే అదే నేడు దక్షిణాది రాష్ట్రాలకు శాపంగా మారింది. దేశ ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న దక్షిణాది రాష్ట్రాలు పాలనాపరమైన విషయాలలో పార్లమెంట్లో వారి పాత్ర ఉత్తరాది రాష్ట్ర జనాభా ఆధిక్యం వలన తగ్గిపోతు న్నది. ఐదు దక్షిణాది రాష్ట్రాల



పన్నుల రాబడి వాటా 36 శాతం కాగా, 24ఉత్తరాది రాష్ట్రాల పన్నుల వాటా 64శాతమే. దక్షిణాది రాష్ట్రాల వాటా 36 అయినా కేంద్ర ప్రభుత్వం నుంచి దక్షిణాది రాష్ట్రాలు పొందుతున్నది కేవలం 18.6 శాతం మాత్రమే. ఆదాయం కొద్దీ జీఎస్టీ జనాభా కొద్దీ ఆదాయ పంపిణీ అంటూ దక్షిణాది రాష్ట్రాలు రూపాయి ఇస్తే వారికి తిరిగి 30పైసలు మాత్రమే ఇస్తూ, అదే ఉత్తరాది రాష్ట్రాల రూపాయి ఇస్తే నాలుగు రూపాయల వరకు వారి జనాభా పేదరికంలో కూరుకుపోయిందని ఇతర కారణాలు చెప్పి దేశ ఆదాయ వనరులను నేడు అప్పగిస్తుం డడం సమాఖ్య వ్యవస్థకు పూర్తిగా వ్యతిరేకమైనది. ఒక శాస్త్రవేత్త 1980లో బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలను భీమారు రాష్ట్రాలుగా పిలిచారు. అంటే బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, హిందీలో బీమారు అంటే వ్యాధిగ్రస్థమైన అనే అర్థంవచ్చే పదాన్ని చేర్చారు. జనాభా పరంగా ఆయుష్ ప్రమాణం రీత్యా పేద రికం నిరుద్యోగం తలసరి ఆదాయం అత్యల్ప స్థాయిలో ఉండి కనీస జీవన ప్రమాణాన్ని కూడా పొందని జనాభాఎక్కువగా ఉండడంతో భీమారు రాష్ట్రాలుగా పేర్కొన్నారు. ప్రజల జీవన ప్రమాణాల రీత్యా ఈ భీమారు రాష్ట్రాలు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే చాలా వెనుకబడి ఉన్నాయి. గ్లోబల్ మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ 2024 లో మన దేశం 112 దేశాలలో 105వది. దీనికి కారణం పైనపేర్కొన్న భీమారు రాష్ట్రాలలో అనేక జిల్లాల్లో కడు పేదరికంతో అల్ప వృద్ధిలో వెనుకబడిన ప్రాంతాలుగా ఉండడం ప్రధాన కారణం. ఇక్కడ ప్రజలు పేదరికంలో ఉపాధి అవకాశాలు లేక కొనుగోలు శక్తి అతి తక్కువగాపోషక ఆహారలోపంతో ఆయుష్ ప్రమాణంఅత్యల్ప స్థాయిలో ఉన్నది. దీనికి ప్రధా నమైన కారణం ఈ రాష్ట్రాలలో జనాభా నియంత్రణ అమ లు ఆశించిన మేరకు ఆనాడు జరగలేదు. 1970లో అప్పటి ప్రభుత్వాలు జనాభా నియంత్రణ చేస్తే తప్ప మానవనరుల ను విద్య, వైద్య ఆదాయపరంగా అభివృద్ధి చేయలేమని కుటుంబ నియంత్రణతోనే మానవాభివృద్ధి జరుగుతుందని కుటుంబ నియంత్రణ దేశవ్యాప్తంగా చేపట్టగా దక్షిణాది రాష్ట్రాలు ఈ విధానాన్ని కచ్చితంగా అమలు చేయడంవలన నేడు ఈ దక్షిణాది రాష్ట్రాల జనాభా తగ్గుతూ వచ్చింది. అయితే ఈ భీమారు స్టేట్స్ కుటుంబ నియంత్రణనుతూతూ మంత్రంగా అమలు చేయడం వలన జనాభా పెరిగింది. ఇప్పుడు జనాభా రంగంలో డీలిమిటేషన్ చేసి పార్లమెంట్ సీట్లు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోంది.

# ఉగ్రవాదానికి భారత్ తలవంచదు

**వారి హేయమైన కుట్రలు సఫలం కావు: ప్రధాని మోడీ స్పష్టీకరణ**

**పహల్గామ్ దాడి మృతులకు నివాళి**

**ఆ బాధను మరచిపోలేదు: అమిత్ షా**

**ఆ గాయాలు ఇంకా మానలేదు: రాజ్‌నాథ్**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:** భారతదేశం ఏ విధమైన ఉగ్రవాదానికి తలవంచదని ప్రధానమంత్రి నరేంద్రమోడీ స్పష్టం చేశారు. ఉగ్రవాదుల హేయమైన కుట్రలు ఎప్పటికీ సఫలం కావని పేర్కొన్నారు. గత ఏడాది ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న లష్కరేతోయిబా ఉగ్రవాద సంస్థ దాడి చేసింది. ఈ దాడిలో భారతదేశం నలుమూలల నుండి వచ్చిన పర్యాటకులతో సహా 26 మంది అమాయక ప్రజలు మరణించారు. పహల్గామ్ ఉగ్రదాడికి సరిగ్గా ఏడాది పూర్తైన సందర్భంగా బుధవారం ఆ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే, ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయకులను ఎన్నటికీ మర్చిపోలేమన్నారు. ఈ మేరకు ప్రధాని మోడీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయక ప్రజలను స్మరించుకుంటున్నా. మన ప్రజలను కోల్పోయిన దుఃఖం, బాధ ఇప్పటికీ ప్రతి భారతీయుడి హృదయంలో నిలిచి ఉన్నాయి. ఉగ్రవాదం మానవాళికి అతిపెద్ద శత్రువు. దానిపై పోరాడి ఓడించడానికి మనం ఐక్యంగా నిలబడాలి. ఉగ్రవాదం పట్ల, దానికి ఆశ్రయం ఇచ్చేవారి పట్ల భారత్ ఏమాత్రం ఉపేక్షించదు' అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయక ప్రజలకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నివాళి అర్పించారు. '2025 ఏప్రిల్ 22న జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యటకులపై పిరికిపంద ఉగ్రదాడి జరిగింది. ఆ దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయక ప్రజలను స్మరించుకుంటూ, వారికి నా హృదయపూర్వక నివాళి అర్పిస్తున్నా. అలాగే, మృతుల కుటుంబాలకు సంతాపం తెలుపుతున్నా. మన దేశంపై పడిన ఆ గాయాలను మేం ఎప్పటికీ మరచిపోలేం. దశాబ్ద కాలంగా భారత్ సరిహద్దు ఉగ్రవాదాన్ని ఎదుర్కొంది. కానీ మన ప్రజలకు హాని కలిగించడానికి కానీ, లేదా మన ఐక్యతను దెబ్బతీయడానికి కానీ చేసే ఏ ప్రయత్నాన్నైనా మనం అత్యంత బలంతో, స్పష్టతతో ఎదుర్కొంటామని దృఢమైన చర్యల ద్వారా మేం నిరూపించాం' అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొంటూ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. **దేశ వ్యతిరేక చర్యలకు గట్టి బదులిస్తాం: ఇండియన్ ఆర్మీ :** దేశానికి వ్యతిరేకంగా జరిగే ఎలాంటి చర్య లకైనా గట్టి బదులిస్తామని భారత సైన్యం హెచ్చ రించింది. ఉగ్రవాదులు సరిహద్దులు దాటవద్దని, ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని స్పష్టం చేసింది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను గుర్తుచేసుకుంటూ ఆర్మీ ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

## ఇడి దర్యాప్తులో మీ జోక్యమేంటి?

### ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో నెట్టేలా చర్యలు

**మమతాబెనర్జీపై సుప్రీంకోర్టు ఆగ్రహం**

**ఐప్యాక్ ఆఫీసుల్లో ఇడి సోదాలపై విచారణ**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ ఐప్యాక్ కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) నిర్వహించిన సోదాల సందర్భంగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అడ్డుపడ్డారన్న ఆరోపణలపై బుధవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఒక ముఖ్యమంత్రి విచారణలో జోక్యం చేసుకుంటే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని సుప్రీంకోర్టు పేర్కొంది. 'ఇది కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య ఉన్న వివాదం కాదు. ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి అయినా ఒక విచారణ లేదా దర్యాప్తు మధ్యలో హఠాత్తుగా అడుగుపెట్టి, ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టి, ఆ తర్వాత ఇది కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య ఉన్న వివాదం అని అంటారు' అని జస్టిస్‌లు ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఎన్.వి. అంజరియాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఇడి జరుపుతున్న విచారణ మధ్యలోకి ముఖ్య మంత్రి చొరబడి ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేయడం సరికాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఒక ఉన్నతాధికారి తరఫున కోర్టులో హాజరైన సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి, ఈ వివాదం ప్రధానంగా కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య ఉందని పేర్కొంటూ, ఇడి పిటిషన్ స్వీకార్యతను ప్రశ్నించిన సందర్భంగా ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. "ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి మొత్తం వ్యవస్థను, ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేస్తూ చేసిన చర్య" అని జస్టిస్ మిశ్రా వ్యాఖ్యానించారు. రాజ్యాంగం 'ప్రాథమిక స్వరూప సిద్ధాంతాన్ని" నిర్దేశించిన 1973 నాటి చారిత్రాత్మక కేశవానంద భారతి తీర్పుతో సహా అనేక తీర్పులను తమ ముందు ఉదహరించారని ధర్మాసనం పేర్కొంది. 'కానీ ఈ దేశంలో ఒకరోజు పదవిలో ఉన్న ముఖ్యమంత్రి కార్యాలయంలోకి అడుగుపెడతారని వారిలో ఎవరూ ఊహించి ఉండరు' అని జస్టిస్ మిశ్రా అన్నారు. సీనియర్ న్యాయవాది గురుస్వామి మాట్లాడుతూ, 'కేసు విచారణకు యోగ్యమైనదేనా అనే దానిపై ఉన్నాను... ఎటువంటి దుష్ప్రవర్తన జరగలేదు, ఏ అధికారిని బెదిరించడం జరగలేదు' అని అన్నారు. ఈ విషయంలో లేవనెత్తిన ప్రశ్నలను విస్తృత ధర్మాసనానికి నివేదించాలన్న వాదనలతో ధర్మాసనం ఏకీభవించలేదు. 'ఆర్టికల్ 32 పిటిషన్ విచారణకు యోగ్యమైనదా కాదా అని తాము నిర్ణయిస్తాము. ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం పరిశీలించాల్సినంత ముఖ్యమైన చట్టపరమైన ప్రశ్న ఏమిటి?' అని అది ప్రశ్నించింది. తాము అప్పీల్‌ను విచారించడం లేదని గమనిస్తూనే, తమ ముందు దాఖలైన అన్ని పిటిషన్లలోనూ కొన్ని చట్టపరమైన ప్రశ్నలు ఉంటాయని, అయితే అంతమాత్రాన ప్రతి ఆర్టికల్ 32 పిటిషన్‌ను ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనానికి నివేదించాలని అర్థం కాదని ధర్మాసనం పేర్కొంది. ప్రతివాదులలో ఒకరి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, మమతా బెనర్జీ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించగా, తదుపరి విచారణ గురువారానికి ధర్మాసనం వాయిదా వేసింది.

## రూ.3వేలు తీసుకుని ఉగ్రవాదులకు ఆశ్రయం ఇచ్చిన స్థానికులు

**కాల్పులు జరుపుతున్న సమాచారం తెలిసినా పోలీసులకు చేరవేయని వైనం**

**చివరకు ఎన్ఐఎ దర్యాప్తులో వెల్లడి... ఆపై అరెస్టు**



**శ్రీనగర్; ఏప్రిల్ 22:** పహల్గాంలో ఉగ్ర దాడి ఘటనలో ఎన్ఐఎ దర్యాప్తుకు సంబంధించి కొత్తకోణం వెలుగులోకి వచ్చింది. ఆనాడు దాడికి పాల్పడిన ముగ్గురు పాకిస్థానీ ఉగ్రవాదులకు స్థానికులు ఇద్దరు ఆశ్రయం కల్పించారు. ఉగ్రవాదుల గురించి వారు పోలీసులకు చెప్పే అవకాశం ఉన్నా చెప్పకుండా రహస్యంగా ఉంచారని వెల్లడైంది. చెప్పకుండా ఉండటం కోసం వారు ఉగ్రవాదుల నుంచి రూ.3 వేల లంచం తీసుకున్నట్లు ఎన్ఐఎ విచారణలో తేలింది. గత ఏడాది ఏప్రిల్ 22న ఉగ్రవాదుల దాడి జరిగింది. అంతకుముందు రోజు అంటే ఏప్రిల్ 21న రాత్రి 10.30 గంటల సమయంలో స్థానికులు పర్వేజ్ అహ్మద్, బషీర్ అహ్మద్ వద్ద ముగ్గురు ఉగ్రవాదులు ఆశ్రయం పొందారు. ఆ సమయంలో వారి వద్ద ఆయుధాలు కనిపించాయి. ఉర్దూ, పంజాబీ కలగలిసిన భాష మాట్లాడారు. లష్కరే తయిబా అగ్ర కమాండర్, ప్రధాన నిందితుడు సాజిత్ జాట్ అలియాస్ అలీభాయ్ గురించి వారు మాట్లాడుకున్నారు. తమ ప్రాంతంలో దాడి జరగడం ఖాయమని వారి మాటల్ని బట్టి అర్థమైనా పోలీసులను అప్రమత్తం చేయకుండా మౌనంగా ఉండిపోయారని దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ఐదు గంటలపాటు వారి వద్ద ఆశ్రయం పొందిన ఆ ముగ్గురు ఉగ్రవాదులు అక్కడే తినేసి వెళ్లిపోయారు. అందుకోసం రూ.3 వేలు ఇచ్చారు. తర్వాత ఏప్రిల్ 22న దాడి జరగడానికి కొన్ని గంటల ముందు మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఆ ఉగ్రవాదులు బైసరన్ లోయలోని ఒక కంచె వెనకాల దాక్కొన్నారు. ఆ విషయాన్ని పర్వేజ్ అహ్మద్, బషీర్ అహ్మద్‌లు గుర్తించారు. అప్పుడు కూడా పోలీసులకుగానీ, స్థానిక టూరిస్ట్ ఆపరేటర్లకుగానీ వారు సమా చారం ఇవ్వలేదని వెల్లడైంది. ఆ ఇద్దరూ తమ గుర్రాలు ఎక్కడానికి పర్యాటకులు ఎవరైనా వస్తారా అని మాత్రమే చూసుకున్నారు. మధ్యా హ్నం ఒంటిగంటన్నర సమయంలో కొందరు రాగానే వారిని పహల్గాంలోని బైసరన్‌లోయకు తీసుకెళ్లారు. ఆ తర్వాత కొన్ని గంటలకు అక్కడ కాల్పుల మోత వినిపించడం, ఆవాతావరణ మంతా రక్తసిక్తమవడాన్ని చూశారు. ఆ తర్వాత తమకేం సంబంధం లేదన్నట్టుగా నిశ్శబ్దంగా అక్క డినుంచి జారుకున్నారని తెలిసింది. దర్యాప్తులో భాగంగా ఎన్ఐఎ ఆ ఇద్దరినీ గత ఏడాది జూన్ 22న అరెస్టు చేసింది. డిసెంబర్‌లో ఫైల్ చేసిన ఛార్జ్‌షీట్‌లో సాజిత్ జాట్ పేరుతోపాటు ఆ స్థానికుల పేర్లను చేర్చింది.

## తెరచుకున్న కేదార్‌నాథ్ ఆలయం



**డెహ్రాడూన్; ఏప్రిల్ 22:** ఆధ్యాత్మిక లోకానికి ప్రస్తుతం ఒక పవిత్ర ఘట్టం ఆవిష్కృతమైంది. ఉత్తరాఖండ్‌లోని అత్యంత పవిత్రమైన కేదార్‌నాథ్ ధామం తలుపులు బుధవారం భక్తుల దర్శనార్థం తెరుచుకున్నాయి. మంచు కొండల నడుమ కొలువైన కేదార్‌నాథ్ ఆలయం ఉదయం 8 గంటలకు వైభవంగా తెరుచుకుంది. వేదమంత్రోచ్ఛారణలు, మేళతాళాల మధ్య సుమారు 51క్వింటాళ్ల పూలతో అందంగా అలంకరించిన ఈ పుణ్యక్షేత్రం భక్తులకు స్వాగతం పలికింది. స్వామి వారి సందర్శనార్థ ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. మరోవైపు, రేపు విష్ణుమూర్తి నివాసమైన బద్రీనాథ్ ఆలయ ద్వారాలు తెరుచుకోనున్నాయి. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీఎక్స్ వేదికగా భక్తులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఒక సందేశాన్ని ఇచ్చారు. చార్‌ధామ్ యాత్ర మన దేశ విశ్వాసానికి, ఐక్యతకు మరియు సుసంపన్నమైన సంప్రదాయాలకు దివ్య ఉత్సవం వంటిదని ఆయన పేర్కొన్నారు.ప్రతి ఒక్కరి యాత్ర సుఖమయంగా సాగాలని, బాబా కేదార్ ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

## ప్రియుడికోసం భర్తనే చంపే కుట్రచేసిన భార్య

**వదోదర, ఏప్రిల్ 22:** ప్రియుడితో కలిసి కట్టుకున్న భర్తనే కడతేర్చాలని ఓ భార్య పన్నిన పన్నాగం గుజరాత్‌లోని వడోదర పోలీసుల దర్యాప్తులో బట్టబయలైంది. వడోదరలోని ఛానీ ప్రాంతానికి చెందిన పాన్ పార్లర్ యజమాని గిరీశ్ పటేల్‌ను ఏప్రిల్ 15న కొందరు దుండగులు కిడ్నాప్ చేశారు. ఛానీసోఖ్డా రోడ్డుపై కారులో బలవంతంగా ఎక్కించుకుని, కత్తితో బెదిరించి, సోజిత్ర సమీపంలోని కాలువలో పడేశారు. గిరీశ్ చనిపోయాడని భావించిన నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. అయితే, కాలువలోని ఓ నిర్మాణాన్ని పట్టుకుని సుమారు మూడు గంటల పాటు గిరీశ్ ప్రాణాలతో పోరాడాడు. మరుసటి రోజు ఉదయం సురక్షితంగా బయటపడ్డాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, తొలుత ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో గిరీశ్ భార్య ఫాల్గుణి పటేల్ పాత్ర ఉన్నట్లు తేలింది. ఖేడా ప్రాంతానికి చెందిన సెలూన్ యజమాని కౌశిక్ శర్మతో ఫాల్గుణికి వివాహేతర సంబంధం ఉందని, తమ బంధానికి అడ్డుగా ఉన్న గిరీశ్‌ను చంపేందుకు ఇద్దరూ కలిసి కుట్ర పన్నారని పోలీసులు వెల్లడించారు. కౌశిక్ శర్మ ఈ హత్య కోసం నరేంద్ర అలియాస్ నికుల్ గోస్వామి అనే కిరాయి హంతకుడికి రూ.35వేల సుపారీ ఇచ్చాడు. ఘటనకు రెండు రోజుల ముందు ఫాల్గుణి, కౌశిక్ మధ్య 100కు పైగా ఫోన్ కాల్స్ జరిగినట్లు పోలీసులు గుర్తించారు.ప్రస్తుతం నిందితులందరినీ జ్యుడీషియల్ కస్టడీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## అమెరికా మహిళా టూరిస్టుపై హోంస్టేలో లైంగికదాడి

**కొడగు, ఏప్రిల్ 22:** కర్ణాటకలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కొడగు జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. అమెరికాలోని వాషింగ్టన్‌కు చెందిన ఓ మహిళా టూరిస్ట్‌పై హోంస్టేలో అత్యాచారం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి హోంస్టే యజమాని, అక్కడ పనిచేసే ఓ సిబ్బందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు ఝార్ఖండ్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ విషయం తెలుసుకున్న యజ మాని, ఆమెకు సహాయం చేయకపోగా నేరాన్ని దాచిపెట్టే ప్రయత్నం చేశాడు. మూడు రోజుల పాటు బాధితురాలిని నిర్బంధించి, ఆమె ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నాడు. ఎవరికీ ఫిర్యాదు చేయవద్దని బెదిరించాడు. అక్కడి నుంచి తప్పించుకున్న బాధితురాలు మైసూరు చేరుకుని, అమెరికా అధికారులను సంప్రదించింది. యూఎస్ ఎంబసీ ద్వారా విషయం తెలుసుకున్న కర్ణాటక పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. ఈ ఘటనను కొడగు జిల్లా ఎస్పీ ధ్రువీకరించారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచామని, వారికి మే 3 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించారని ఆయన తెలిపారు.

## మాలేగావ్ పేలుళ్లకేసులో నలుగురు నిందితులపై కేసు కొట్టివేత



**ముంబయి, ఏప్రిల్ 22:** మాలేగావ్‌లో జరిగిన పేలుళ్ల ఘటనతో లింకున్న కేసులో నలుగురు నిందితులపై నమోదయిన అభియోగాలను కొట్టివేసింది. బాంబే హైకోర్టు బుధవారం ఆ కేసు నుంచి డిశ్చార్జ్ చేసింది. ఆ నలుగురిపై స్పెషల్ కోర్టు నమోదు చేసిన అభియోగాలను హైకోర్టు కొట్టివేసింది. చీఫ్ జస్టిస్ శ్రీ చంద్రశేకర్, జస్టిస్ శ్యామ్ చందక్‌తో కూడిన ధర్మాసనం ఈ తీర్పును ఇచ్చింది. రాజేంద్ర చౌదరీ, ధాన్ సింగ్, మనోహర్ రామ్ సింగ్ నర్వారియా, లోకేశ్ శర్మలు దాఖలు చేసిన అప్పీళ్లను హైకోర్టు స్వీకరించింది. ఈ కేసులో కోర్టు ఆదేశాలకు చెందిన పూర్తి కాపీ ఇంకా అందాల్సి ఉన్నది. మాలేగావ్ పేలుళ్ల ఘటనలో నలుగురిపై ఐపీసీ, యూఏపీఏ సెక్షన్ల కింద కేసు బుక్ చేశారు. 2006 సెప్టెంబర్ 8వ తేదీన నాసిక్ జిల్లాలోని మాలేగావ్ పట్టణంలో నాలుగు చోట్ల బాంబు పేలుళ్ల చోటు చేసుకున్నాయి. శుక్రవారం ప్రార్థనలు ముగిసిన సమయంలో హామిదియా మజీద్, బడా ఖబరస్తాన్ ప్రాంతాల్లో పేలుళ్ల జరిగాయి. ముషావరత్ చౌక్ వద్ద కూడా పేలుడు జరిగింది. ఆ పేలుళ్లలో మొత్తం 31 మంది మృతిచెందగా, మరో 312 మంది గాయపడ్డారు. మహారాష్ట్ర ఏటీఎస్ పోలీసులు ఈ కేసును విచారించారు. ఈ కేసుతో లింకున్న 9 మంది ముస్లింలను అరెస్టు చేశారు. ఆ తర్వాత ఈ కేసును ఎన్ఐఏ తన ఆధీనంలోకి తీసుకున్నది. బ్లాస్ట్ వెనుక అతివాద తీవ్రవాదులు ఉన్నట్లు ఎన్ఐఏ ఆరోపించింది. దానిలో భాగంగా నలుగుర్ని అరెస్టు చేశారు.స్పెషల్ కోర్టు తన ఆదేశాల్లో 9 మంది ముస్లింలను కేసు నుంచి రిలీజ్ చేసింది. ఇక గత ఏడాది సెప్టెంబర్‌లో ఈ నలుగురిపై అభియోగాలు నమోదు చేసింది. ఆ ఆదేశాలను సవాల్ చేస్తూ వాళ్లు హైకోర్టును ఆశ్రయించారు. ఎన్ఐఏ తన దర్యాప్తులో తమపై ఎటువంటి ఆధారాలను చూపలేదని నిందితులు పేర్కొన్నారు.

## నేపాల్ హోంమంత్రి రాజీనామా



**ఖాట్మండు, ఏప్రిల్ 22:** నేపాల్ హోంమంత్రి సూడాన్ గురుంగ్ తన మంత్రిపదవికి రాజీనామా చేసారు. వ్యాపారవేత్త దీపక్‌భట్టాతో తనకు లింకులున్నాయని వచ్చిన ఆరోపణలపై జరుగుతున్న దర్యాప్తునకు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేసినట్లు వెల్లడించారు. దీపక్ భట్టా ప్రస్తుతం మనీలాండరింగ్ ఆరోపణలపై విచారణ ఎదుర్కొంటున్నారు. దీపక్‌భట్టాకు చెందిన కంపెనీల్లో హోంమంత్రికి షేర్లు ఉన్నాయని ప్రభుత్వ ఆస్తుల ప్రకటనపరంగా ఆర్థిక సమాచారం అందించారన్న ఆరోపణలున్నాయి. గురుంగ్ రాజీనామాపై నేపాలి కాంగ్రెస్ ప్రకటన జారీచేసింది. ప్రజాస్వామ్యానికి పారదర్శకత, అంకితభావం మూల స్తంభాలుగా ఉంటాయని గురుంగ్‌పై వచ్చిన ఆరోపణలపై వాస్తవిక అంశాల ఆధారంగా నిజనిర్ధారణతో నిష్పాక్షిక విచారణ జరిపించాల్సిన అవసరం ఎంతో ఉందని అన్నారు. ఆయన సొంతపార్టీ రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీనుంచి కూడా గురుంగ్ రాజీనామాచేయాలని ఒత్తిడి తెచ్చారు. రాజకీయ ఒత్తిళ్లతోపాటు నైతికంగా కూడా తనకు కొ న సా గ డ ం ఇష్టంలేదని అందుకే బుధవారం తన రాజీనామాను అందచేసినట్లు గురుంగ్ ప్రకటించారు. ఆయన షేర్లతోపాటు ఆయన ఇటీవల కొనసాగించిన పెట్టుబడులపైనా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. తనవరకూ తనకు నైతిక నియమావళి ముఖ్యమని అందుకే రాజీనామ చేసినట్లు తెలిపారు. ప్రజల్లో విశ్వాసం చూరగొనేందుకే తాను రాజీనామా చేసానన్నారు. సుపరిపాలన, పారదర్శకత, చిత్తశుద్ధితో కూడిన పాలన కావాలనే జెన్‌జడ్ ఆందోళన నడిచిందని ఇపుడు తన రాజీనామా కూడా అదే సందేశం ఇస్తుందని అన్నారు. కనీసం నెలరోజులు కూడా నిర్వహించలేకపోయిన హోంమంత్రి పదవినుంచి ఆయన దిగిపోయారు. అంతకుముందు ఇదేనెలలోనే ప్రధాని బాలేన్‌షా కార్మిక మంత్రి దీపక్ కుమార్‌షాను తొలగించారు.

## అంగారక గ్రహంపై జీవకారక సేంద్రియ అణువుల గుర్తింపు



**న్యూయార్కు, ఏప్రిల్ 22:** అంగారక గ్రహంపై జీవం ఉనికి గురించి దశాబ్దాలుగా సాగుతున్న అన్వేషణలో నాసాకు చెందిన క్యూరియాసిటీ రోవర్ మరో కీలక ముందడుగు వేసింది. అరుణ గ్రహం ఉపరితలంపై జరిపిన సరికొత్త రసాయన ప్రయోగంలో జీవానికి మూలమైన సేంద్రియ అణువులను గుర్తించింది. భూమి మీద జీవానికి ప్రాథమిక నిర్మాణ ఇటుకలుగా పరిగణించే ఈ రసాయనాల గుర్తింపు, మార్స్ అధ్యయనంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. క్యూరియాసిటీ రోవర్ అంగారకుడి భూమధ్యరేఖకు సమీపంలో ఒకప్పుడు సరస్సుగా ఉండి ఎండిపోయిన ప్రాంతంలో ఈ పరిశోధన జరిపింది. ఇక్కడ ఏడు వేర్వేరు సేంద్రియ సమ్మేళనాలను రోవర్ గుర్తించగా, వాటిలో ఐదింటిని మార్స్‌పై కనుగొనడం ఇదే తొలిసారి. ఈ సేంద్రియ పదార్థాలు పురాతన జీవుల నుంచి వచ్చాయా, ఉల్కల ద్వారా గ్రహానికి చేరాయా, లేక భౌగోళిక ప్రక్రియల వల్ల ఏర్పడ్డాయా అన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఒకవేళ అంగారకుడిపై జీవం ఉండి ఉంటే, దానికి సంబంధించిన రసాయన ఆనవాళ్లు ఇప్పటికీ భద్రంగా ఉండే అవకాశం ఉందని ఈ ఆవిష్కరణ సూచిస్తోంది. ఈ ప్రయోగానికి నేతృత్వం వహించిన ఫ్లోరిడా యూనివర్సిటీ ఆస్ట్రోజియాలజిస్ట్ ప్రొఫెసర్ అమీ విలియమ్స్ మాట్లాడుతూ.. మేము 350 కోట్ల సంవత్సరాల క్రితం అంగారకుడిపై భద్రపరచబడిన సేంద్రియ పదార్థాలను చూస్తున్నామని భావిస్తున్నాం. అయితే ఇది జీవానికి సంబంధించినదేనా అన్నది ప్రస్తుత సమాచారంతో చెప్పలేమనిఅన్నారు. కొన్ని వందల కోట్ల ఏళ్ల కిందట మార్స్‌పై జీవం వృద్ధి చెందడానికి అనువైన వాతావరణం ఉండేదని, కానీ నేడు తీవ్రమైన రేడియేషన్, అతి శీతల పరిస్థితులు ఉన్నాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. గుర్తించిన సమ్మేళనాల్లో డీఎన్ఏ నిర్మాణంలో పాలుపంచుకునే నైట్రోజన్ సమ్మేళనం వంటి నిర్మాణం ఒకటి ఉన్నప్పటికీ, అవి కేవలం ఇటుకలు మాత్రమే, ఇల్లు కాదని ఆమె స్పష్టం చేశారు. ఈ ఆవిష్కరణలతో 2028లో ప్రయోగించనున్న యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన రోసలిండ్ ఫ్రాంక్లిన్ రోవర్‌పై అంచనాలు పెరిగాయి. ఈ రోవర్ ఉపరితలం కింద రెండు మీటర్ల లోతు వరకు డ్రిల్ చేసి, రేడియేషన్ నుంచి మరింత సురక్షితంగా ఉన్న నమూనాలను అధ్యయనంచేసే సామర్థ్యం ఉంటుంది.

## భారత్‌నౌకతోపాటు మరో రెండు నౌకలు ఐఆర్‌జిసి స్వాధీనం

**మరికొన్నింటిపై గన్‌బోట్స్ కాల్పులు**

**టెహ్రాన్, ఏప్రిల్ 22:** భారత్‌కు వస్తున్న కార్గో షిప్‌తో పాటు మరో నౌకను ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నౌకాదళం స్వాధీనం చేసుకున్నది. హర్మూజ్ జలసంధి దాటేందుకు ప్రయత్నించిన ఆ రెండు వాణిజ్య నౌకలను ఇరాన్ తీరానికి తరలించింది బుధ వారం ఉదయం హర్మూజ్ జలసంధిలో నిబంధ నలను ఉల్లంఘించిన రెండు నౌకలను ఐఆర్‌జీసీ నౌకాదళం గుర్తించి నిలిపివేసింది. ఆ రెండు నౌకలను ఐఆర్‌జీసీ నౌకాదళం స్వాధీనం చేసుకుని ఇరాన్ తీరానికి మళ్లించిందని ఐఆర్‌జీసీ ప్రకటించింది. ఐఆర్‌జీసీ స్వాధీనం చేసుకున్న రెండు నౌకలను ఎంఎస్‌సి ఫ్రాన్సెస్కా, ఎపామి నోండాస్‌గా గుర్తించారు. మెరైన్ ట్రాఫిక్ వెబ్ సైట్ ప్రకారం ఎపామినోండాస్ నౌక దుబాయ్‌లోని జెబెల్ అలీ నుంచి గుజరాత్‌కు వెళ్తోంది. మరోవైపు బుధవారం ఉదయం హోర్మూజ్ జల సంధిలో మూడు కంటైనర్ నౌకలపై ఐఆర్‌జీసీ నౌకాదళం దాడి చేసింది. ఒమన్‌కు ఈశాన్యంగా సుమారు 15 నాటికల్ మైళ్ల దూరంలో ఒక కంటైనర్ నౌకపై ఐఆర్‌జీసీ గన్‌బోట్ కాల్పులు జరిపినట్లు యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సెంటర్ (యూకేఎమ్‌టీఓ) తెలిపింది.



గ్రీక్ కంపెనీకి చెందిన ఎపామినోండాస్ నౌకలోని బ్రిడ్జికి నష్టం వాటిల్లినట్లు పేర్కొంది. ఇరాన్‌కు పశ్చిమాన సుమారు ఎనిమిది నాటికల్ మైళ్ల దూరంలో యూఏఈకి చెందిన సంస్థ యాజ మాన్యంలోని పనామా జెండా కలిగిన యూఫోరియా నౌకపై కూడా ఐఆర్‌జీసీ నౌకా దళం దాడి చేసింది. నౌక సిబ్బంది సురక్షితంగా ఉన్నారని, నౌకకు ఎలాంటి నష్టం జరగలేదని యూకేఎమ్‌టీఓ తెలిపింది. ఇరాన్ తీరానికి సుమారు ఆరు నాటికల్ మైళ్ల దూరంలో ఉన్న పనామా జెండా కలిగిన ఎంఎస్‌సి ఫ్రాన్సెస్కా నౌకను కూడా ఐఆర్‌జీసీ నౌకాదళం లక్ష్యంగా చేసుకున్నది. హర్మూజ్ జలసంధి నుంచి దక్షిణంగా ఒమన్ గల్ఫ్‌లోకి ప్రయాణిస్తుండగా దాడి చేసింది. ఆ నౌక బాడీ, వసతి సౌకర్యాలకు నష్టం వాటిల్లినట్లు సముద్ర నిఘా సంస్థ వాన్‌గార్డ్ వెల్లడించింది.

## నడిరోడ్డుపై బిజెపి ఆందోళనపట్ల ముంబయి మహిళ ఫైర్

**ముంబయి, ఏప్రిల్ 22:** ముంబైలో ఓ రాజకీయ ర్యాలీ కారణంగా తీవ్రమైన ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్న ఓ మహిళ, ఏకంగా మంత్రిని, పోలీసులనుకూడా నడిరోడ్డుపై నిలదీశారు. మహారాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి గిరీశ్ మహాజన్ కాన్వాయ్‌ను అడ్డుకుని ఆమె చేసిన వాగ్వివాదం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ముంబైలోని వర్లీ ప్రాంతంలో బీజేపీ ఆధ్వర్యంలోని మహాయుతి కూటమి ఓ నిరసన ప్రదర్శన చేపట్టింది. మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించిన కాంగ్రెస్, ఇతర విపక్షాలపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఈ ర్యాలీ నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు జంబోరీ మైదాన్ నుంచి ప్రారంభం కావాల్సిన ఈ ర్యాలీ ఆలస్యం కావడంతో ఆ ప్రాంతమంతా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. అదే సమయంలో స్కూల్ నుంచి తన బిడ్డను తీసుకొచ్చేందుకు వెళ్తున్న ఓ మహిళ, గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. దీంతో సహనం కోల్పోయిన ఆమె కారు దిగి నేరుగా ర్యాలీ మధ్యలోకి వెళ్లి మంత్రి గిరీశ్ మహాజన్‌తో వాగ్వివాదానికి దిగారు. వందలాది మంది ఇక్కడ ఇబ్బంది పడుతున్నారు. అక్కడ ఖాళీ గ్రౌండ్ ఉందిగా అక్కడికి వెళ్లి చేసుకోండి. ఇక్కడి నుంచి వెళ్లిపోండి అంటూ నిరసనకారులపై గట్టిగా అరిచారు. పోలీసులు జోక్యం చేసుకోబోగా, వారిపైనా ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియర్ అధికారులతో మాట్లాడాలని పట్టుబట్టారు. చివరికి పోలీసులు ఆమెను పక్కకు తీసుకెళ్లి సమస్యను తెలుసుకునే ప్రయత్నం చేశారు.



# మంటల్లో పశ్చిమాసియా

## కంటైనర్ నౌకపై ఐఆర్‌జిసి కాల్పులు



**లండన్, ఏప్రిల్ 22:** పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్ వేదికగా జరగాల్సిన కాల్పుల విరమణ చర్చలు వాయిదాపడిన క్రమంలో ఇరాన్ హర్మూజ్ జలసంధిలో ఒక కంటైనర్ నౌకపై కాల్పులు జరిపి పరిస్థితిని మరింత తీవ్రం చేసింది. టెహ్రాన్ నుండి ఏకీకృత ప్రతిపాదన కోసం ఎదురు చూస్తూ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాల్పుల విరమణను పొడిగించారు. ట్రంప్ ప్రకటన వెలువడిన కొన్ని గంటల తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) హర్మూజ్ జలసంధిలో ఒక కంటైనర్ నౌకపై కాల్పులకు పాల్పడిందని యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సెంటర్ తెలిపింది. కాల్పులకు ముందు గన్‌బోట్ నౌకకు ఎలాంటి హెచ్చరికలు చేయలేదని తెలిపింది. కాల్పుల్లో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని స్పష్టం చేసింది. ఇరాన్ మీడియా కూడా ఈ దాడిని ధ్రువీకరించింది. కాల్పులకు గల కారణాలు వెల్లడించలేదు. ఇరాన్‌కు చెందిన వాణిజ్య నౌకను అమెరికా దళాలు ఇటీవల స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో దాడి జరగడం ఉద్రిక్తతలను మరోసారి పెంచింది. అమెరికాతో చర్చలపై ఇరాన్ స్పందించింది. ఐక్యరాజ్య సమితిలో ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరావానీ మాట్లాడుతూ, అమెరికాతో రెండో విడత చర్చలకు తాము సిద్ధమని ప్రకటించారు. అదే సమయంలో హర్మూజ్ జలసంధిలో తమ నౌకలపై కొనసాగుతోన్న దిగ్బంధాన్ని ఎత్తివేయాలని షరతు విధించారు. తమ నౌకలను దిగ్బంధించడంతో పాటు, అమెరికా కాల్పుల విరమణ ఉల్లంఘనకు పాల్పడిందని ఆరోపించారు.

## కాల్పుల విరమణ పొడిగింపు ఓటమి అంగీకరించడమే

**ఇరాన్ స్పీకర్ సలహాదారు మహదీ మహ్మదీ**



**టెహ్రాన్; ఏప్రిల్ 22:** అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. శాంతి చర్చల కోసం ఇరాన్‌తో కాల్పుల విరమణను నిరవధికంగా పొడిగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించగా, ఈ ప్రతిపాదనను ఇరాన్ తీవ్రంగా తిరస్కరించింది. ట్రంప్ నిర్ణయం అర్థరహితమని, ఓడిపోయిన పక్షం షరతులు విధించలేదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బఘేర్ ఘలీబాఫ్ సీనియర్ సలహాదారు మహదీ మొహమ్మదీ ఎద్దేవా చేశారు. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో శాంతి చర్చలకు మరింత సమయం ఇచ్చేందుకే కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ట్రంప్ తనట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో పేర్కొన్నారు. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇరాన్ నాయకత్వంలో తీవ్రమైన భేదాభిప్రాయాలు ఉన్నాయని, ఒక ఏకీకృత ప్రతిపాదనతో ముందుకు వచ్చేందుకు వారికి సమయం ఇస్తున్నామని అన్నారు. హర్మూజ్ జలసంధిలోని ఇరాన్ ఓడరేవులపై అమెరికా దిగ్బంధనం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ట్రంప్ ప్రకటనపై మహదీ మొహ మ్మదీ తీవ్రంగా స్పందించారు. ట్రంప్ కాల్పుల విరమణ పొడిగింపునకు అర్థం లేదు. ఓడిపోయిన పక్షం షరతులు పెట్టలేదు. దిగ్బంధనాన్ని కొనసాగించడం కూడా బాంబు దాడులతో సమానం. దీనికి సైనిక చర్యతోనే బదులివ్వాలి. ఆకస్మిక దాడికి పాల్పడేందుకు సమయం సంపాదించే కుట్రలో భాగమే ఈ కాల్పుల విరమణ. ఇక ఇరాన్ చొరవ తీసుకునే సమయం ఆసన్నమైందని ఆయన ఎక్స్ వేదికగా హెచ్చరించారు. మరోవైపు ఇరాన్ ఆర్థికంగా కుప్పకూలుతోందని ట్రంప్ వ్యాఖ్యానించారు. వారు వెంటనే హర్మూజ్ జలసంధిని తెరవాలని కోరుకుంటున్నారు. నగదు కోసం ఆకలితో ఉన్నారు. రోజుకు 500 మిలియన్ డాలర్లు నష్టపోతున్నారు. సైన్యం, పోలీసులకు జీతాలు అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని ట్రంప్ పేర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో జరగాల్సిన రెండో విడత శాంతి చర్చల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. ఇరాన్ నుంచి ప్రతిపాదన వచ్చే వరకు, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పాకిస్థాన్‌కు వెళ్లరని వైట్‌హౌస్ అధికారి ఒకరు వెల్లడించారు. దీంతో ఇరు దేశాల మధ్య శాంతి ప్రయత్నాలకు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లయింది.

# రూ.148 కోట్లతో అప్రోచ్ రోడ్ల నిర్మాణం

## 1:4 నిష్పత్తిలో ప్రతిపాదనలు పంపండి - ఇన్ఫ్రాస్ట్రక్చర్, క్యాపిటల్ వర్క్స్ కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్22:** రాష్ట్రంలో మూడు సంవత్సరాల క్రితం బ్రిడ్జిలు నిర్మించినప్పటికీ వాటికి అప్రోచ్ రోడ్లు నిర్మించకపోవడం మూలంగా అవి నిరుపయోగంగా ఉన్నాయి, సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న అప్రోచ్ రోడ్ల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన ఇన్ఫ్రాస్ట్రక్చర్, క్యాపిటల్ వర్క్స్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో మంత్రులు, క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులైన కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి అవసరమైన రూ.148 కోట్ల నిధుల విడుదలకు క్యాబినెట్ సబ్ కమిటీ ఆమోదం తెలిపిందని డిప్యూటీ సీఎం ప్రకటించారు. సరైన పద్ధతిలో ప్రతిపాదనలు పంపితే ఆమోదం తెలపడం, అమలు చేయడం సులభం అవుతుందని పనులు వేగవంతం అవుతాయని డిప్యూటీ సీఎం తెలిపారు. 1:4 నిష్పత్తిలో వివిధ శాఖల నుంచి ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపితే సబ్ కమిటీలు చర్చించి ఆమోదం తెలుపుతామని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని జూన్ 8 లోపల అప్రోచ్ రోడ్ల నిర్మాణం పూర్తి కావాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రగతిని తాను ప్రత్యేకంగా ప్రతి వారం సమీక్షిస్తానని మంత్రి కోమటిరెడ్డి స్పష్టం చేశారు. టెండర్లు పిలవడం, పనులు చేపట్టడం, నాణ్యతతో పనులు పూర్తి చేయడం వంటి అన్ని అంశాలను తాను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రెటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసి కార్మికుల సమ్మెకు సంఘీభావం ప్రకటించి మాట్లాడుతున్న హరీష్‌రావు

# ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

## పెండింగ్‌లో ఉన్న రెండు పిఆర్‌సిలను అమలు చేసి యూనియన్లను పునరుద్ధరించాలి: హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** కాంగ్రెస్ సర్కార్ ఎన్నిక సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని..గెలిచి గద్దెనెక్కి రెండున్నర యేండ్లు గడిచిన సమస్యలు పరిష్కరించకుండా బెదిరింపులకు గురి చేయడం సరి కాదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసి బస్సు డిపో ఆవరణలో కార్మికులు చేపట్టిన సమ్మెకు ఆయన బుధవారం సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న రెండు పిఆర్‌సిలను అమలు చేసి యూనియన్లను పునరుద్ధరించాలని వారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్ వరంగల్ డిపోలను ప్రైవేటు సంస్థలకు అప్పగించారని త్వరలోనే ఆర్టీసీని మొత్తం ప్రైవేటు పరం చేయడానికి ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ బకాయిలు సైతం కట్టడం లేదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి కార్మికులను చర్చలకు పిలిచి సమస్యలపై స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. పక్క రాష్ట్రంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారని తెలంగాణలో ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేయడం లేదని ప్రశ్నించారు. ఆర్టీసి కార్మికులను వెంటనే చర్చలకు పిలిచి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే బిఆర్ఎస్ అండగా నిలిచి ఆందోళనలు ఉధృతం చేస్తున్నామన్నారు. ప్రభుత్వం కార్మికుల సమ్మెను దెబ్బతీయడానికి కుట్రలు చేస్తున్నారు. మహాలక్ష్మీ పథకం ద్వారా కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మహాలక్ష్మీ పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ప్రభుత్వంలో రవాణా శాఖ మంత్రిగా ఉన్న పొన్నం ప్రభాకర్‌గౌడ్ అధికార దాహంతో కార్మికుల సమస్యలను పక్కన పెట్టి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని తప్పు బట్టారు. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మారెడ్డి రవీందర్‌రెడ్డి, కొండం సంపత్‌రెడ్డి, రాజనర్సు, గుడాల శ్రీకాంత్‌గౌడ్, ఆర్టీసి కార్మిక నాయకులు నక్క మల్లేశం, బి.ఎస్.గౌడ్, రవీందర్‌గౌడ్, హేమలత, కళావతి, కె.ఎస్. నారాయణ, పర్వరాములు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాల అనాలోచిత నిర్ణయంతోనే దక్షిణాది రాష్ట్రాలకు తీరని నష్టం

## బిజెపి సీనియర్ నాయకురాలు కరుణ గోపాల్



**హైదరాబాద్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:**దేశంలో ప్రతిపక్ష పార్టీల అనాలోచిత నిర్ణయంతోనే దక్షిణ రాష్ట్రాలకు తీరని నష్టం జరుగుతుందని బిజెపి సీనియర్ నాయకురాలు కరుణ గోపాల్ అన్నారు. బుధవారం బిజెపి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లును విపక్షాలు అడ్డుకోవడం ద్వారా దక్షిణ భారతదేశంలోని లోక్‌సభ సీట్లు తగ్గే ప్రమాదాన్ని వారే స్వయంగా కొనితెచ్చుకున్నారని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ లోక్‌సభ సీట్లను ప్రోరేటా పద్ధతిలో పెంచాలని ఆలోచించారు. దీనివల్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళం వంటి రాష్ట్రాలకు సీట్లు పెరిగే అవకాశం ఉండేది. కానీ విపక్షాలు దీనిని అడ్డుకోవడంతో ఇప్పుడు మళ్లీ పాత పద్ధతిలోనే సెన్సస్, డిలిమిటేషన్ ప్రక్రియలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. ఇది పూర్తవడానికి కనీసం 56 ఏళ్లు పడుతుంది. ఫలితంగా జనాభా నియంత్రణ పాటించిన దక్షిణ రాష్ట్రాలు సీట్లు కోల్పోయే ప్రమాదం ఉందని, ఆర్టికల్ 334డి ప్రకారం డిలిమిటేషన్ లేకుండా మహిళా రిజర్వేషన్ అమలు అసాధ్యం. కోవిడ్ కారణంగా సెన్సస్ ఆలస్యమైందనేది వాస్తవం అన్నారు. గతంలో (2004-2014) అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఈ బిల్లును లోక్‌సభలో పట్టించుకోలేదు. గతంలో పార్లమెంట్‌లో బిల్లును చింపివేసినా, మహిళా నాయకులను అవమానించినా విపక్ష మహిళా నేతలు నోరు మెదపలేదని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ మహిళల కోసం "వూమ్ టు టూమ్" (పుట్టుక నుండి మరణం వరకు) అన్నట్లుగా అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ముద్రా లోన్లు, స్టార్టప్‌లు, ఆయుష్మాన్ భారత్ మరియు డ్రోన్ దీదీ వంటి పథకాల ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో మహిళలు సమానంగా భాగస్వాములయితే దేశ జిడిపి 30శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. అందుకే మహిళలు కేవలం ఓటర్లుగానే కాకుండా పాలసీ మేకర్స్‌గా ఎదగాలనేది ప్రధాని నరేంద్ర మోడీ ఆకాంక్ష అన్నారు. మహిళలకు అధికారం కట్టబెట్టాలనే మోడీ సంకల్పానికి అడ్డుతగులుతూ, విపక్షాలు ముఖ్యంగా దక్షిణ భారతదేశ రాజకీయ భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయి. మహిళలు ఈ మోసాన్ని గమనిస్తున్నారు, రాబోయే రోజుల్లో విపక్షాలకు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

# గిరిజన వర్సిటీలో కొత్త కోర్సులకు అనుమతి

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త** రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన ములుగులోని సమ్మక్క సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో కొత్త కోర్సులు ప్రారంభం కానున్నాయి. ఈ యూనివర్సిటీలో ప్రస్తుతం ఉన్న వాటితో పాటు, మరో మూడు కొత్త కోర్సులకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ అనుమతులు జారీచేసింది. ఈ విషయాన్ని గిరిజన యూనివర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గిరిజన విశ్వవిద్యాలయంలో 2024 విద్యా సంవత్సరం లో ప్రారంభమైంది. ప్రస్తుతం ఇందులో నాలుగేండ్లపాటు కొనసాగే బీఏ ఇంగ్లిష్, బీఏ ఎకనామిక్స్ కోర్సులు రెండేండ్లనుంచి కొనసాగుతున్నాయి. వచ్చే ఏడాది నుంచి నాలుగేండ్ల బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బీఎస్సీ కంప్యూటర్స్ సైన్స్ అండ్ డాటా అనలిస్ట్ కోర్సులతో పాటు, బీఎస్సీ మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటర్ కోర్సులను అందించనున్నారు.

# కాళేశ్వరం కేసులో క్లీన్‌చిట్ కోసం బిజెపితో హారీష్‌రావు మంతనాలు

## భువనగరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్22,ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్టులో కేసులో క్లిన్ చిట్ ఇవ్వాలని హరీష్ రావు ఢిల్లీలో బిజెపి నాయకులతో మంతనాలు చేస్తున్నారని భువనగిరి ఎంపి చామకిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. గాంధీభవన్‌లో భువనగిరి లోక్ సభ సభ్యులుచామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం కమీషన్ రిపోర్టును హై కోర్టు తప్పుపట్టలేదనీ తెలిపారు. బిఆర్ఎస్ నేతలు ఎందుకు సంబురాలు చేసుకుంటున్నారనీ ప్రశ్నించారు. బిఆర్ఎస్ సంబురాలు చేసుకునే విధంగా కోర్టు తీర్పులో ఏముందనీ అడిగారు. హైకోర్టు తీర్పు కాపీలు వచ్చిన తర్వాత ప్రభుత్వం ఏ విధంగా ముందుకు వెళ్ళాలనే దానిపై నిర్ణయం తీసుకుంటుందనీ తెలిపారు. మేడిగడ్డ పిల్లర్లు కుంగిన తర్వాత అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం నిరక్ష్యంల్ల ఉందని కమీషన్ రిపోర్టులో ఉందనీ చెప్పారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సైతం ఇదే అంశాన్ని చెప్పిందన్నారు. పిసిఘోష్ కమీషన్ రిపోర్ట్ ఆధారంగా సిబిఐ విచారణ చేయాలని ప్రభుత్వం అడగలేదనీ అన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చెప్పింది తప్పా, కరెక్టా బిజెపి చెప్పాలనీ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో బిజెపికి బాధ్యత పెరిగిందనీ, కిషన్ రెడ్డి, బండి సంజయ్ కాళేశ్వరం విషయంలో బిఆర్ఎస్ పార్టీకి క్లిన్ చిట్ వచ్చిందా లేదా అనేది చెప్పాలనీ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే సిబిఐ విచారణ జరిపించాలని కోరారు. జస్టిస్ పిసి ఘోష్ కమీషన్ రిపోర్టుపై రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తుందో సాయంత్రం కల్లా నిర్ణయం తీసుకుంటామనీ తెలిపారు.

కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారిందనీ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయని పలు సంస్థలు చెప్పాయి. ఇప్పుడు సిబిఐ కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఏం జరిగిందో నిజాలు నిగ్గు తేల్చాలనీ అన్నారు.

# హైదరాబాద్‌కు 650 మంది ఆదివాసీలు

## సాంస్కృతిక, విద్యా విషయాలపై అవగాహనే లక్ష్యం

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు చెందిన సుమారు 650 మంది ఆదివాసీల కోసం మహానగరమైన హైదరాబాద్‌కు మొట్టమొదటిసారిగా అవగాహనా యాత్రను నిర్వహిస్తోంది. నగర జీవితంపై వారికి సాంస్కృతిక, విద్యాపరమైన అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాలను ఈ ఆదివాసీ బృందాలు పరిశీలించాయి. రాష్ట్రంలోని ఉట్నూర్ ప్రాంతం నుండి ఎంపిక చేసిన ఆదివాసులను ఈ నెల 22 నుండి 26 వరకు జరిగే ఈ పర్యటన కోసం అధికారులు ఈ 650 మందిని మూడు బృందాలుగా విభజించారు. ప్రతి బృందంలో 200 నుండి 250 మంది ఆదివాసులు ఉన్నారు. వీరు రెండు రోజుల పాటు హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో బస చేస్తారు. అడవులలోని జీవితానికి, నగర జీవితానికి మధ్య వారధిని నిర్మించడం, తద్వారా సంస్కృతుల సమ్మేళనాన్ని అందించడం ఈ పర్యటన ఉద్దేశ్యమని గిరిజన సంక్షేమ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రత్యేకమైన ఆదివాసీ సంప్రదాయాలను, ఆధునికతను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.

# పాఠశాలల్లో సామాన్యశాస్త్ర ప్రయోగశాలలు ఏర్పాటు చేయండి

## - ప్రభుత్వ విద్యాసలహాదారు కెకెను కోరిన మాజీ ఎమ్మెల్సీ బి.మోహన్‌రెడ్డి

**హైదరాబాద్,ఏప్రిల్ 22,ప్రభాతవార్త :** పాఠశాల విద్యలో నాణ్యతా ప్రమాణాలు పెంచడానికి ప్రతిపాఠశాలలో సామాన్యశాస్త్రంకు చెందిన ప్రయోగశాలను ఏర్పాటు చేసి భౌతిక, రసాయన, జీవ, వృక్షశాస్త్రాలకు చెందిన పరికరాలు, ప్రయోగదీపికల నమోనాలను అందుబాటులో ఉంచాలని మాజీ ఎమ్మెల్సీ బి. మోహన్‌రెడ్డి కోరారు. బుధవారం తెలంగాణ ప్రభుత్వ విద్యా సలహాదారు కె. కేశవరావును కలిసి సాంఘిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయుడికి అందుబాటులో మ్యాప్‌లు అందుబాటులో ఉండాలని భూగోళం చరిత్ర పౌరశాస్త్రం ఆర్థికశాస్త్రం అభ్యసనను సరళీకృతం చేయడానికి ఇది ఎంతగానో ఉపయోగపడటమే కాకుండా విద్యార్థికి ప్రపంచీకరణ అనుభూతి చెందడానికి వీలవుతోందని వివరించారు. విద్యాకమిషన్ లో ఉపాధ్యాయుల వేతనాల అంశాలను తొలగించాలని, వెంటనే పిఆర్‌సి ప్రకటించాలని, హెల్త్‌కార్డులు పెండింగ్ బిల్లులు, డిఎలు చెల్లించాలని కోరారు.

ఓల్డ్‌పెన్షన్ కు సిపిఎస్ ఉద్యోగులను మార్చే ప్రక్రియ వేగవంతం చేయాలనికోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని ఆర్టీసి సమ్మెను నివారించడానికి ప్రయత్నాలు చేయాలనికోరారు.

# ఏరోస్పేస్ డైరెక్టర్ జనరల్ జోషి నియామకం రద్దుపై..

## జూన్ 15కు వాయిదావేసిన హైకోర్టు

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త** బ్రహ్మోస్ ఏరోస్పేస్ డైరెక్టర్ జనరల్ పదవికి తన నియామకాన్ని రద్దు చేసిన క్యాట్ ఉత్తర్వును సవాలు చేస్తూ డాక్టర్ జయతీర్థ జోషి దాఖలు చేసిన రిట్ పిటిషన్లను తెలంగాణ హైకోర్టు జూన్ 15కు వాయిదా వేసింది. ఈ పిటీషన్‌పై జస్టిస్ పి. సామ్ కోషి, నందికొండ నర్సింగ్‌రావుతో కూడిన ధర్మాసనం విచారించింది. ఆ విచారణ సందర్భంగా, ఇరుపక్షాల న్యాయవాదులు ప్రాథమిక వాదనలు వినిపించి, సవివరమైన వాదనలు వినిపించడానికి అదనపు సమయం కోరారు. ఆ అభ్యర్థనను గమనించిన ధర్మాసనం, తదుపరి విచారణ కోసం ఈ పిటీషన్‌పై విచారణను వాయిదా వేసింది. కాగా రక్షణ పరిశోధన, అభివృద్ధి ప్రయోగశాలలో శాస్త్రవేత్తగా జయతీర్థ జోషి చేసిన విశిష్ట సేవలను పరిగణనలోకి తీసుకుని ఆయనను 2024 నవంబర్ 25న బ్రహ్మోస్ ఏరోస్పేస్ డైరెక్టర్ జనరల్‌గా కేంద్ర ప్రభుత్వం నియమించింది. అయితే ఈ పదవికి షార్ట్‌లిస్ట్ చేయబడిన అభ్యర్థులలో ఒకరైన, రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థకు చెందిన సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శివసుబ్రమణియం నంబి నాయుడు జయతీర్థ జోషి నియామకాన్ని సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ హైదరాబాద్ బెంచ్‌లో సవాలు చేశారు. ఈ అభ్యర్థనను అనుమతిస్తూనే, ఎంపిక ప్రక్రియ ఏకపక్షంగా జరిగిందని పేర్కొంటూ ట్రిబ్యునల్ ఆ నియామకాన్ని రద్దు చేసింది. అంతేకాకుండా,

నిర్దిష్ట కాలపరిమితిలోగా డాక్టర్ నాయుడు అభ్యర్థిత్వాన్ని పునఃపరిశీలించాలని, ఈలోగా బ్రహ్మోస్‌కు నాయకత్వం వహించడానికి ప్రత్యామ్నాయ ఇన్‌చార్జ్ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. ఈ నిర్ణయం పట్ల అసంతృప్తి చెందిన డాక్టర్ జోషి హైకోర్టును ఆశ్రయించారు.

# వేగంగా మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ

## - ఇప్పటికే 86శాతం కోటా పంపిణీ పూర్తి

## - పౌరసరఫరాలశాఖ కమిషనర్ స్టిఫెన్ రవీంద్ర

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:**ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ రికార్డు వేగంతో కొనసాగుతోందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషన్ స్టిఫెన్ రవింద్ర ప్రకటించారు. గడువు తేది కంటే వారం రోజుల ముందే 86శాతం పైగా బియ్యం కోటాను లబ్దిదారులకు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 30వరకు రాష్ట్రంలోని రేషన్‌కార్డు లబ్దిదారులకు ఎప్రిల్, మె, జూన్‌నెలకు చెందిన 6, 43, 303 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ఎప్రిల్ 21 నాటికే రాష్ట్రవ్యాప్తంగా 5.48, 140 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేసినట్లు కమిషనర్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం మార్చి 2న ఇచ్చిన ఆదేశాల మేరకు వేగంగా మూడు నెలల రేషన్ పంపిణీ కొనసాగుతోందన్నారు. కొత్తగా యాసంగి సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే సమయంలో గోదాముల్లో స్థలం ఇబ్బందులు రాకుండా ఉండేందుకు కేంద్రం మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి ఇస్తోందన్నారు. రేషన్ బియ్యం పంపిణీ తాలుకు 2.62 కోట్ల లావాదేవీలు ఇప్పటి వరకు ఎలాంటి ఆటంకం లేకుండా జరిగాయన్నారు. వేగంగా రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నందున ఎలాంటి తప్పులు జరగకుండా ఉండేందుకు రేషన్ షాపుల వద్ద జరిగే ఆన్‌లైన్ వివరాలను, వేలిముద్రలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు జాగ్రత్తగా గమనిస్తున్నారు.

# కాళేశ్వరంపై సిబిఐ వెంటనే విచారణ చేపట్టాలి

## ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 22,ప్రభాతవార్త:** కాళేశ్వరం అక్రమాలను వెలుగులోకి తెచ్చి అక్రమార్కులను దోషులుగా నిలబెట్టేందుకు సిబిఐ వెంటనే విచారణచేపట్టాలని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సిఎల్‌పి కార్యాయలంలో విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం న్యాయపరమైన విచారణ కోసం జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేసి ఆనివేదిక తోపాటే ఎన్‌డీఎస్‌ఏ నివేదికను సిబిఐకిఅప్పగించారనీ ఆయన తెలిపారు. వివిధ దశల్లో మూడు రకాల నివేదికలు ఉన్నప్పటికి కాళేశ్వరం ప్రాజెక్టులో ఎలాంటి స్కామ్ లేదన్నట్టుగా బిఆర్ఎస్ వ్యవహరిస్తోందనీ ఆయన విమర్శించారు. మేడిగడ్డ, సుందిళ్ల నిర్మాణాల్లో లోపాలు ఉన్నాయని నివేదికలు సూచిస్తున్నారు. బాధ్యులు ఎవరు, దోషులు ఎవరు అనే విషయాన్ని ఘోష్ కమిషన్ స్పష్టం చేసిందనీ ఆయన తెలిపారు. సాంకేతిక అంశాలపై హైకోర్టు కూడా కీలక వ్యాఖ్యలు చేసిందనీ, భవిష్యత్తు రాజకీయ ప్రయోజనాల కోసం బిజెపి, బిఆర్ఎస్ కలిసి ఆట ఆడుతున్నాయనీ ఆరోపించారు. ఎన్నికల సమయంలో కాళేశ్వరం ఎటిఎంగా మారిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. రాజకీయ లాభాల కోసం బిజెపి, బిఆర్ఎస్ సమీకరణాలు చేసుకుంటున్నాయనీ అన్నారు. డిలిమిటేషన్ విషయంలో పార్లమెంట్‌లో ప్రతిపక్షం మొత్తం ఏకతాటిపై ఉందనీ బిజెపిపై కెసిఆర్ ఒక్క మాట కూడా మాట్లాడటం లేదనీ అన్నారు. జగిత్యాల సభల్లో మహిళా బిల్లుపై ఆయన మాట్లాడలేదనీ ఆయన విమర్శించారు. కెసిఆర్ మౌనం బిజెపి బిఆర్ఎస్ మధ్య సంబంధాలను చూపుతోందనీ అన్నారు. కుటుంబ అవినీతి బయటపడకుండా బిజెపి రక్షణ కల్పిస్తోందనే అనుమానం ఉందనీ తెలిపారు. వెంటనే సిబిఐ దర్యాప్తు చేపట్టాలని కేంద్రాన్ని మేము కోరుతున్నామనీ తెలిపారు. బిజెపి పెద్దల వైఖరి నిరక్ష ్యంగా ఉందని స్పష్టమవుతోందనీ, కాళేశ్వరం వ్యవహారంలో కెసిఆర్‌కు సంబంధం లేదని ఎక్కడైనా తేల్చి చెప్పారా? సత్యమేవ జయతే సత్యామే గెలుస్తుందని అన్నారు.

# రైతు భరోసా కోసం తక్షణమే అధికారులను సంప్రదించండి

**హైదరాబాద్, ఎప్రిల్ 22, ప్రభాతవార్త:**రెండో విడతలో రైతు భరోసా నిధులు జమకాని రైతులు సంబంధిత వ్యవసాయశాఖ అధికారులను లేదంటే మండల రెవెన్యూ అధికారులను సంప్రదించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. అర్హత కలిగిన రైతులు తమ భూమి పాసు పుస్తకాలతోపాటు పూర్తి వివరాలను సమర్పించాలని పేర్కొంది. రైతులు సమర్పించిన భూమి యాజమాన్య ఆధారాలను పరిశీలించి అధికారులు రైతు భరోసా నిధులు జమ చేస్తారని తెలిపింది. మొదటి విడతలో ఒక ఎకరం వరకు రైతు భరోసా నిధులు జమ చేసిన ప్రభుత్వం, రెండో విడతలోనూ 45.12లక్షల మంది రైతులకు మరో ఎకరానికిగాను రూ.6వేలను జమ చేసింది. ఇప్పటి వరకు ప్రతి రైతుకు రెండెకరాల వరకు రైతు భరోసాను విడుదల చేసింది. పూర్తి స్థాయిలో రైతులందరికీ రైతు భరోసా నిధులు జమ కావాలంటే మరో రూ.3,400 కోట్లు వరకు వెచ్చించాల్సి ఉంది. మే నెల ప్రారంభంలో మూడో విడత రైతు భరోసా నిధులు విడదలవుతాయని అధికారులు చెబుతున్నారు. అయితే మూడో విడతలో అయిదు ఎకరాల వరకు భూమి కలిగిన రైతులకు నిధులు జమ చేస్తారా లేదా అన్నది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. అధికారులు చెబుతున్న వివరాల ప్రకారం మూడో విడతలో మరో రెండు ఎకరాలకు రైతు భరోసా నిధులు విడుదల చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా.. రైతు భరోసా కింద రెండు విడతల్లోనూ అత్యధికంగా నల్గొండ జిల్లాకు రూ.448.09కోట్లు విడుదల య్యాయి. 5,40,693 మంది రైతులకు లబ్ది చేకూరింది. నల్గొండ తరువాత ఖమ్మం జిల్లాలో 3,45,142 మంది రైతులకు రూ.271.52 కోట్లు, మూడో స్థానంలో సంగారెడ్డి జిల్లాకు చెందిన 3,66,343 మంది రైతుల ఖాతాల్లో రూ. 271.05 కోట్లు జమ అయ్యాయి. అత్యల్పంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన 35,530 మంది రైతులకు రూ.15.65 కోట్లు జమ అయ్యాయి.

# మేఘాలయ అంగన్‌వాడి విధానాలు తెలంగాణలో అమలు!

## - మంత్రి సీతక్క, సమ్మె విరమించాలని ఆర్టీసి కార్మికులకు విజ్ఞప్తి

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:**మేఘాలయ రాష్ట్రంలోని అంగన్వాడి కేంద్రాలు కేవలం పోషకాహారం అందించే కేంద్రాలుగా కాకుండా చిన్నారుల సమగ్ర అభివృద్ధికి కేంద్రాలుగా రూపుదిద్దుకున్నాయని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క అభిప్రాయపడ్డారు. చిన్నారులకు ఆటల ద్వారా విద్య నేర్పే విధానం, సృజనాత్మక వాతావరణం నేర్చుకునే ఆసక్తిని పెంచుతున్నాయని తెలిపారు. ప్రత్యేకంగా మేఘాలయ ఎర్లి చైల్డ్‌హుడ్ ప్రోగ్రామ్ ద్వారా 06 సంవత్సరాల చిన్నారులపై సమగ్ర దృష్టి సారిస్తూ ఆరోగ్యం, పోషణ, విద్య అంశాలను సమన్వయం చేస్తూ అందిస్తున్న సేవలను మంత్రి ప్రశంసించారు. ఇక 1000 డేస్ ప్రోగ్రామ్ అమలు విధానాన్ని అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గర్భధారణ నుంచి పాప జన్మించి రెండేళ్లు పూర్తయ్యే వరకు ఉండే తొలి 1000 రోజుల్లో తల్లి శిశువుకు సమగ్ర సేవలు అందించడం ద్వారా పోషకాహార లోపాన్ని తగ్గిస్తూ, ఆరోగ్యవంతమైన అభివృద్ధిని సాధిస్తున్నారని పేర్కొన్నారు. మేఘాలయలో ఆసక్తి ఉన్న యువతకు మినిస్ట్రీ ఆఫ్ స్కిలింగ్ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇచ్చి, వారిని కమ్యూనిటీ వలంటీర్లుగా తయారు చేస్తున్నారని చెప్పారు. అంగన్వాడి టీచర్లతో పాటు అదనంగా వలంటీర్లు వ్యవస్థీకృతంగా పనిచేయడం, సమాజం మొత్తాన్ని ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేయడం మేఘాలయ మోడల్‌కు ప్రత్యేకతను తీసుకువచ్చిందని తెలిపారు. మేఘాలయ విధానాలను ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో తెలంగాణలోనూ అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. సమ్మె విరమించాలని ఆర్టిసి కార్మికులకు మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై మేఘాలయ నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్టిసి కార్మికుల సమ్మె కారణంగా మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. కార్మికుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. చర్చల ద్వారా మాత్రమే కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని స్పష్టం చేశారు.

# కంటోన్మెంట్ మాజీ ఎమ్మెల్యే సాయన్న సతీమణి గీత కన్నుమూత

## తీవ్ర అనారోగ్యంతో కిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి

## ఆ కుటుంబంలో మూడేళ్లలో మూడు విషాదాలు



మాజీ ఎమ్మెల్యే, దివంగత జి. సాయన్న సతీమణి జి. గీత పార్థివదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

**చిక్కడపల్లి ఏప్రిల్ 22 ( ప్రభాతవార్త ) :** సికింద్రాబాద్ కంటోన్మెంట్ మాజీ ఎమ్మెల్యే, దివంగత జి. సాయన్న సతీమణి జి. గీత (70) బుధవారం మధ్యాహ్నం కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె, సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆమె మరణవార్త తెలియగానే నియోజకవర్గంలోనూ, అటు రాజకీయ వర్గాల్లోనూ విషాద ఛాయలు అలముకున్నాయి. గీత మరణవార్త విన్న వెంటనే బీఆర్ఎస్ ముఖ్య నేతలు, కార్యకర్తలు ఆసుపత్రికి చేరుకున్నారు. అనంతరం ఆమె పార్థివదేహాన్ని అశోక్ నగర్ స్వగృహానికి తరలించారు. ఆమె మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తూ, సాయన్న కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇప్పుడు గీత మరణంతో ఆ కుటుంబం మరింత విషాదంలో మునిగిపోయింది. సాయన్న కంటోన్మెంట్ ప్రాంతంలో ప్రజాదరణ పొందిన నాయకుడిగా పేరుపొందారు. ఆయన సేవలు, ప్రజలతో ఆయనకు ఉన్న అనుబంధం కారణంగా స్థానికంగా మంచి గుర్తింపు పొందారు. ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా సేవలందించిన ప్రజానేత జి. సాయన్న అనారోగ్యంతో 2023 ఫిబ్రవరి 19 న కన్నుమూశారు. తండ్రి మరణం తర్వాత ఉప ఎన్నికలో భారీ మెజారిటీతో గెలిచిన ఆయన కుమార్తె లాస్యనందిత, సరిగ్గా ఏడాది తిరగకముందే 2024 ఫిబ్రవరి 23 న ఓ రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందారు. కాగా బుధవారం నేడు సాయన్న సతీమణి, లాస్యనందిత తల్లి గీత మరణించడంతో ఆ కుటుంబంలో మరోసారి తీరని లోటు ఏర్పడింది. గీతకు మరో ఇద్దరు కుమార్తెలు నమ్రత, నివేదిత ఉన్నారు. ఒకే కుటుంబంలో కీలక వ్యక్తులు ముగ్గురు స్వల్ప వ్యవధిలోనే దూరమవ్వడం పట్ల స్థానిక ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# తెలంగాణ కెసిఆర్ వల్లకాదు అమరవీరుల త్యాగం వల్లే వచ్చింది: తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

**హైదరాబాద్,ఏప్రిల్22,ప్రభాతవార్త:** తెలంగాణ కెసిఆర్ వల్లకాదు అమరవీరుల త్యాగాల వల్లే వచ్చిందని ఖమ్మంలో కెసిఆర్ నిరాహారదీక్ష ఆపేస్తే గద్దర్ ప్రశ్నిస్తే మళ్లీ దీక్ష చేశారనీ తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ తెలిపారు. సిఎల్‌పి కార్యాలయంలో బుధవారం విలేఖరులతో మాట్లాడుతూ దొంగతనం చేసిన వాడే దొంగా దొంగా అని అరిచినట్లుగా హరీష్ రావు తీరు ఉందనీ విమర్శించారు. తెలంగాణ ఉద్యమం 2000 సంవత్సరం లో పుట్టలేదనీ,1952 లోనే తెలంగాణ ఉద్యమానికి బీజం పడిందనీ ఆయన తెలిపారు. 1956 లో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు సమయంలోనే తెలంగాణ వాదాన్ని వినిపించారనీ అన్నారు. నేనే తెలంగాణ తెచ్చానని, మా మమ తెలంగాణ తెచ్చారని ఇప్పుడు కొందరు పనికి మాలిన మాటలు మాట్లాడుతున్నారనీ విమర్శించారు.వేలాది మంది అమరువీరుల త్యాగం వల్లనే తెలంగాణ వచ్చిందనీ, తెలంగాణ అమరువీరుల త్యాగాన్ని చూసి సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిందనీ ఆయన వివరించారు. తెలంగాణ వచ్చాక కెసిఆర్ కుటుంబం సంచులు సర్దుకుందనీ ఆరోపించారు. అసెంబ్లీకే కెసిఆర్ రావడం లేదు.. ఇక తెలంగాణలో మీరు అధికారంలోకి వస్తారా..? అని ఎద్దేవా చేశారు.గతం ప్రభుత్వంలో ఆర్‌టిసి సమ్మె కారణంగా కార్మికులు చనిపోయారనీ ఇప్పుడు బిఆర్ఎస్ వెనుకవుండి సమ్మెను ప్రోత్సహిస్తున్నారనీ అన్నారు. స్మశాన వాటికలు, బొందలు గడ్డలు తప్ప బిఆర్ఎస్ హయాంలో చేసింది ఏమీ లేదనీ అన్నారు. దేశంలోనే నెంబర్ 1 ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా పాలన సాగుతోందనీ అన్నారు. రేవంత్ రెడ్డిని చూసి బిఆర్ఎస్ నాయకులకు కళ్ల మంటపుడుతోందని, గుంట నక్క ఢిల్లీకి పోయిందని కవితనే హారీష్ రావు గురించి చెపుతోందనీ అన్నారు. ముఖ్యమంత్రి పైన హారీష్ రావు చేసే విమర్శలను ప్రజలు నమ్మరనీ ధీమా వ్యక్తంచేశారు.మళ్లీ రాజ్యాధికారం కాంగ్రెస్ పార్టీదే అన్నారు. సమిష్టి నాయకత్వంలో మా ప్రభుత్వం నడుస్తోందనీ తెలిపారు. ఆర్టీసీ కార్మికులు మంది మాటలు నమ్మొద్దని హితవుచెప్పారు.అధికారం పోగానే బిఆర్ఎస్ పార్టీ ఆర్టీసీ కార్మికులు, ఆశా వర్కర్లు , నిరుద్యోగులు గుర్తుకు వచ్చారనీ అన్నారు.కెసిఆర్‌కు ఆరోగ్యం బాగాలేదు, కొడుకు, అల్లుడు , బిడ్డ ఇబ్బంది పెడుతున్నారనీ ఆయన తెలిపారు. అధికారంలోకి వస్తామని బిఆర్ఎస్ పగటి కలలు ఆపాలనీ అన్నారు.

కాంగ్రెస్ పార్టీ కష్ట జీవుల పార్టీ అనీ, భూములు, ఇళ్లు ఇచ్చిందనీ తెలిపారు. ప్రాజెక్టులు కట్టింది, పారిశ్రామిక వాడులు ఏర్పాటు చేసిందనీ తెలిపారు. బిఆర్ఎస్ హయాంలో ఒక్క పరిశ్రమ ఏర్పాటు కాలేదనీ తెలిపారు

తెలంగాణకు ముందు, తెలంగాణ వచ్చాక కల్వకుంట్ల ఆస్తులు ఎన్నో చెప్పాలనీ డిమాండ్ చేశారు.. తెలంగాణ ఉద్యమకారులకు మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాధాన్యత ఇచ్చారనీ తెలిపారు..

# వయోజనుల్లో అక్షరాస్యత పెంపుపై ప్రత్యేక శ్రద్ధ

## విద్యా రంగంలో వేగంగా సంస్కరణలు, పెద్దల చదువుకు పెద్ద పీట : ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్22:** సంపూర్ణ అక్షరాస్యత రాష్ట్రంగా తెలంగాణను మార్చాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతుంది. 45 ఏళ్ల పైబడిన వయసులో అక్షరాస్యత తక్కువగా ఉండటాన్ని ప్రభుత్వం గుర్తించింది. దీంతో చాలా కాలంగా నిర్లక్ష్యానికి గురైన వయోజనుల విద్యపై ప్రత్యేక దృష్టి సారించింది. ఎక్కడికక్కడ వయోజన విద్య తరగతులను నిర్వహించారు. దీంతో 2025-26 సంవత్సరంలో 6.31 లక్షల మంది పెద్దలు అక్షరాస్యత పరీక్షలకు హాజరయ్యారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కార్యాలయం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. గత ప్రభుత్వ హయాంలో, ముఖ్యంగా 2019 నుంచి 2024 వరకు వయోజన విద్య పెంపు అంశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. దీంతో ఆ సమయంలో వయోజన విద్య పూర్తిగా కుంటుపడింది. అందుకు విరుద్ధంగా ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వయోజన విద్యపై ప్రత్యేక దృష్టి సారించింది. దీనికి ఫలితంగానే వయోజన విద్యలో పెద్ద ఎత్తున పెరుగుదల నమోదైంది. .. తెలంగాణలోని పాఠశాలల్లో విద్యలో నాణ్యత పెంచేందుకు ప్రజా ప్రభుత్వం నూతన విధానాన్ని తీసుకొచ్చింది. అకడమిక్ ప్యానెల్ ఇన్స్పెక్షన్ టీమ్స్ ద్వారా పాఠశాలల్లో బోధన విధానాలను ఉన్నతీకరించింది. ఇది విద్యార్థులకు అత్యాధునిక పద్ధతులలో అభ్యసనలో మెలుకువలు నేర్పించేందుకు ఉపయోగపడింది. ముఖ్యంగా పెద్దపల్లి జిల్లాలో 61 పాఠశాలల్లో ఈ విధానం అమలు చేసి, బోధనలో ఉన్న ఇబ్బందులు, అనుకూలతలను గుర్తించారు. చాలామంది ఉపాధ్యాయులకు మంచి పరిజ్ఞానం ఉన్నప్పటికీ, తరగతుల్లో విద్యార్థుల భాగస్వామ్యం తక్కువగా ఉండడాన్ని ఈ టీమ్స్ గుర్తించాయి. దానిని సరిదిద్ది సమర్థంగా అమలు చేయడంతో మంచి ఫలితాలు తీసుకురావడం సాధ్యమైందని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. ప్రజా ప్రభుత్వ చర్యల ఫలితంగా తక్కువ సమయంలోనే పాఠశాల విద్యలో మంచి మార్పులు చోటు చేసుకున్నాయి. బోధన పద్ధతుల్లో వ్యూహాత్మకత 48శాతం నుంచి 68శాతంకు పెరిగింది. తరగతుల గదుల మెరుగైన నిర్వహణలో 42 నుంచి 65 కు, బోధనాభ్యసన సామగ్రి, వనరుల వినియోగం 35శాతం నుంచి 58శాతంకు పెరిగింది. ఇవన్నీ మంచి ఫలితాలు వచ్చేందుకు కారణమయ్యాయి. పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ప్రాథమిక దశలోనే అక్షరాలు రాయడం, అంకెలు నేర్చుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్)పై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. దీంతో విద్యార్థుల సంఖ్యా గణనీయంగా పెరిగింది. 2022-23 విద్యా సంవత్సరం నుంచి 2025-26 వరకు మంచి ఫలితాలు వచ్చాయి. తెలుగులో 9శాతం నుంచి 35శాతం వరకు,ఇంగ్లీష్‌లో 4శాతం, 29శాతం... ఉర్దూలో 19 శాతం నుంచి 40శాతం వరకు అభ్యసన సామర్థ్యాలు పెరిగాయి. భాషతో పాటు అంకెలు నేర్చుకోవడం.. కూడికలు, తీసివేతలు వంటి గణిత ప్రక్రియల్లోనూ 18 శాతం నుంచి 30 శాతం ఫలితాలు అధికంగా వచ్చాయి. సమగ్ర శిక్షా పథకం కింద వచ్చిన నిధులను వినియోగించడంలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. 2025-26లో 84శాతం నిధులు వినియోగించుకొని రాష్ట్రం దేశంలో మొదటి స్థానంలో ఉంది. ప్రతి రూపాయి విద్య కోసం, విద్యార్థుల కోసం వ్యయం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. విద్యా రంగంలో ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు తెలంగాణను దేశంలో ముందువరుసకి తీసుకెళుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణలు విద్యార్థులు, ఉపాధ్యాయులకు విద్య వ్యవస్థ ప్రగతికి మరింత దోహదపడుతున్నాయి.

# జ్వరంతో ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి

## ఆసుపత్రి ముందు ఆదివాసీ నాయకులు, సర్పంచ్‌ల నిరసన



ఆసుపత్రి ముందు నిరసన తెలుపుతున్న దృశ్యం

**జైనూర్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యు ) మండలంలోని మహాగాం బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో బాబ్జిపేట గ్రామానికి చెందిన 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని కోట్నాక్ గంగుబాయి (15) జ్వరంతో బాధపడుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలు బంధువులు నాయకులు తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు గంగుబాయి కి గత రెండు రోజులుగా జ్వరం వచ్చిందని ఆమెకు ఆసుపత్రికి తీసుక వెళ్లకుండా వసతి గృహంలోనే మాత్రలు ఇచ్చారని బుధవారం ఉదయం హాస్టల్లో టిఫిన్ చేసిన వెంటనే గంగుబాయి వాంతులు చేసుకొని కుప్పకూలిందని తెలిపారు.ఆ పాఠశాల ఉపాధ్యాయులు జైనూర్ ఆసుపత్రికి తీసుక రాగా వైద్యులు చికిత్స చేయకముందే ముందుగానే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని పేర్కొన్నారు. ఈ విషయం తెలియగానే ఆదివాసి జేఏసీ రాష్ట్ర కన్వీనర్ కనక యాదవ రావు, ఆదివాసి నాయకులు సర్పంచులు ఆసుపత్రి చేరుకొని విద్యార్థిని మృతి పట్ల గంటల తరబడి ఆసుపత్రి మెట్ల వద్ద నిరసన వ్యక్తం చేశారు. పాఠశాల ఉపాధ్యాయుల నిరక్ష ్యల్ల తోనే ఆ విద్యార్థి మృతి చెందిదని ఆ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.విషయం తెలుసుకున్న జైనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుమేత విశ్వనాత్ రావు, అసిఫాబాద్ గిరిజన సంక్షేమ అభివృద్ధి అధికారిణి రమాదేవి, ఉట్నూర్ పివిటిజి ఏపీఓ ఆత్రం భాస్కర్, ఏజెన్సీ విద్యాధికారి, జైనూర్ ఏటిడిఓ శ్రీనివాస్, సిర్పూర్ (యు ) మండల విద్యాశాఖ అధికారి కుడిమెత సుధాకర్, మహాగాం పాఠశాల హెచ్‌ఎం రాంబాయి, డిప్యూటీ వార్డెన్ శ్రీదేవి జైనూర్ ఆస్పత్రికి సందర్శించి విద్యార్థిని మృతదేహాన్ని పరిశీలించారు. అంతకుముందు నిరసన తెలుపుతున్న నాయకులతో అధికారులు మాట్లాడారు. ఈ సందర్భంగా నిరసన తెలుపుతున్న జేఏసీ కన్వీనర్ నాయకులు అధికారులతో మాట్లాడుతూ మృతురాలు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని తదితర డిమాండ్లతో ఆసిఫాబాద్ డిడీ రమాదేవికి, అధికారులకు వినతిపత్రం సమర్పించారు. విద్యార్థిని కుటుంబానికి తక్షణమే రూ.50వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అధికారులు వారి డిమాండ్ల హామీ ఇస్తూ తక్షణ సహాయం క్రింద రూ.20వేలు ఇస్తూ ఆ కుటుంబంలో ఒకరికి ఔట్సోర్సింగ్ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు.




# జెఇఇ మెయిన్‌లో రెసోనెన్స్ అద్భుత ప్రతిభ

**హైదరాబాద్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** జెఇఇ మెయిన్ 2026 ఫలితాల్లో రెసోనెన్స్ అద్భుత ప్రతిభ కనబరిచింది. ఆల్ ఇండియా 12వ ర్యాంకుతోపాటు అనేక మంది విద్యార్థులు టాప్ 1000లో చోటు సాధించారు. 99 పర్సెంటైల్‌లో అధిక సంఖ్యలో విద్యార్థులు నిలిచారు. ఫిజిక్స్, కెమిస్ట్రి, మ్యాథమెటిక్స్ ఈ మూడు సబ్జెక్టుల్లో విద్యార్థులు సమానంగా ప్రతిభ చూపారు. విద్యార్థుల అద్భుత విజయాన్ని పురస్కరించుకుని మాదాపూర్‌లోని ఆశ్రయ కన్వెన్షన్స్‌లో బుధవారం వేడుకలు నిర్వహించారు. మెరుగైన ర్యాంకు సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులు, అధ్యాపకుల సమక్షంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఫిజిక్స్‌లో 100 పర్సెంటైల్ సాధించిన సాకేత్‌రెడ్డికి రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) డైరెక్టర్ పూర్ణచందర్‌రావు చేతుల మీదుగా లక్ష నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఈఈ మెయిన్ వంటి పరీక్షల్లో విజయం సాధించాలంటే నిరంతర శ్రమతోపాటు ప్రాథమిక అంశాలపై అవగాహన అవసరమన్నారు. తమ విద్యార్థులు ఈ రెండింటిపై దృష్టి పెట్టారన్నారు. రెసోనెన్స్‌లో ఫలితాలకే పరిమితం కాకుండా, విద్యార్థుల్లో బలమైన విద్యా పునాది ఏర్పడేలా కృషి చేస్తున్నామన్నారు. జాతీయ స్థాయిలో ధైర్యంగా పోటీ చేసే స్థాయికి వారిని తీర్చిదిద్దడం తమ లక్ష ్యమన్నారు. ఈ ఏడాది ఫలితాలు గత ఏడాదితో పోలిస్తే మెరుగ్గా ఉన్నాయన్నారు. రెండు సంవత్సరాల సమగ్ర ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ద్వారా ఇంటర్, జేఈఈని సమన్వయం చేయడం ఈ విజయానికి ముఖ్య కారణమన్నారు. విద్యార్థుల అంకితభావం, అధ్యాపకులు వినూత్న బోధన పద్ధతులు ఈ విజయాల వెనుక ప్రధాన పాత్ర పోషించాయని చెప్పారు. థింక్ రిజల్ట్స్, థింక్ రెసోనెన్స్ అనే తమ నినాదానికి ఈ ఫలితాలు నిదర్శనమని పేర్కొన్నారు. కాగా.. జెఇఇ మెయిన్ 2026 ఫలితాల్లో ఆల్ ఇండియా ర్యాంక్ 12ను అభినవ్ చిత్తూరి సాధించారు. సాకేత్‌రెడ్డి ఫిజిక్స్‌లో 100 పర్సెంటైల్ సాధించారు. 94 మంది విద్యార్థులు 99 పర్సెంటైల్‌కు పైగా సాధించారు. 852 మంది విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో 99 పర్సెంటైల్ సాధించారు. అదేవిధంగా ఆలిండియా ర్యాంకులను... బునేటి ఆదిత్యరెడ్డి 147 ర్యాంకు, శెట్టిపల్లి అన్వితరెడ్డి 155ర్యాంకు, జీ ప్రగ్నేష్ 184 ర్యాంకు, సమృద్ధ్ భట్టాచార్య 242 ర్యాంకును, రేవంత్ వంగాల 365ర్యాంకును, స్నితిక 476 ర్యాంకును, అమరేంద్రనాయక్ 508 ర్యాంకును, డీ వివస్వత్ 529 ర్యాంకును, రూపమ్ గాయెన్ 622 ర్యాంకును, మనస్విని 630 ర్యాంకు, డీ యశస్వివర్ధన్ 877 ర్యాంకును, కే. సాయి చరణ్‌రెడ్డి 943 ర్యాంకును సాధించారు. రెసోనెన్స్ హైదరాబాద్ అన్ని క్యాంపస్‌ల నుంచి ఉత్తమ ఫలితాలు నమోదయ్యాయి.

# ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రాం ఘనంగా ప్రారంభం

### ఉట్నూరులో మంత్రి జూపల్లి కృష్ణారావు



మంత్రి జూపల్లిని సన్మానిస్తున్న నాయకులు

**ఉట్నూరు, ఏప్రిల్ 22; ప్రభాతవార్త;** ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం గోందుగూడలో ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రాంను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్ పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి జూపల్లికి సాజిద్ ఖాన్ శాలువాతో సత్కరించారు.అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే వెద్మ బొజ్జు పటేల్, ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, మాజీ టిపిసిసి ప్రధాన కార్యదర్శి గంద్రత్ సుజాతలతో కలిసి కొమరం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సాజిద్ ఖాన్ మాట్లాడుతూ, అడవుల్లో నివసిస్తున్న అనేక మంది ఆదివాసీలకు బయటి ప్రపంచంపై సరైన అవగాహన లేకపోవడంతో, కొంతమందికి జిల్లా కేంద్రం గురించి కూడా తెలియని పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. అలాంటి ఆదివాసీలను హైదరాబాద్‌కు తీసుకువెళ్లి పర్యాటక, విద్యా ప్రదేశాలను చూపించడం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ఆలోచన మేరకు ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ఆదివాసీలలో అవగాహనతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.

# పెహల్గాం తర్వాత ఉగ్రసంస్థలతో బలపడిన హమాస్ బంధం


### పాక్‌తో పాటు ఆక్రమిత కాశ్మీర్, బంగ్లాదేశ్‌లో పలుదఫాలు భేటీ అయినట్లు గుర్తించిన నిఘా వర్గాలు

### జమ్మూ కాశ్మీర్, పంజాబ్ రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశం

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** గత ఏడాది ఏప్రిల్ నెలలో జమ్మూ కాశ్మీర్‌లోని పెహల్గాంలో భారత పర్యాటకులపై పాక్ ఉగ్రవాదులు జరిపి న పైశాచిక దాడి యావత్ ప్రపంచాన్ని నివ్వెర పరచడం తెలిసిందే. 26 మంది అమాయకులు ఈ ఘాతుకంలో ప్రాణాలు కోల్పోవడం, కొందరు గా యపడడం విదితమే. పెహల్గాం దాడి తరువాత భారత సైన్యం ఆపరేషన్ సింధూర్ పేరిట పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై వైమానిక దాడులు చేసి ధ్వంసం చేయడం, ఈ సందర్భంగా పదుల సంఖ్యలో ఉగ్రవాదులు మరణించడం సంచలనం రేపింది. భారత్ జరిపిన దాడుల్లో పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలకు తీరని నష్టం చేకూరగా దీనికి ప్రతిగా పాక్ సైన్యం జమ్మూ కాశ్మీర్, రాజస్తాన్‌లలో గల సరిహద్దు గ్రామాలపై రాకెట్లు, డ్రోన్లతో దాడులకు తెగపడింది. దాదాపు నెల రోజుల పాటు పాక్ దాడులు చేయగా వాటిని భారత్ తిప్పికొట్టింది. ఈ దాడుల తరువాత పాక్‌కు చెందిన పలు ఉగ్రవాద సంస్థలతో పాలస్తీనా ఉగ్రవాద సంస్థ హమాస్ పలుమార్లు భేటీ అయి తమ మధ్య బంధాన్ని బలోపేతం చేసుకున్నాయని భా రత నిఘా వర్గాలు గుర్తించాయి. పాక్ కేంద్రంగా భారత్‌కు వ్యతిరేకంగా పనిచేస్తున్న లష్కర్ ఏ తోయిబా, జైష్ ఏ మహమ్మద్ సహా పలు ఉగ్రవాద సంస్థల నేతలో సిరియా, యెమన్ కేంద్రంగా పనిచేస్తున్న హమాస్ ఉగ్రవాదులు భేటీ అయినట్లు భారత నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ భేటీ పాక్ లోని పలు నగరాలతో పాటు ఆక్రమిత కాశ్మీర్, బంగ్లాదేశ్‌లలో జరిగినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. పాక్ ఉగ్రవాద సంస్థలు పాక్‌తో పాటు ఆక్ర మిత కాశ్మీర్‌లో సమావేశాలు నిర్వహించడం, కుట్రలు పన్నడం సాధారణమే. అయితే భారత్‌కు మిత్ర దేశంగా వున్న బంగ్లాదేశ్ కూడా వేదిక అవ్వడ ం సంచలన అంశం. ఆ సమయంలో బంగ్లాదేశ్‌లో మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక సర్కారు అధికారంలో వుండడం, యూనస్ భారత్‌లో ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడంతో హమాస్, పాక్ ఉగ్రవాద సంస్థల భేటీకి ఆస్కారం ఏర్పడింది. పాక్ ఉగ్రవాద సంస్థలు, హమాస్ నేతల భేటీలో భారత్‌లో ఉగ్రవాద కార్యకలాపాలను ఎక్కువ చేసేందుకు సంబంధించినవేనని నిఘా వర్గాలు గుర్తించాయి.


### జెఇఇ మెయిన్-2026 ఫలితాల్లో

# శ్రీచైతన్య డబుల్ రికార్డు



### ఇద్దరు విద్యార్థులకు 300కు 300 మార్కులు

### ఓపెన్ కేటగిరిలో మొదటి ర్యాంకు



**హైదరాబాద్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** జెఇఇ మెయిన్ -2026 ఫలితాల్లో శ్రీచైతన్య విద్యా సంస్థ సంచలన రికార్డు సృష్టించింది. ఇద్దరు విద్యార్థులు 300 మార్కులకు 300లు సాధించి డబుల్ రికార్డు సృష్టించారు. ఓపెన్ కేటగిరిలో రెండు ఆలిండియా మొదటి ర్యాంకులను బివిసి శేఖర్‌రెడ్డి, పాసాల మోహిత్ 300కు 300 మార్కులు సాధించి కైవసం చేసుకున్నారు. ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 8వ ర్యాంకును ఆరూష్ సింఘాల్, 11వ ర్యాంకును యష్‌వర్ధన్, జెఆర్ మణిదీప్‌రెడ్డి 15వ ర్యాంకును సాధించారు. టాప్ 10లోపు మూడు ర్యాంకులతోపాటు 100లోపు , 1000లోపు ర్యాంకులను అత్యధికంగా శ్రీచైతన్య విద్యార్థులు సొంతం చేసుకున్నారు. ఈ ఏడాది గత సంవత్సరం కంటె అత్యధిక ర్యాంకులు సాధించిన శ్రీచైతన్య విద్యార్థులు రికార్డు సృష్టించారు. అదేవిధంగా శ్రీచైతన్య అకాడమి బెంగళూరు విద్యార్థి నిశాంక్ వ్యాస్ ఎఐఆర్ 396 సాధించాడు. ఎఐఆర్ 98, 396, 826 తదితర ర్యాంకులను శ్రీచైతన్య సాధించింది. ఈ సందర్భంగా శ్రీచైతన్య అకడమిక్ డైరెక్టర్ సుష్మ బొప్పన మాట్లాడుతూ మూడేళ్లుగా జెఈఈ మెయిన్‌లో వరుసగా 300/300 మార్కులు సాధిస్తూ హ్యాట్రిక్ రికార్డు సృష్టించడం ఒక్క శ్రీచైతన్యకే సాధ్యమైందన్నారు. మైక్రో షెడ్యూల్స్, నిరంతర ఇంటర్నల్ ఎగ్జామ్స్, అత్యుత్తమ ఫ్యాకల్టీ, అధునాతన లెర్నింగ్ ప్లాట్‌ఫామ్స్ శ్రీచైతన్య విద్యార్థుల విజయానికి వెన్నెముకగా నిలిచాయన్నారు. తమ విజయాల్లో ఇన్ఫినిటి ఆన్‌లైన్ యాప్ కీలకపాత్ర పోషించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులను, అధ్యాపక బృందాన్ని ఆమె అభినందించారు.

# ఆర్టీసి సమ్మెవెనుక రాజకీయ కుట్ర కమిటీలతో కాలయాపన చేయం

### ఇవి బస్సుల కారణంగా ఒక్క ఉద్యోగిని తొలగించం:మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

**హైదరాబాద్, ఏప్రిల్22,ప్రభాతవార్త:** ఆర్టీసి సమ్మె వెనుక రాజకీయ కుట్ర ఉందని,అధికారుల కమిటీ తో ఐదు గంటలపైగా చర్చిస్తుండగానే సమ్మెకు పోతున్నామని మధ్యలో వెళ్లిపోవడం జరిగిందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆరోపించారు. బుధవారం విలేఖరుల సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ గ్రామీణ ప్రాంతాల పేద ప్రజల జీవనరేఖ ఆర్‌టిసి అనీ,దాని పరిరక్షణ,ప్రజా శ్రేయస్సు దృశ్య ఆర్టీసీ కార్మికులు సమ్మె విరమించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసిలో రోజుకు 65 మంది ప్రయాణిస్తుండగా అందులో 40 లక్షల మంది మహిళలనీ వివరించారు. ఆర్టీసి జెఎసి 32 డిమాండ్లలో 29 అంశాలకు ప్రభుత్వం పరిష్కరించడానికి సిద్ధంగా తెలిపారు. మిగిలిన మూడు అంశాలకోసం సీనియర్ ఐఏఎస్ లతో కమిటీ వేశామని తెలిపారు. జగిత్యాల సభలో మహా లక్ష్మీ ్మ ప్రయాణం కెసిఆర్ అవహేళన గా మాట్లాడారనీ ఆవేదన చెందారు. ఆర్టీసి పై కుట్రలో భాగంగానే గతంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు గా ఉన్న హరీష్ రావు సమ్మె పై కార్మికులను ప్రోత్సహించారు.ఉప ముఖ్యమంత్రితో ఆర్టీసీ డిమాండ్స్ పై చర్చిస్తున్నాని అధికారులు చెబుతున్నా సంఘాల నేతలు వినకుండా ఎవరితో ఫోన్ లో మాట్లాడి సమ్మె కి వెళ్ళారనీ ఆవేదన చెందారు. ఆర్టీసీ కార్మికులకు 2013 బాండ్స్‌కు 280 కోట్లు ఇచ్చామనీ,1134 మందికి కారుణ్య నియామకాలు జరిపామనీ తెలిపారు. రాష్ట్ర రవాణా శాఖ పక్షాన పని భారం లేకుండా కార్మిక చట్టాలుచేశామనీ,గతంలో 12 గంటలు వాహనం నడపడం వల్ల మరునాడు హాఫ్ ఉండేదనీ దానిని పునరుద్ధరణచేస్తామని తెలిపారు. విలీనం ,యూనియన్ ల అంశాలపై ప్రభుత్వం పరిగణన లో ఉందనీ ఆయన వెల్లడించారు. ప్రభుత్వం నెలకి ఆర్టీసీకి 300 కోట్ల ,అవసరమైనప్పుడు 400 కోట్లు ఎంత అవసరం ఉంటే అంత ఇస్తుందనీ చెప్పారు. ఆర్టీసీ లో సర్వీసు నుండి రిమూవ్ అయిన వారికి 250 మందికి పైగా ఉద్యోగాలు ఇస్తున్నామనీ తెలిపారు. మా ప్రభుత్వం కమిటీలతో కాలయాపన చేసేది కాదనీ నాలుగువారాల సమయం అడిగామనీ తెలిపారు.ప్రభుత్వం తో కూర్చొని మాట్లాడాల్సిన అంశాలు నాయకత్వం వహించిన వారు రిటైర్డ్ అయిన వారు ,ఉద్యోగాలు చేయని వారు ఉన్నారు..గత ప్రభుత్వం ఆర్టీసీ నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరించింది.. ఎలాంటి సంప్రదింపులు లేకుండా ఎండీ కి , ప్రిన్సిపల్ సెక్రటరీ కి తెలియకుండా ఆదరభదార గా విలీనం అంశాన్ని తెచ్చారు ఫైనాన్స్ మినిస్టర్ దగ్గరకు రండి కూర్చొని మాట్లాడడం..మహా లక్ష్మీ ్మ పథకం నచ్చనంత మాత్రాన మీరు ఆర్టీసీ పై కుట్రలు చేయాలా రాజకీయ వ్యూహంగా దెబ్బ కొట్టే ప్రయత్నం చేస్తున్నారనీ ఆవేదన చెందారు. పేద ప్రజల రవాణా సౌకర్యాలు దెబ్బతినకుండా సమ్మె విరమించాలనీ డిప్యూటీ సిఎం చెన్నైలో ఉండటంతో సకాలంలో వారితో సమావేశం కాలేదని మంత్రి కార్మికులకు తెలిపారు.

# హైకోర్టు తీర్పుతో కాంగ్రెస్ గోబెల్స్ ప్రచారం పటాపంచలు: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిది హైదరాబాద్, ఏప్రిల్22:** కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ చేసిన ఘోరాతి ఘోరమైన గోబెల్స్ ప్రచారం హైకోర్టు తీర్పుతో పటాపంచలైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నిజం నిలకడ మీద తేలుతుందనే నానుడిని ఈ తీర్పుతో హైకోర్టు మరోసారి నిరూపించిందని పేర్కొన్నారు. ఈ తీర్పునిచ్చిన హైకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ భవన్‌లో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంవత్సరం కరువు ఉంది అనగానే కాళేశ్వరమే కల్పతరువని గ్రహించిన రేవంత్ రెడ్డి మేడిగడ్డకు పరుగులు పెట్టారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు గొప్పతనం రేవంత్ రెడ్డికి ఇప్పటికే అర్థం అయ్యి ఉంటుందని వివరించారు. ఇవ్వాళ కూలింది కాళేశ్వరం కాదని, కేసీఆర్ మీద కాంగ్రెస్ చేసిన కుట్రలు, అబద్ధాలు, మోసపూరిత గారడీలు కుప్పకూలాయని స్పష్టం చేశారు.

హైకోర్టు తీర్పుతో నిజం నిరూపితమై, కాళేశ్వరం కాలర్ ఎగరేసి నిటారుగా నిలబడ్డదని అభివర్ణించారు. కాంగ్రెస్ కక్కుర్తికి ఎస్ఎల్‌బీసీ కుప్పకూలి అక్కడ పనిచేస్తున్న కార్మికులు జల సమాధి అయిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

# ఫైలంటే కాగితం కాదు.. ఒకరి జీవితాన్ని మార్చే శక్తి

### మేధస్సుకంటే చిత్తశుద్ధే ముఖ్యం, విచక్షణే అసలు పరీక్ష : గ్రూప్ 1 అధికారులతో డిసిఎం భట్టి దిశా నిర్దేశం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్22:** 'మీరు సంతకం చేసే ప్రతి ఫైలు వెనుక ఒక సామాన్యుడి ఆశ ఉంటుంది. ఆ ఫైలును కేవలం కాగితంలా చూడకండి.. అది ఒకరి జీవితాన్ని మార్చే శక్తి అని గుర్తుంచుకోండి' అని నూతనంగా ఎంపికైన గ్రూప్1 అధికారులకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పిలుపునిచ్చారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఆరు వారాల పాటు జరిగిన గ్రూప్1 ఫౌండేషన్ కోర్స్ (బ్యాచ్-2) ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న 214 మంది అధికారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ప్రజా సేవలో పాటించాల్సిన నైతిక విలువలు, పరిపాలనలో మానవీయ కోణాన్ని మర్చిపోవద్దని డిప్యూటీ సీఎం దిశానిర్దేశం చేశారు. పరిపాలనలో వేగం పెరగాలని, ప్రతి నిర్ణయం పేదవాడి దరి చేరాలని అధికారులకు సూచించారు. 'వ్యవస్థలు నిరంతరం కొనసాగుతూనే ఉంటాయి, కానీ అందులో పనిచేసే వ్యక్తులు చూపే సానుభూతి మాత్రమే మార్పును తెస్తుంది. రైతు ఆశ, విద్యార్థి కల, రోగి ప్రాణం ఇవన్నీ మీరు తీసుకునే నిర్ణయాలపైనే ఆధారపడి ఉంటాయి. చట్టాలకు లోబడి ఉంటూనే, మానవీయ కోణంలో ఆలోచించడం అలవాటు చేసుకోవాలి' అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

ఫైళ్లు, సమీక్షల హడావుడిలో పడి సామాన్యుడిని విస్మరించవద్దు. రైతు సాయం, విద్యార్థి స్కాలర్‌షిప్, రోగి ఆరోగ్యం మీ కలంపైనే ఆధారపడి ఉంటాయని గుర్తుంచుకోవాలన్నారు. పోటీ పరీక్షల్లో మీ మేధస్సు నిరూపితమైంది, కానీ క్షేత్రస్థాయిలో మీ విచక్షణకు పరీక్ష ఎదురవుతుంది. ఒత్తిళ్లకు లొంగకుండా నైతిక విలువలతో పనిచేసినప్పుడే ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న సమ్మిళిత వృద్ధిని క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదే అని గుర్తు చేశారు.నేటి ఆధునిక యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని పాలనలో వాడుకోవాలని, అయితే సాంకేతికత ఎన్నటికీ మానవత్వంతో కూడిన సానుభూతిని భర్తీ చేయలేదని గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'ఇందిరా మహిళా శక్తి' వంటి ప్రతిష్టాత్మక పథకాలను ప్రజలకు చేరవేయడంలో యువ అధికారులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ప్రజలతో మీరు మాట్లాడే తీరు, వారిని గౌరవించే విధానమే ప్రభుత్వానికి అసలైన ముఖచిత్రం' అని ఆయన స్పష్టం చేశారు. 'ఒక పింఛను సకాలంలో అందడం, ఒక చిన్న సమస్య పరిష్కారం కావడం ద్వారానే సుపరిపాలన పునాదులు బలపడతాయి. తెలంగాణ భవిష్యత్తు కేవలం సచివాలయంలోనే కాదు, మీ నిర్ణయాల ద్వారా గ్రామాలు, మండలాల్లో రూపుదిద్దుకుంటుంది' అని పేర్కొంటూ నూతన అధికారులకు ఆయన అభినందనలు తెలిపారు.

# లక్నో జట్టుపై రాజస్థాన్ రాయల్స్ గెలుపు 40 పరుగుల తేడాతో ఎల్ఎస్జీ ఓటమి



**లక్నో, ఏప్రిల్ 22:** ఐపిఎల్ 26వ న ీ జ న ్ ల ో లక్నోసూపర్‌ఝెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ ఘనవిజయం సాధించింది. 18 ఓవర్లలో 119 పరుగులకే ఆలౌట్ కావడంతో 40 పరుగుల తేడాతో రాజస్థాన్ రాయల్స్ గెలిచింది. తొలుత బ్యాటింగ్‌చేపట్టిన రాజస్థాన్ రాయల్స్ ఆరు వికెట్లనష్టానికి 159 పరుగులుచేసి ప్రత్యర్థిలక్నో సూపర్‌జెయింట్స్‌కు 160 పరుగుల లక్ష్యం విధించింది. లక్ష్యఛేదనలో ఎల్ఎస్‌జి తడబాటుకు గురికావడంతో 199 పరుగులకే ఆలౌట్ అయ్యారు. దీనితో 40 పరుగుల తేడాతో రాజస్థాన్ జట్టు గెలుపును ప్రకటించారు. లక్నోముందు చిన్నపాటిలక్ష్యమే ఉన్నప్పటికీ ఛేదనలో లక్నో తడబాటువల్ల మ్యాచ్ నష్టపోయింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగినరాజస్థాన్ రాయల్స్‌కు ఆదిలోనే షాక్ తగిలింది. ఓపెనర్ యశస్విజైస్వాల్ 12 బంతుల్లో 22 పరుగులుచేసి మెరిసినప్పటికీ ఆజోరు ఎంతోసేపు కొనసాగించలేదు. యువ సంచలన వైభవ్ సూర్యవంశీ కూడా ఎనిమిది పరుగులకే పరిమితం అయి మరోసారి నిరాశపరిచాడు. కీలకమైన మిడిలార్డర్ బ్యాటర్ ధ్రువ్‌జురైల్ ఖాతా తెరవకుండానే పెవిలియన్‌చేరాడు. ఫామ్‌లో ఉన్న రియాన్‌పరాగ్ 20, హిట్‌మేయర్ 22 క్రీజులో కుదురుకున్నట్లు కనిపించినా భారీ స్కోర్లు చేయలేకపోయారు.

# కరెంట్ సర్‌ఛార్జికి నో.. యేడాది పాటు నిలిపివేత

- పంపిణీ సంస్థలకు రూ.10 వేల కోట్ల భారం
- వడ్డీ రూపంలో మరో రూ.300 కోట్ల నష్టం
- నియంత్రణ కమిషన్ కీలక నిర్ణయం

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజలకు విద్యుత్ ఛార్జీలపై భారీ ఉపశమనం కలిగింది. విద్యుత్ సర్‌ఛార్జి వసూలు చేయకుండా ఏడాదిపాటు నిలిపివేస్తూ తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ కీలక నిర్ణం తీసుకుంది. ఈ మేరకు ట్రూఅప్ పేరుతో వినియోగదారుల నుంచి సర్ ఛార్జీ వసూలు చేయడంపై ఏడాది పాటు నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ప్రజలకు కరెంట్ బిల్లుల భారం తగ్గనుంది. ఈ నిర్ణయంతో కరెంట్ బిల్లులు పెరిగే అవకాశం లేకుండా పోయింది. విద్యుత్ కొనుగోళ్ల ఖర్చును ప్రజలకు బదిలీ చేసేందుకు సర్ ఛార్జి పేరుతో యూనిట్‌కు 30 పైసల వరకు వసూలు చేసేందుకు పంపిణీ సంస్థలకు అనుమతి ఉంది. కానీ ఇందుకు ప్రభుత్వం, విద్యుత్ నియంత్రణ కమిషన్ అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. వీటి వసూలకు అనుమతి ఇవ్వకపోడం వల్ల 2023-25 మధ్య కాలంలో రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థల దాదాపు రూ.10 వేల కోట్ల భారం పడింది. ఇక ఏడాది పాటు వసూలు చేయకపోవడం వల్ల వడ్డీ రూపంలో రూ.300 కోట్లు డిస్కంలు నష్టపోనున్నాయి. ఏడాది తర్వాత ప్రభుత్వం వసూలు చేయకూడదని అనుకుంటే, డిస్కంలకు ప్రభుత్వం ఈమొత్తాన్ని అందించాల్సి ఉంటుంది. సర్ ఛార్జిని వినియోగదారుల నుంచి వసూలు చేసేందుకు అనుమతి ఇవ్వాలని విద్యుత్ నియంత్రణ కమిషన్‌ను పంపిణీ సంస్థలు కోరాయి. ఇందుకోసం పిటిషన్లను దాఖలు చేయాల్సి ఉంటుంది.

# అజహరుద్దీన్ మంత్రి పదవిపై ఉత్కంఠ సుప్రీంకోర్టులో విచారణ జూలై 22కు వాయిదా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిది హైదరాబాద్,ఏప్రిల్22:** గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై దాఖలైన పిటిషన్ల కేసు విచారణను సుప్రీం కోర్టు జూలై 22వ తేదీకి వాయిదా వేయడంతో మంత్రి అజహరుద్దీన్ మంత్రి పదవిపై ఉత్కంఠత నెలకొంది.ఈ నెలాఖరుతో మంత్రి పదవి గడువు ముగియనున్నది. ఎమ్మెల్యే/ఎమ్మెల్సీ కాకుండానే మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అజర్ ఆరు నెలల్లోగా చట్ట సభకు ఎన్నిక కావాల్సి ఉంది. అలా జరగకపోతే రాజ్యాంగంలోని ఎన్నికల నియమావళి ప్రకారం ఆరు నెలలు దాటగానే సదరు మంత్రి మాజీ అవుతారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల (అజర్, ప్రొఫెసర్ కోదండరాం) నియామకాన్ని సవాల్ చేస్తూ బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్‌తో పాటు మరి కొందరు వేర్వేరుగా సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దీంతో బుధవారం కోర్టు తీర్పు సానుకూలంగా వస్తుందని ఆశించిన వారికి నిరాశ ఎదురైంది. మైనారిటీ కోటాలో మంత్రివర్గంలో అజర్‌ను తీసుకుంటే ఇప్పుడు ఈ సమస్య రావడంతో తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజ్‌భవన్‌కు వెళ్ళి గవర్నర్‌తో సమావేశమై పరిస్థితిని అధిగమించడానికి గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఫైలును క్లియర్ చేయాల్సిందిగా కోరినట్లు సమాచారం. కాగా కేసు సుప్రీం కోర్టులో ఉన్నదని గవర్నర్ సలహాదారుల సూచన మేరకు ఆయన నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేస్తున్నారని తెలుస్తోంది.

# హైకోర్టు తీర్పుతో ధర్మం గెలిచింది.. వెలుగులోకి రేవంత్ రెడ్డి డ్రామాలు : హరీష్ రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఏప్రిల్22:** పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు స్టేను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు స్వాగతించారు. సత్యమేవ జయతే.. కమిషన్ నివేదిక చెల్లదని హైకోర్టు చెప్పింది. హైకోర్టు తీర్పుతో ధర్మం గెలిచింది. కాళేశ్వరం పేరుతో బీఆర్ఎస్‌పై బురద జల్లే ప్రయత్నం చేశారు. సీఎం కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం చేశారు. రేవంత్ రెడ్డి డ్రామాలు వెలుగులోకి వచ్చాయి. మేడిగడ్డ పిల్లర్ల మర్మమతులు పూర్తి చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పు సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టు. కాళేశ్వరం కూలేశ్వరం అయిందని రేవంత్ రెడ్డి మాట్లాడారు. ప్రాథమిక హక్కులు, సహజ న్యాయ సూత్రాలను విస్మరిస్తూ నడిపిన విచారణను ఉన్నత న్యాయస్థానం తప్పు బట్టింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలయ్యాయి.

# వీనస్ సంచలన ఓటమి



**న్యూఢిల్లీ:** తన కెరీర్‌లో ఏడు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను గెలుచుకున్న మాజీ ప్రపంచ నంబర్ 1 వీనస్ విలియమ్స్ సంచలన ఓటమి చవిచూసింది. ఈ అనుభవజ్ఞురాలైన అమెరికన్ స్టార్ మాడ్రిడ్ ఓపెన్‌లో వరుసగా తన 10వ సింగిల్స్ మ్యాచ్‌లో ఓడిపోయింది. 45 ఏళ్ల విలియమ్స్, మాడ్రిడ్ ఓపెన్ మొదటి రౌండ్‌లో క్ైట్లిన్ క్వెవెడో చేతిలో 6-2, 6-4 తేడాతో ఓడిపోయి, వరుసగా 10 మ్యాచ్‌లలో ఓడిపోయిన మొదటి మాజీ నంబర్ వన్ క్రీడాకారిణిగా నిలిచింది. తన ప్రత్యర్థి పుట్టకముందే తన ఎనిమిది గ్రాండ్ స్లామ్ టైటిల్స్‌లో ఆరింటిని గెలుచుకున్న 2010 ఫైనలిస్ట్ విలియమ్స్‌ను, వైల్డ్‌కార్డ్ క్రీడాకారిణి రెండవ సెట్‌లో 3-0 తో వెనుకబడినప్పటికీ ఓడించింది. ఈ ఏడాది ఇండియన్ వెల్స్ టోర్నమెంట్‌కు వీనస్ విలియమ్స్‌కు వైల్డ్ కార్డ్ ఎంట్రీ లభించిందని నిర్వాహకులు ధృవీకరించారు. దక్షిణ కాలిఫోర్నియా ఎడారిలో జరిగే ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో ఈ అమెరికన్ క్రీడాకారిణి డబుల్స్‌లో కూడా పోటీపడనుంది. ఈ స్టార్ క్రీడాకారిణి చివరిసారిగా జూలై 2025లో వాషింగ్టన్ ఓపెన్‌లో తన తోటి అమెరికన్ క్రీడాకారిణి పేటన్ స్టెర్న్స్‌ను ఓడించి మ్యాచ్ గెలిచింది. అలాగే 2000, 2001, 2005, 2007, 2008లో ఈ ప్రతిష్టాత్మకమైన గడ్డి కోర్టులలో విజయం సాధించి, ఐదుసార్లు వింబుల్డన్ టైటిల్‌ను గెలుచుకుంది. అంతేకాకుండా వీనస్ 2000, 2001లో యూఎస్ ఓపెన్‌ను కూడా గెలుచుకుంది. ఒక గ్రాండ్ స్లామ్‌లో అత్యధిక సార్లు పాల్గొన్న రికార్డు ఆమె పేరిట ఉంది. ఈ ఏడాది జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆమెకు 95వ టోర్నమెంట్.

## శాప్ మహిళల ఛాంపియన్‌షిప్‌కు భారత్ ఆతిథ్యం

# టోర్నీ నుండి వైదొలిగిన పాక్



**న్యూఢిల్లీ:** దశాబ్దం తర్వాత శాప్ మహిళల ఛాంపియన్‌షిప్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ టోర్నమెంట్‌లో బంగ్లాదేశ్‌తో డ్రా ఖరారు కాగా, పాకిస్థాన్ వైదొలిగింది. మే 24 నుండి జూన్ 7 వరకు గోవాలో జరగనున్న ఈ మహిళల ఛాంపియన్‌షిప్‌లో భారత్‌తో పాటు, డిఫెండింగ్ ఛాంపియన్ బంగ్లాదేశ్, మాల్దీవులు కూడా చోటు దక్కించుకున్నాయి. ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన భారత్ దశాబ్ద కాలంలో తొలిసారిగా ఈ టోర్నమెంట్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. ఫటోర్డాలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఆరు జట్లు ఛాంపియన్‌షిప్ టైటిల్ కోసం పోటీపడనున్నాయి. గ్రూప్ ఎలో నేపాల్, శ్రీలంక, భూటాన్, గ్రూప్ బిలో భారత్, బంగ్లాదేశ్, మాల్దీవులు ఉన్నాయి. అయితే పాకిస్తాన్‌కు భారత్‌లో ఆడేందుకు అక్కడి ప్రభుత్వం నుండి అనుమతి లభించలేదు. దీంతో టోర్నమెంట్ నుండి పాకిస్థాన్ మహిళా జట్టు వైదొలగాల్సి వచ్చింది. ఇక ప్రతి గ్రూపు నుండి అగ్రస్థానంలో నిలిచిన రెండు జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి, ఫైనలిస్టులను నిర్ణయించడానికి ఈ సెమీఫైనల్స్‌ను సింగిల్‌లెగ్ నాకౌట్ పద్ధతిలో ఆడతారు. కాగా గ్రూప్ దశలోనే నిష్క్రమించిన ఎఫ్‌సి ఆసియా కప్ 2026 తర్వాత, భారత్‌కు శాప్ ఛాంపియన్‌షిప్ మొట్టమొదటి పోటీ టోర్నమెంట్ కానుంది. పోటీలో అత్యంత విజయవంతమైన జట్టుగా ఉన్నప్పటికీ భారత్ గత రెండు ఎడిషన్లలో ఆధిపత్యం చెలాయించలేకపోయింది. 2022, 2024 లో బంగ్లాదేశ్, నేపాల్ జట్లు ఫైనల్స్‌లో తలపడ్డాయి. 2019లో జరిగిన ఫైనల్‌లో ఆతిథ్య దేశమైన నేపాల్‌ను 3-1 తేడాతో ఓడించి భారత్ చివరిసారిగా శాప్ మహిళల ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది.



## బాక్సింగ్ టాప్స్ కోర్ గ్రూప్‌లో..

# సచిన్, ప్రీతి, అరుంధతి, ప్రియ

**న్యూఢిల్లీ:** నలుగురు భారత బాక్సర్లు ప్రీతి పవార్, ప్రియా, అరుంధతి చౌదరి మరియు సచిన్ సివాచ్ టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ కోర్ గ్రూప్‌కు పదోన్నతి పొందారు. ఇటీవల ముగిసిన ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లలో పవార్, ప్రియా, చౌదరి స్వర్ణ పతకాలు సాధించగా, సివాచ్ రజత పతకాన్ని కైవసం చేసుకున్న తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. టాప్స్ ఫ్రేమ్‌వర్క్ కింద అథ్లెట్ల ప్రదర్శనలను బుధవారం సమీక్షించిన 172వ మిషన్ ఒలింపిక్ సెల్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆసియా ఛాంపియన్‌షిప్‌ల సమయంలో అర్హత సాధించిన పవార్, ఈ ఏడాది చివర్లో గ్లాస్గోలో జరిగే కామన్వెల్త్ గేమ్స్, జపాన్‌లో జరగనున్న ఆసియా గేమ్స్ రెండింటిలోనూ పోటీపడనుంది. ఆమెతో పాటు జైస్మిన్, ప్రియా, అరుంధతి, సివాచ్ కూడా పాల్గొననున్నారు. బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్దేశించిన అర్హత ప్రమాణాలను నెరవేర్చినందున, పవార్, ప్రియా మరియు శివాచ్ కూడా ఆసియా క్రీడల్లో పోటీపడనున్నారు. అంతేకాకుండా, ఆసియా ఛాంపియన్‌షిప్‌లలో వారి ప్రదర్శనల ఆధారంగా, ఎమ్‌ఒసి ఆదిత్య (65 కేజీలు), దీపక్ (70 కేజీలు), హర్ష్ (90 కేజీలు) అనే ముగ్గురు బాక్సర్లను టాప్ డెవలప్‌మెంట్ గ్రూప్‌లో చేర్చింది. నరేందర్ (+90 కేజీలు) టార్గెట్ ఏషియన్ గేమ్స్ గ్రూప్‌లో చేర్చబడ్డాడు, ఈ నెల ప్రారంభంలో ఉలాన్‌బాతర్‌లో జరిగిన మీట్‌లో హర్ష్ మరియు నరేందర్ కాంస్య పతకాలు సాధించగా, ఆదిత్య మరియు దీపక్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు.

# నేడు ఐపిఎల్ కీలక పోరు

## చెన్నై, ముంబై ఇండియన్స్‌కు డు ఆర్ డై.. ఒకరిపై ఒకరు గెలిస్తేనే ప్లే ఆఫ్స్ ఆశలు!

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2026 సీజన్లో చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఇప్పటివరకు ఆరు మ్యాచ్‌లు ఆడిన చెన్నై కేవలం రెండు విజయాలు మాత్రమే అందుకుంది. దీంతో ప్రస్తుతం 4 పాయింట్లతో పాయింట్ల పట్టికలో 8వ స్థానంలో ఉంది. ఇప్పటికే లీగ్ దశలో దాదాపుగా సగం మ్యాచ్‌లు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో ప్లే ఆఫ్స్ రేసులో నిలవాలంటే మ్యాచ్ కీలకం కానుంది. సూపర్ కింగ్స్, ఇండియన్స్‌కు ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టుకు ప్లే ఆఫ్స్ అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఓడిన జట్టుకు ప్లే ఆఫ్స్ అవకాశాలు సన్నగిలుతాయి.

కాగా ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ 11 పాయింట్లతో ప్లే ఆఫ్స్‌రేసులో ముందంజలో ఉంది. అలాగే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్ జట్లు 8 పాయింట్లతో బలమైన స్థితిలో ఉన్నాయి. ఈ





ఇకపై ప్రతి మ్యాచ్ చెన్నై సూపర్ కింగ్స్‌కు అత్యంత కీలకం. ఒక్కో మ్యాచ్ ఓడిపోతే ప్లే ఆఫ్స్ అవకాశాలు సన్నగిల్లుతుంటాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 23న వాంఖడేలో ముంబై ఇండియన్స్ పై గెలవడం తప్పనిసరి. మరోవైపు ముంబై ఇండియన్స్ కూడా చెన్నై సూపర్ కింగ్స్ లాంటి పరిస్థితినే ఎదుర్కొంటోంది.

తాజాగా గుజరాత్ టైటాన్స్‌పై విజయం సాధించి ముంబై 4 పాయింట్లతో తిరిగి పోటీలోకి వచ్చింది. ముంబై జట్టుకు మంచి కాంబినేషన్ ఉండటంతో బలంగా తిరిగి వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీంతో ముంబై ఇండియన్స్‌కు కూడా సూపర్ కింగ్స్‌తో జరగనున్న పరిస్థితుల్లో చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ ప్లే ఆఫ్స్‌కు చేరాలంటే ఇకపై తప్పనిసరిగా వరుస విజయాలు సాధించాల్సి ఉంటుంది. ముఖ్యంగా ముంబైపై జరిగే మ్యాచ్‌లో గెలిస్తే చెన్నై 6 పాయింట్లకు చేరుకుని ఆశలను సజీవంగా ఉంచుకోగలదు. అదే సమయంలో ముంబై 4 పాయింట్ల వద్దే ఉంటుంది. ఓడిపోతే సీఎస్కే ప్లే ఆఫ్స్ ఆశలు ప్రమాదంలో ఉంటాయి.

ఈ కీలక సమయంలో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఎలా జట్టును నడిపిస్తాడో చూడాలి. మొత్తానికి చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్‌కు ఈ మ్యాచ్ ఇది డూ ఆర్ డై పరిస్థితి అనే చెప్పాలి.



## టీ20 మహిళా ర్యాంకింగ్స్‌లో..

# దుమ్ము రేపిన షెఫాలీ


### దిగజారిన స్మృతి



**న్యూఢిల్లీ:** టీమిండియా స్టార్ బ్యాటర్ షెఫాలీ వర్మ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో దుమ్ము రేపింది. ఐసీసీ విడుదల చేసిన తాజా జాబితాలో షెఫాలీ (731) రెండు ప్లేస్లు ఎగబాకి ఆరో ర్యాంక్లో నిలిచింది. సౌతాఫ్రికాతో జరుగుతున్న ఐదు మ్యాచ్ల సిరీస్లో భాగంగా ఆదివారం జరిగిన రెండో టీ20లో హాఫ్ సెంచరీ చేయడం ఆమెకు కలిసొచ్చింది. అలాగే వైస్ కెప్టెన్ స్మృతి మంధాన (762) ఒక్క ప్లేస్ దిగజారి నాలుగో ర్యాంక్‌కు పడిపోయింది. గత రెండు మ్యాచ్‌ల్లో స్మృతి 13, 12 రన్స్ మాత్రమే చేసింది. ఇక విండీస్ బ్యాటర్ హేలీ మాథ్యూస్ (767) మూడో ర్యాంక్‌కు ఎగబాకింది. టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (639) రెండు ర్యాంకులు మెరుగుపడి 11వ స్థానంలో నిలవగా, జెమీమా రోడ్రిగ్స్ (637) 14వ ర్యాంక్‌నకు పడిపోయింది. జార్జియా వోల్ (815), బెత్ మూనీ (788), హేలీ మాథ్యూస్ (767) టాప్-3లో కొనసాగుతున్నారు. కాగా బౌలింగ్లో దీప్తి శర్మ (705) రెండు స్థానాలు కిందకు దిగి ఐదో ర్యాంక్‌తో సరిపెట్టుకుంది. రేణుకా సింగ్ (699) నాలుగు ప్లేస్‌ను అరుంధతి రెడ్డి (665) మూడు స్థానాన్ని కోల్పోయి వరుసగా 9, 12వ ర్యాంక్‌ల్లో నిలిచారు. రాధా యాదవ్ (620) 20వ ర్యాంక్‌లో ఉంది.

## పశ్చిమాసియా ఎఫెక్ట్!

# నష్టాల్లోకి సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబయి, ఏప్రిల్ 22:** దేశీయ ఈక్విటీసూచీలు ఒక్కసారిగా నష్టాల్లోకి మళ్లాయి. ఇరాన్‌పై శాంతిచర్చలకు గడువు నిరవధిక పొడిగింపు, హార్ముజ్‌లో నౌకలపై దిగ్బంధం కొనసాగుతుందన్న ట్రంప్ ప్రకటనలు మార్కెట్లను కుంగదీసాయి. బుధవారం బిఎస్ఇ సెన్సెక్స్ 756.84 పాయింట్లు క్షీణించి 78,516.49 పాయింట్లవద్ద ట్రేడింగ్ ముగిస్తే నిఫ్టీ 50 సూచీ కూడా 198.50 పాయింట్లు క్షీణించి 24,378.10 పాయింట్లవద్ద ట్రేడింగ్ ముగిచింది. గడచిన మూడు సెషన్లలో సెన్సెక్స్, నిఫ్టీలు వరుసగా 1.65 శాతం, 1.57శాం చొప్పున పెరిగాయి. ఇన్వెస్టర్లు వేచి చూసేధోరణి అవలంభించారు. హెచ్‌సిఎల్‌టెక్నాలజీస్ 10.74శాతం భారీగా క్షీణిస్తే ఇన్ఫోసిస్ 3.38శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 1.52శాతం చొప్పున సూచీలో భారీ క్షీణతను ఎదుర్కొన్నాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.29శాతం పెరిగితే స్మాల్‌క్యాప్‌సూచీ 0.90శాతంపెరిగింది. మార్కెట్లపరంగా బిఎస్ఇలో 2440 కంపెనీలషేర్లుపెరిగాయి. 1838 కంపెనీల షేర్లు దిగజారాయి. మొత్తం 154 షేర్లు యదాతథంగా కొనసాగాయి. భారత్‌ప దేళ్ల బాండ్లరాబడులు 6.915 శాతంవద్దకు చేరాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌పరంగా రూపాయి 93.78వద్ద కదలాడింది. అంతకుముందురోజు 93.44 వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు జూన్ ఐదు సెటిల్‌మెంట్లు రూ.1,53,190వద్ద రికార్డయింది. అమెరికా పదేళ్ల బాండ్ల రాబడులు కూడా 0.21శాతం క్షీణించి 4.282వద్ద ముగిసింది. నిఫ్టీ ఐటిఊచీ 3.89శాతం క్షీణించింది. నాలుగోత్రైమాసిక ఫలితాలు క్షీణించడమే ఇందుకు కారణం. హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ 10.74శాతం, కోఫోర్జ్ 4.24శాతం, ఇన్ఫోసిస్ 3.38, ఎల్అండ్‌టి టెక్ సేవలు 3.11శాతం, ఎంఫసిస్ 3.02శాతం, టిసిఎస్ 2.88శాతం విప్రో 0.49శాతం చొప్పున క్షీణించాయి. ఒరాకిల్ ఫైనాన్షియల్స్ మాత్రం 2.51శాతంపెరిగింది. ఇక అద్వైత్ ఎనర్జీ ట్రాన్సిషన్స్ 2.20శాతం, అజంతా ఫార్మా 0.18శాతంపెరిగితే 360 వన్‌వామ్ 4.31శాతం క్షీణించింది. కేంద్రప్రభుత్వ సిఎంపిడిఐ సంస్థ 3.40శాతం హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ 1.65శాతం చొప్పున క్షీణించాయి. లూపిన్ 0.51శాతం,. ఎల్అండ్‌టి 1.32శాతం దిగువన నమోదయితే టాటాఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ 1.17శాతంపెరిగింది. టెక్ మహీంద్ర 2.5శాతం పెర్సిస్టెంట్ సిస్టమ్స్ 4.88శాతం క్షీణించాయి.


## ఎన్‌ఎస్ఇ వివాదాల సెటిల్‌మెంట్‌కు

# రూ.1800 కోట్లు

### సెబీ ఉన్నతస్థాయి ప్యానెల్ సిఫారసులు



**ముంబయి, ఏప్రిల్ 22:** దేశంలోని అతిపెద్ద ఈక్విటీ ఎక్స్ఛేంజ్ అయిన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఈ), మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ మధ్య పదేళ్లుగాకొనసాగుతున్న చట్టపరమైన పోరాటం కొలిక్కివస్తోంది. సెబీ ఏర్పాటు చేసిన ఒక ఉన్నత స్థాయి ప్యానెల్, ఎన్ఎస్ఈపై ఉన్న పెండింగ్ వివాదాలు సెటిల్‌మెంట్‌కు సుమారు రూ. 1,800 కోట్లకు పైగా చెల్లించాలని సిఫార్సు చేసింది. గతంలో ఎన్ఎస్ఈ పాలనలో జరిగిన లోపాలు, ముఖ్యంగా ట్రేడింగ్ కోలొకేషన్ వివాదం వంటి అంశాల కారణంగా ఈ వివాదం తలెత్తింది. ఈ సమస్యల వల్లే ఎన్ఎస్ఈ ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఐపిఒ దాదాపు పదేళ్ల పాటు వాయిదా పడింది. ఈ తాజా సిఫార్సు అమలులోకి వస్తే, ఎన్ఎస్ఈ ఐపీఓ మార్గం సుగమం కావడమే కాకుండా, మార్కెట్ రెగ్యులేటర్‌తో ఉన్న విభేదాలు కూడా తొలగిపోయే అవకాశం ఉంది. ఈ కేసులను పరిష్కరించుకోవడానికి ఎన్ఎస్ఈ గతంలో రూ. 1,300 కోట్లను కేటాయించగా, ప్యానెల్ మాత్రం అంతకంటే ఎక్కువగా రూ. 1,800 కోట్లు చెల్లించాలని సూచించింది. పక్షం రోజుల క్రితం ఎన్ఎస్ఈ పంపిన సెటిల్‌మెంట్ ప్రతిపాదనను పరిశీలించిన తర్వాత ప్యానెల్ ఈ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈ సెటిల్‌మెంట్ ప్రక్రియను అధికారికంగా ఖరారు చేసే ముందు, సెబీ ఒక డిమాండ్ లేఖను జారీ చేసే అవకాశం ఉంది. ఈ భారీ మొత్తం చెల్లింపు ద్వారా ఎన్ఎస్ఈ తనపై ఉన్న పాత మరకలను తుడిచేసుకుని, ఒక పారదర్శకమైన సంస్థగా ఐపీఓ వైపు అడుగులు వేయాలని భావిస్తోంది. మరోవైపు ఐపీఓ దిశగా ఎన్ఎస్ఈ తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకే ఐపీఓ కోసం ఏకంగా 20 బ్యాంకులని మర్చంట్ బ్యాంకర్లుగా నియమించుకోవడం ఎన్ఎస్ఈ ప్రాముఖ్యతను చాటిచెబుతోంది. ప్రస్తుతం ఎన్ఎస్ఈలో దాదాపు 1.90 లక్షల మంది ఇన్వెస్టర్లున్నారు. ఈ సెటిల్‌మెంట్ ప్రక్రియ సజావుగా సాగితే, మే నెలాఖరు నాటికి ఎన్ఎస్ఈ తన ఆర్థిక ఫలితాలను ప్రకటించిన వెంటనే ఐపీఓ కోసం సెబీ వద్ద ముసాయిదా పత్రాలు దాఖలు చేసే అవకాశం ఉందన్న అంచనాలు పెరిగాయి.




# ట్రెంట్ నికరలాభం రూ.455కోట్లు!

**ముంబయి, ఏప్రిల్ 22:** టాటాగ్రూప్‌లోని ట్రెంట్ సంస్థ నికరలాభాలు 30%పెరిగి రూ.455 కోట్లకు చేరాయి. అంతకుముందు ఏడాది ఇదేకాలంలో ఆర్జించిన 350 కోట్లతోపోలిస్తే 30% పెరిగింది. నికరలాభాలు పెరగడంతో కంపెనీ ప్రతి ఈక్విటీ షేరుకు రూ.6 డివిడెండ్ ప్రకటించింది. 74 సర్వసభ్య సమావేశం ముగిసిన మూడోరోజునుంచి డివిడెండ్ చెల్లింపులు ప్రారంభిస్తామని వెల్లడించింది. కంపెనీ రాబడులు కూడా 20.2%పెరిగి 4106 కోట్లనుంచి రూ. 4937 కోట్లకు పెరిగాయి. ఇక నిర్వహణ లాభాలు కూడా 40శాతం పెరిగాయి. 656 కోట్ల నుంచి రూ.919 కోట్లకు పెరిగినట్లు కంపెనీ ఎక్స్ఛేంజిలకు నివేదికిచ్చింది. ఎబిడిటా మార్జిన్ కూడా 16 నుంచి 18శాతానికి పెరిగింది. బోనస్ ఇష్యూను కూడాప్రకటించింది. 1:2 నిష్పత్తిలో షేర్లు జారీచేస్తోంది. ప్రతి రెండుషేర్లకు అదనంగా ఒకటి కేటాయిస్తుంది. అయితే వాటాదారుల ఆమోదం పొందాల్సి ఉంది. ట్రెంట్ లాభాలు పెరగడంతో కంపెనీ షేర్లు ఒకటిశాతం పెరిగి 4434.50 గా ట్రేడ్ అయ్యాయి.

# 6నెలల్లోనే 26 లక్షలకోట్ల వృద్ధి

## భారత్‌లో భావితరం బిజినెస్ టైకూన్ల సంపద వృద్ధి!




**ముంబయి, ఏప్రిల్ 22:** భారత్‌కార్పొరేట్ రంగంలోని భావితరం బిజినెస్ టైకూన్లు 50 మంది కేవలం ఆరునెలల్లోనే తమ సంపదను రూ.26 లక్షలకోట్లు పెంచుకోగలిగారని ఎఎస్‌కె ప్రైవేట్ వెల్త్, హురూన్ ఇండియా సక్సెసర్స్ 50 సర్వేలో వెల్లడి అయింది. ఈ భావితరం 50 మంది బిజినెస్ దిగ్గజాలు తమ కుటుంబ సంస్థలను మరింతగా విస్తరించి సంపదను గణనీయంగా పెంచారు. దేశంలోని వారసత్వ వ్యాపారాలు కొత్త తరహా విస్తరణదిశగా వెళుతున్నట్లు తేలింది. మొత్తం రూ.26.3 లక్షలకోట్లు మార్కెట్ విలువలుపెరిగాయంటే వారి వ్యాపార సామ్రాజ్యాలు మరింత విస్తరించుకోగలిగినట్లు తెలుస్తోంది. 2020లో రూ.4.6 లక్షలకోట్లు ఉన్న ఈ మొత్తం విలువలు 2026 నాటికల్లారూ.30.9 లక్షలకోట్లకు సంస్థల మార్కెట్ విలువలు పెరిగాయని అంచనా. అంటే 6.7 రెట్లు సంపద సృష్టిజరిగిందని హురూన్ ఇండియా వెల్లడించింది. మొత్తం పదిమంది భావితరం వాణిజ్యవేత్తలు విస్తరణలో మరింత వేగంతో దూసుకుపోతున్నారు. వీరిలోజూపిటర్ వ్యాగన్స్ అధినేత వికాస్ లోహియా డిప్యూటీ ఎండిగా సంపదను 152.8 రెట్లు వృద్ధిచేసారు. అందరికంటే అగ్రస్థానంలో నిలిచారు. ఆయన నాయకత్వంతోకంపెనీ రూ.10,666 కోట్లు పెరిగిమొత్తం రూ.10,736 కోట్లకు చేరింది. ఆ తర్వాత తిలక్‌నగర్ ఇండస్ట్రీస్ జెఎండి అమిత్ దహానుకర్, జిందాల్ స్టెయిన్‌లెస్ ఎండి అభ్యుదయ్ జిందాల్‌లు తమతమ సంపదను 52.5 రెట్లు పెంచుకోగలిగారు. ఈ విస్తరణలో ఆటోమొబైల్, ఆటో విడిభాగాల రంగాలు అత్యధికంగా విస్తరించాయి. మొత్తం తొమ్మిది కంపెనీలు ఈ విభాగంలో ఉంటే హెల్త్‌కేర్ కంపెనీలు ఆరువరకూ ఉన్నాయి. వీటి మొత్తం మార్కెట్ విలువలు రూ.7.26 లక్షలు పెంచుకోగలిగాయి. ముంబయి, ఢిల్లీ నగరాల్లోనే వ్యాపారవేత్తలే ఎక్కువగా టర్నోవర్ పెంచుకోగలిగారు. ఈ రెండునగరాల్లో మొత్తం 12 కంపెనీల కేంద్రకార్యాలయాలున్నాయి. కార్పొరేట్ పరంగా 50 కంపెనీలు రూ.8.2లక్షలకోట్లు వార్షిక రాబడులు సాధించాయి. రూ.90,168 కోట్లు నికరలాభం ఆర్జించగలిగాయి. వార్షికవృద్ధి 14.4శాతంగా ఉంది. ఈ కంపెనీలు మొత్తంగా 8.6 లక్షలమంది ఉద్యోగులతో సిఎస్ఆర్ కార్యకలాపాలకు ఈ 50 కంపెనీలు రూ.1028 కోట్లు అందిస్తున్నాయి. కంపెనీ విలువలు వృద్ధిచేయడంలో ఆదాని విభాగంలో కరన్ ఆదానికూడా రూ.2,67,525 కోట్లకు పెంచగలిగారు.



## పశ్చిమాసియా ఉద్రిక్తతలే

# రెపోరేట్లకు గండి!

### ఆర్బీఐ ఎంపిసి మినిట్స్ విడుదల

**ముంబయి, ఏప్రిల్ 22:** రిజర్వుబ్యాంకు ఇటీవల నిర్వహించిన మానిటరీపాలసీ సమీక్షలో కమిటీ సభ్యులు పశ్చిమాసియా ఉద్రిక్తతలనే ఎక్కువగా పరిగణనలోనికి తీసుకోవాల్సి వచ్చింది. పశ్చిమాసియా సంక్షోభంతో ద్రవ్యోల్బణంపై ప్రభావం ఎక్కువ పడిందని ఎంపిసి సమీక్ష మినిట్స్ నివేదికల్లో వెల్లడి అయింది. ఎంపిసి మినిట్స్‌ను బుధవారం విడుదలచేసింది. భారత ఆర్థికవ్యవస్థపై పశ్చిమాసియా యుద్ధ ప్రభావం తీవ్రస్థాయిలో ఉందని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. ఎగుమతులపరంగానే కాకుండా సంక్లిష్ట ఉత్పత్తుల సరఫరాపరంగాను, ఇంధనం, కమోడిటీ ధరలు, విదేశీ జమలు వంటి వాటితోపాటు గ్లోబల్ డిమాండ్‌కూడా రెపోరేట్లు యదాతథంగా కొనసాగించేందుకు దోహదంచేసిందని అభిప్రాయపడ్డారు. భౌగోళిక అనిశ్చితి పరిస్థితులు గతనెలలో మరింతగా విస్తరించినందున వడ్డీరేట్లజోలికి వెళ్లకపోవడమే సముచితమని ఎంపిసి సమీక్షలో సభ్యులాంతా ఏకాభిప్రాయం వ్యక్తంచేసారు. సరఫరా అంతరాయాలు రవాణా నెట్‌వర్క్‌ను పూర్తిగా పక్కన పెట్టాయని, దీనివల్ల వృద్ధిమాట అటుంచి ఎక్కువ సమస్యలు ఎదురయినట్లు ఆర్బీఐ మినిట్స్‌లో పొందుపరిచారు. ఈపరిస్థితులవల్ల ద్రవ్యోల్బణం మరింతపెరిగే ప్రమాదం ఉందని అందువల్లనే రెపోరేట్లు సవరణలు మంచిది కాదనే అభిప్రాయం వ్యక్తం అయిందని నివేదికలో తెలిపారు. మూడురోజుల సమీక్షలో సెంట్రల్ బ్యాంకు తన రెపోరేట్లను స్థిరంగానే కొనసాగించింది. అప్రమత్తతతో వ్యవహరిస్తూ సవరణలపట్ల వేచిచూసే ధోరణి అనుసరించింది. ఆరునెలలుగా కొనసాగుతున్న ఇరాన్ వివాదంలో ఇంధన సరఫరా బ్రేక్‌డౌన్‌తోపాటు ద్రవ్యోల్బణం, ఆర్థికవృద్ధి కి బ్రేకులు వేసాయి. ఆరుగరుసభ్యులున్న ఎంపిసిలో అందరూ కూడా కొనుగోలురేటును 5.25శాతంవద్దనే ఉంచినట్లు తేలింది. రూపాయి క్షీణత, వాణిజ్య ఎగుమతులు క్షీణించడం వంటి వాటితో రెపోరేట్లలో వేచిచూసేధోరణి అనుసరించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., IslamiaJr.College Compound, MGM Road, Warangal-506002. RNI No.64849 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.